సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 330
సోమవారం 12-8-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఏడు నుంచి ఆరుకు...
ర్యాంక్‌లో 48 నుంచి 71 కి.. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు నిరాశ - 11లో



ఇలా చేయకుంటే తిరస్కరణ
ఆరోగ్య బీమా దరఖాస్తులో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే - 13లో



పాక్షిక వైద్యసేవలు బంద్
కోల్‌కత వైద్యురాలి ఉదంతంలో నిందితుడిని శిక్షించాలని కోరుతూ నేటి నుంచి దేశవ్యాప్తంగా పలు వైద్యసేవలను 'ఫోర్డా' నిలిపివేయనుంది.
వివరాలు 6లో ▸



నట్వర్ సింగ్ కన్నుమూత
మాజీ దౌత్యాధికారి, కేంద్ర మాజీ మంత్రి కున్వర్ నట్వర్ సింగ్ (93) అనారోగ్యంతో గురుగ్రామ్‌లో కన్నుమూశారు.
వివరాలు 6లో ▸



నాపై అమెరికా కుట్ర
బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవి నుంచి తనను తప్పించడం వెనుక అమెరికా హస్తముందని షేక్ హసీనా ఆరోపించారు.
వివరాలు 6లో ▸



వాగులో కొట్టుకుపోయిన కారు
హిమాచల్‌లోని ఉనా జిల్లాలో జైజోన్ చో వాగు ఉప్పొంగడంతో ఎస్‌యూవీ వాహనం కొట్టుకుపోయి 9 మంది మృతి చెందారు.
వివరాలు 6లో ▸

'అసైన్డ్' ఆగడం!

రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన చంద్రబాబు సర్కారు

20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై రైతులకు సంపూర్ణ హక్కులిచ్చిన వైఎస్ జగన్

- 9 లక్షల ఎకరాలు 22 ఏ జాబితా నుంచి తొలగింపు
- ఒరిజినల్ అసైనీలకు న్యాయబద్ధంగా, తమ ఇష్టపూర్తిగా అవసరానికి అమ్ముకునే హక్కు
- ఒకవేళ ఇప్పటికే చేతులు మారినా ఒరిజినల్ అసైనీలకే హక్కులు
- అలాంటప్పుడు అది బడుగు, బలహీన వర్గాల రైతులకు మేలు చేసినట్లా? కీడు చేసినట్లా?
- లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములపై ఆంక్షలతో మళ్లీ మొదటికి కథ
- అసైన్డ్ భూములన్నీ అన్యాక్రాంతమైపోయాయంటూ అడ్డగోలు వాదన
- రాజకీయ కారణాలతో అసైన్డ్ రైతుల పొట్టగొడుతున్న సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములపై వైఎస్సార్ సీపీ హయాంలో యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) పొందిన రైతన్నలపై కూటమి సర్కారు కక్ష సాధింపులకు దిగింది. దశాబ్దాల తర్వాత తమ భూములపై ఆంక్షలు తొలగిపోవడంతో సంతోషంగా సాధారణ రైతులుగా సాగు చేసుకుంటున్న వారిని మళ్లీ కష్టాల్లోకి నెట్టింది. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూముల చట్ట సవరణ ద్వారా ఫ్రీ హోల్డ్ అయిన భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని సీఎం చంద్రబాబు ప్రభుత్వం తాజాగా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. అంతేకాకుండా ఫ్రీ హోల్డ్ అయిన భూములన్నింటిపైనా విచారణ నిర్వహించాలని, రీ వెరిఫికేషన్ చేయాలని స్పష్టం చేసింది. వాస్తవానికి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను అనధికారికంగా నిలిపివేసింది. ఇప్పుడు దాన్ని అధికారికంగా ప్రకటించింది. దీంతో లక్షలాది రైతు కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వం ఒరిజినల్ అసైనీలకు న్యాయబద్ధంగా, ఇష్టపూర్తిగా అమ్ముకునే హక్కు కల్పించింది. అసైన్డ్ పేదలకు భూములపై

మిగతా 14వ పేజీలో ▶

పంటల బీమా ప్రీమియం

తక్షణమే చెల్లించండి

సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ డిమాండ్

- 2023–24 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతన్నలను వెంటనే ఆదుకోవాలి
- గతంలో ఏటా ఏప్రిల్–మే నెలల్లోనే ప్రీమియం చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం
- 54.55 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్లు అందించి అండగా నిలిచాం
- ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ ప్రీమియం కట్టకపోవడంతో కేంద్రం తన వాటా ఇవ్వలేదు
- సూపర్ సిక్స్ హామీ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయాన్ని తక్షణమే చెల్లించాలి



సాక్షి, అమరావతి: ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ చెల్లించకపోవడంతో రైతులకు పంటల బీమా పరిహారం చెల్లింపులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీ కింద

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

టీటీడీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్ల భారీ విరాళం



తిరుమల: పంజాబ్‌లోని ట్రైడెంట్ గ్రూప్‌నకు చెందిన రాజిందర్‌గుప్తా టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.21 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును కుటుంబసభ్యులతో కలసి రాజిందర్‌గుప్తా టీటీడీ ఏఈవో సి.వెంకయ్య చౌదరికి తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు.

టీడీపీ నేత క్వారీలో జేసీబీ డ్రైవర్ మృతి!



చిత్తూరు జిల్లా మాదిగబండ సమీపంలోని టీడీపీ నేతకు చెందిన క్వారీలో చిన్నస్వామి (38) అనే జేసీబీ ఆపరేటర్ మృతి చెందాడు. 108కు, పోలీసులకు సమాచారమివ్వకుండా బైక్‌పైనే మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకు రావడంతో అది ప్రమాదమా లేక హత్యా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.
వివరాలు 10లో ▸

సిబిల్ అప్‌డేట్ @ 15




రుణం తీసుకుని సకాలంలో చెల్లిస్తున్న వారు సిబిల్ స్కోర్ వేగంగా పెంచుకునే అవకాశంతో పాటు సిబిల్ స్కోర్ వివాదాలు సత్వరం పరిష్కరించేలా ఆర్‌బీఐ కీలక అడుగు ముందుకు వేసింది. ప్రతి 15 రోజులకోసారి సిబిల్‌ను అప్‌డేట్ చేయాల్సిందిగా అటు సిబిల్ వంటి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలతో పాటు, రుణాలిచ్చే సంస్థలనూ ఆదేశించింది.
వివరాలు 2లో ▸

నూతన వంగడాలను ఆవిష్కరించిన మోదీ

కరువు, నీటి ఎద్దడి పరిస్థితులనూ తట్టుకుని పెరిగే వంగడాలు
అధిక దిగుబడినిచ్చే మొత్తం 109 రకాల వంగడాలు అందుబాటులోకి
6లో

కొట్టుకుపోయిన 19వ నంబర్ గేటు ఇదే.. (వృత్తంలో)



కొట్టుకుపోయిన 'తుంగభద్ర' గేటు

ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరి

- కొత్త గేటు ఏర్పాటుచేయాలంటే నీటి మట్టాన్ని తగ్గించాలి
- అంటే డ్యాం నుంచి 61 టీఎంసీలు వదలాల్సిందే.. నెలాఖరుకు కొత్త గేటు అమర్చే అవకాశం
- వచ్చే మూడు, నాలుగు నెలల్లో తుంగభద్రకు కనిష్ఠంగానే వరద
- దీంతో ఇక ఈ ఏడాది డ్యాం నిండే అవకాశాలు తక్కువే
- రాయలసీమ, ఉత్తర కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో 17.33 లక్షల ఆయకట్టుపై తీవ్ర ప్రభావం
- పైగా.. 'సీమ'లో వర్షాభావం.. తాగునీటికి ఇబ్బందులు తప్పవని సర్వత్రా ఆందోళన

3లో

అతివేగానికి ఐదు ప్రాణాలు బలి

లారీని ఢీకొన్న కారు.. చెన్నై–తిరుపతి జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం
నలుగురు ఏపీ విద్యార్థులు, ఓ తమిళనాడు విద్యార్థి మృతి
మరో ఇద్దరి పరిస్థితి విషమం
10లో


ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

మహిళా జెడ్పీటీసీపై టీడీపీ గూండాల దాడి

- పల్నాడు జిల్లా గారపాడులో దౌర్జన్యకాండ
- సెల్‌ఫోన్ పగులకొట్టి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ తల్లిని గాయపర్చిన వైనం
- జెడ్పీటీసీ స్వర్ణకుమారి భర్తను తమకు అప్పగించాలని వీరంగం
- భయంతో ఇంటి లోపల తాళాలు వేసుకున్న కుటుంబ సభ్యులు
- జెడ్పీటీసీ భర్త శివాజీని గ్రామంలోకి రావొద్దని పోలీసుల హుకుం

5లో

ఆటపాకకు అదనపు హంగులు

పర్యాటక కేంద్రంగా ఆటపాక

బోటు షికారులో విదేశీ, స్వదేశీ పక్షులను దగ్గర నుంచి తిలకించే అవకాశం ఒక్క ఆటపాకలో మాత్రమే ఉంది. ఆటపాక పక్షుల కేంద్రాన్ని ప్రభుత్వం గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు. ఏటా వేసవిలో పక్షులకు నీటి కొరత ఏర్పడటంతో బోటు షికారు నిలిపివేస్తున్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా పంట కాల్వల ద్వారా వచ్చే నీటిని నేరుగా ఆటపాక పక్షుల విహార చెరువుకు మళ్లించేలా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

ఆటపాక పక్షుల కేంద్రంలో పక్షుల అవాసాల కోసం ఇటీవల ఏర్పాటు చేసిన కృత్రిమ ఇనుప స్టాండ్లు



రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు
60 పక్షుల నివాస స్టాండ్లు ఏర్పాటు
అతిథి గృహానికి మరమ్మతులు
ఆకట్టుకుంటున్న కొల్లేరు విహంగాల చిత్రాలు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామం ఆటపాక పక్షుల కేంద్రానికి కొత్త కళ వచ్చింది. పర్యాటకులను ఆకట్టుకోవడానికి అటవీ శాఖ అదనపు హంగులను సమకూర్చింది. ఏటా సెప్టెంబర్ నుంచి మార్చి వరకు సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర దేశాల నుంచి వేల సంఖ్యలో వలస పక్షులు విడిది కోసం కొల్లేరు సరస్సుకు విచ్చేస్తాయి. అతిథి పక్షుల రాక దగ్గర పడటంతో అటవీ శాఖ వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో హిమ శైలజ ఆదేశాలతో అధికారులు ఆటపాక పక్షుల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు.

పెలికాన్ ప్యారడైజ్‌గా..

తెలుగు రాష్ట్రాల్లో విదేశీ పెలికాన్ వలస పక్షులు ఎక్కువగా విహరించే ఏకైక ప్రాంతం కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం. పెద్ద సంఖ్యలో పెలికాన్ పక్షుల రాక కారణంగా దీనికి పెలికాన్ ప్యారడైజ్ అని నామకరణ చేశారు. ఆటపాక పక్షుల కేంద్రంలో 289 ఎకరాల్లో పక్షుల విహరించడానికి చెరువును అటవీ శాఖ తవ్వించింది. పక్షుల నివసించడానికి వృక్షాలు లేకపోవడంతో అటవీ శాఖ 150 కృత్రిమ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది. వీటిలో 60 స్టాండ్లు తుప్పుపట్టాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. పెలికాన్ పక్షులు స్టాండ్లపై సంతానోత్పత్తి సాగిస్తాయి.

గూడబాతుల గుంపు.. ఎంతో ఇంపు

కొద్ది రోజుల్లో వలస పక్షుల రాక ప్రారంభం కానుంది. ఇప్పటికే దాదాపు 1,500 పెలికాన్ పక్షులు ఆటపాక కేంద్రంలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఇక్కడ ప్రకృతి వాతావరణం అనుకూలించడంతో ఆటపాకలో స్థిర నివాసాలకు ఇవి ఇష్టపడుతున్నాయి. ఇక్కడ గూడబాతుల(పెలికాన్) గుంపులను తిలకించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతారు. ఇవే కాకుండా కొల్లేరు సరస్సు పరీవాహక ప్రాంతాల్లో దాదాపు 184 వివిధ జాతుల పక్షులను చూడవచ్చు.

స్వాగత ద్వారాలు.. మౌలిక వసతులు

ఆటపాక కేంద్రంలో రూ.20 లక్షల నిధులతో ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టామని అటవీ శాఖ డెప్యూటీ రేంజర్ జీవీవీ జయప్రకాష్ చెప్పారు. కేంద్రంలో సీసీ కెమెరాలు, వాల్ పెయింటింగ్, విహార బోట్ల రిపేరు, గెస్ట్ హౌస్‌కు మరమ్మతులు, ఏసీ, వాటర్ కూలర్, లైఫ్ జాకెట్లు కొనుగోలు, చిల్డ్రన్స్ పార్కులో ఇసుక పూడిక, ఆట వస్తువులకు పెయింటింగ్, పర్యాటకులు కూర్చోవడానికి బెంచీల ఏర్పాటు వంటి పనులను చేపట్టామన్నారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి నుంచి పక్షుల కేంద్రం చేరే క్రమంలో స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి.

ఇదండీ సంగతి



ప్రస్తుతానికి సరిపెట్టుకో..!



మాయమైపోతున్నాడు రైతన్నవాడు

సాగుకు యువత దూరం

వ్యవసాయం ఆశించదగ్గ వృత్తి కాదంటున్న గ్రామీణ యువత
సాగులో అడుగు పెట్టలేమంటున్న 70% యువకులు
ఆదాయ మార్గాలు బాగున్న వృత్తుల వైపే చూపు
ఉత్పాదకత లేని కారణంగా సాగును వదిలేస్తామంటున్న 60% రైతులు
స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024లో వెల్లడి
14లో



టీచర్ల 'సర్దుబాటు'పై కొత్త మార్గదర్శకాలు

నేటి నుంచి ఈనెల 14లోగా సర్దుబాటు పూర్తి చేయాలని ఆదేశం

టీచర్ల అభిప్రాయాలు తీసుకుని, కొత్త మార్గదర్శకాలు ఇచ్చామన్న సర్కారు
పాతవాటినే కొత్తగా ఇచ్చారంటున్న ఉపాధ్యాయ సంఘాలు.. తమ సూచనలను పరిగణనలోకి తీసుకోలేదని ఆగ్రహం
3లో

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కుమారుడిపై టీడీపీ దాడి

అధికార పార్టీ అరాచకాలను ప్రశ్నించడమే పాపమైంది..



గాయపడిన సేతురాములు

నెల్లూరు సిటీ: అధికారం అండతో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతూనే ఉన్నారు. తాజాగా తమను ప్రశ్నిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నేత కుమారుడిపై దాడికి తెగబడ్డారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని రెండో డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్ గుడిపల్లిపాడులోని శివాలయం నిర్వహణను మూడేళ్లుగా చూస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ సిబ్బంది జీతభత్యాలు నిలిపివేయడం, శివాలయంలో పూజలు అందుకునేందుకు వచ్చినప్పుడల్లా పూజారిని అక్కడ లేకుండా చేయడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయ ప్రాంగణంలోని శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు. వారం రోజులుగా ఇవి జరుగుతున్నాయి. సేతురాములు తన కుమారుడికి మొక్కులో భాగంగా అభిషేకం చేయాలని ఇటీవల నిర్ణయించారు. అయితే టీడీపీ శ్రేణులు ఆ అభిషేకం కూడా జరగనీయకుండా పలు సాకులతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో టీడీపీ శ్రేణుల చర్యలను నిత్యం ప్రశ్నిస్తున్న సేతురాములుపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గుడిపల్లిపాడు వద్ద ఉండే రొయ్యల గుంతల వద్ద పనిచేసుకుంటున్న సేతురాములుపై అనిల్ తన అనుచరులు గొడ్డేటి వెంకటేశ్వర్లు, దివాకర్, మేకల శేషయ్య, ఈశ్వర్, శేఖర్‌లు దాడి చేశారు. గొడ్డేటి వెంకటేశ్వర్లు, అనిల్, దివాకర్‌లు తన గొంతు పట్టుకుని చంపేందుకు ప్రయత్నించారని సేతురాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నన్ను హతమార్చేందుకు టీడీపీ నేతల కుట్ర

జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు



పాయకరావుపేట(నక్కపల్లి): హేచరీల్లో ప్యాకింగ్ ఏజెన్సీల విషయంలో టీడీపీ నేతల దౌర్జన్యాలను, ఒత్తిళ్లను ప్రశ్నిస్తున్న తనను అంతమొందించే కుట్ర జరుగుతోందని జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాయకరావుపేట మండలంలో ఉన్న పలు హేచరీల్లో ప్యాకింగ్ సెక్షన్‌లో పనిచేసే కూలీలకు సంబంధించి ఏజెంట్ కమీషన్లు తమ వర్గీయులకే ఇవ్వాలని కొందరు టీడీపీ నాయకులు యాజమాన్యాలపై ఒత్తిడి చేస్తుండగా, తాను మత్స్యకారులకు, కూలీలకు అండగా నిలబడినట్టు తెలిపారు. దీంతో కక్షగట్టిన టీడీపీ నేత బొంది కాశీవిశ్వనాథ్ అతని అనుచరులను తనపై ఉసిగొల్పుతున్నాడని, తనను అంతమొందించేందుకు కుట్రపన్నాడని, ఈ మేరకు తనకు సమాచారం వచ్చిందని వివరించారు.

డీడీఎన్‌ఎస్ ద్వారా ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేలకు పెంపు

త్వరలో ఉత్తర్వులు.. : మంత్రి ఆనం



సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని రూ.50 వేల లోపు వార్షికాదాయం ఉండే ఆలయాల్లో నిత్య పూజల నిర్వహణతో పాటు అర్చకుల గౌరవ వేతనం కోసమని ధూప దీప నైవేద్యం(డీడీఎన్‌ఎస్) పథకం ద్వారా ప్రతి నెలా అందించే ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్టు ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. పెంపునకు సంబంధించిన ప్రతిపాదనల ఫైలును సీఎం ఆమోదం కోసం పంపామని, త్వరలోనే జీవో జారీచేయనున్నట్టు తెలిపారు. (దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలు ఏటా కామన్‌గుడ్‌ఫండ్స్'సీజీఎఫ్'కు అందించే నిధుల నుంచి డీడీఎన్‌ఎస్ పథకం ద్వారా దేవదాయ శాఖ ఆయా ఆలయాలకు ఆర్థిక సాయం చేస్తుంటుంది.) రూ.113 కోట్ల సీజీఎఫ్ నిధులతో 160 ఆలయాల ఆధునీకీకరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆధునీకీకరించిన తన చాంబర్‌లోకి ఆదివారం ఆయన ప్రవేశించారు. విజయవాడకు సమీపంలోని కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం వద్ద గతంలో జరిగిన జల హారతులను మళ్లీ ప్రారంభిస్తున్నామని, దీనిపై మంత్రుల బృందం సోమవారం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో దేవదాయ శాఖ భూములపైనా ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. నెల్లూరు జిల్లాలో రెండు ఆలయాలకు సంబంధించి ప్రాథమిక విచారణలో తప్పు జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసినట్టు చెప్పారు. విజయవాడ దుర్గ గుడి అంతరాలయంలో వీడియోగ్రఫీ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సిబిల్ అప్‌డేట్ @15

వచ్చే జనవరి 1 నుంచి 15 రోజులకోసారి సిబిల్ అప్‌డేట్

బ్యాంకులు, సిబిల్‌కు ఆర్‌బీఐ ఆదేశం

ప్రస్తుతం నెలకోసారే అప్‌డేట్

సాక్షి, అమరావతి: రుణం తీసుకుని సకాలంలో చెల్లిస్తున్న వారు సిబిల్ స్కోర్ వేగంగా పెంచుకునే అవకాశంతో పాటు సిబిల్ స్కోర్ వివాదాలు సత్వరం పరిష్కరించేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక అడుగు ముందుకు వేసింది. ఇక నుంచి ప్రతి 15 రోజులకోసారి సిబిల్ స్కోర్‌ను అప్‌డేట్ చేయాల్సిందిగా అటు సిబిల్ వంటి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలతో పాటు, రుణాలిచ్చే సంస్థలనూ ఆదేశించింది. ఈ నిర్ణయం జనవరి1, 2025 నుంచి అమల్లోకి వస్తుందని, తదనుగుణంగా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు 15 రోజులకోసారి రుణాల మంజూరు చెల్లింపుల వివరాలను క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ప్రస్తుతం నెలకోసారి బ్యాంకులు సమాచారం ఇస్తున్నాయి. ఈ సమాచారం కూడా లోపభూయిష్టంగా ఉంటుండటంతో సిబిల్ స్కోర్‌పై పలు వివాదాలు తలెత్తుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఆర్‌బీఐ తాజా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పలు సంస్థలు రోజుల వ్యవధికి కూడా రుణాలిస్తున్నాయని, ఇలా 15 రోజులకోసారి సమాచారం అప్‌డేట్ చేయడం ద్వారా అటు రుణ గ్రహీతలతో పాటు రుణాలిచ్చే సంస్థలు కూడా ప్రయోజనం పొందుతాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అధునాతన టెక్నాలజీ అందుబాటులోకొచ్చిన ఈ రోజుల్లో 15 రోజులకోసారి సమాచారం అప్‌డేట్ చేయడానికి ఎలాంటి ఇబ్బందులుండవంటున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో లాగా రానున్న రోజుల్లో రియల్ టైమ్‌లో అంటే ఎప్పుడు రుణం చెల్లిస్తే అప్పుడే సిబిల్ స్కోర్ అప్‌డేట్ చేసేలా ఆర్‌బీఐ అడుగులు వేస్తోందనడానికి ఇది ఉదాహరణగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం సిబిల్ స్కోర్‌లో ఏదైనా తప్పు జరిగితే దాని సవరణకు 60 నుంచి 90 రోజుల సమయం పట్టేదని అది ఇప్పుడు 30 నుంచి 45 రోజులకు తగ్గనుండటంతో సిబిల్ స్కోర్ వివాదాలు వేగంగా పరిష్కారమవుతాయంటున్నారు. అదే విధంగా సకాలంలో చెల్లించే వారికి స్కోర్ పెరగడం ద్వారా రానున్న కాలంలో తీసుకునే రుణాలపై తక్షణ ప్రయోజనం పొందే వెసులుబాటు కలుగుతుందని, అదే విధంగా రుణ గ్రహీత ఆర్థిక పరిస్థితి కూడా తెలిసి దానికి అనుగుణంగా బ్యాంకులు నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని చెబుతున్నారు.

తప్పుల సవరణ 30 నుంచి 45 రోజుల్లో



పంటల బీమా ప్రీమియం తక్షణమే చెల్లించండి

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టుబడి సాయంగా సీఎం చంద్రబాబు ఏటా రైతులకు ఇస్తామన్న రూ.20 వేలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ మేరకు వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే..

ఉచిత పంటల బీమాలో ఆదర్శంగా నిలిచాం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని మా ప్రభుత్వ హయాంలో ఏటా ఏప్రిల్–మే నెలల్లో చెల్లించి నష్టపోయిన రైతులను జూన్‌లో ఆదుకున్నాం. ఖరీఫ్‌లో పంటలు వేసే సమయానికి రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి సమర్థంగా పథకాన్ని అమలు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించిన వెంటనే కేంద్రం కూడా తన వాటా విడుదల చేస్తుంది. అనంతరం సుమారు 30 రోజుల్లోగా బీమా కంపెనీ పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంది. ఇలా మా ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మంది రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.7,802 కోట్లు అందించి అండగా నిలిచాం. తద్వారా ఉచిత పంటల బీమా విషయంలో మన రాష్ట్రం దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనతతో రైతులకు తీవ్ర నష్టం..

2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎన్నికల కోడ్ కారణంగా ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మీ ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాల్సి ఉన్నప్పటికీ దాని గురించి పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ ప్రీమియం కట్టకపోవడంతో కేంద్రం కూడా తన వాటా ఇవ్వలేదు. ఇప్పటికే జూన్, జూలై మాసాలు గడిచిపోయాయి. ఆగస్టులో దాదాపు పక్షం రోజులు పూర్తి కావస్తున్నా మీ ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేక పోవడం అత్యంత విచారకరం. ఈ సంవత్సరం కోస్తాలో అతివృష్టి, రాయలసీమలో కరువు వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పటికైనా మేలుకుని వెంటనే ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు బీమా పరిహారం చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.



మళ్లీ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగే దుస్థితి

రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు చొప్పున ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారు. మీరిచ్చే పెట్టుబడి సహాయం కోసం రైతులంతా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకూ దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గతంలో కోవిడ్‌తో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలన్నీ కుదేలైనా మా ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా అన్నదాతలకు రైతు భరోసా అందించాం. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సీజన్‌లో రైతు భరోసా చెల్లించాం. ఆ విధంగా 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288 కోట్లు పెట్టుబడి సహాయం అందించాం. ఇప్పుడు మళ్లీ రైతులు పెట్టుబడి డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపారులు చుట్టూ మళ్లీ తిరిగే దుస్థితి కల్పించారు. వెంటనే పెట్టుబడి సహాయం కింద రైతులకు మీరు ఇస్తానన్న డబ్బులతో పాటు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి 2023–24 పరిహారం సొమ్ము విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గుర్తుపెట్టుకోండి చంద్రబాబూ!

ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడమే లక్ష్యం



చేపల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

- కేంద్ర బృందం సభ్యులు
- బందరు హార్బర్‌ను పరిశీలించిన బృందం

సాక్షి, మచిలీపట్నం: బాధ్యతాయుతమైన, స్థిరమైన ఆక్వాకల్చర్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం బృందం సభ్యులు తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం శివారులోని గిలకలదిండిలో నిర్మిస్తున్న హార్బర్‌ను ఆదివారం కేంద్ర బృందం ప్రాజెక్టు ఇండియా సహాయ ప్రతినిధి డాక్టర్ కొండ చెవ్వ, బయో డైవర్సిటీ ఎక్స్‌పర్ట్, కో–ఆర్డినేటర్ సీమ భట్, లీడ్ టెక్నికల్ స్పెషలిస్ట్ మురళీధరన్, ఆక్వా కల్చర్ స్పెషలిస్ట్ విష్ణుభట్, ఫైనాన్స్ స్పెషలిస్టు నీలకంఠ మిశ్రా, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ నీనా కోషి, సేఫ్ గార్డ్ స్పెషలిస్టు సలోమ్ ఏసుదాస్ పరిశీలించారు. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది యునైటెడ్ నేషన్ (ఎఫ్‌ఏఓ) ఆధ్వర్యంలో వాతావరణ పరిస్థితులు, మత్స్యకారుల ఇబ్బందులు, చేపల నిల్వ, ప్యాకింగ్, నీరు, ఉప్పు శాతం, భూమి, ఇతర నమూనాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన ఆక్వాకల్చర్‌పై దృష్టి పెడుతుందన్నారు. మెరుగైన, సైన్స్ ఆధారిత ఆక్వాకల్చర్ నిర్వహణ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ స్కేప్ విధానాలు అవలంబించాలని, రసాయన వినియోగం తగ్గించి స్థిరమైన ఆక్వాను ఉత్పత్తి అయ్యేలా చూడాలన్నారు. మన ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే.. రిజెక్టు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర బృందంతో భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర భేటీ అయ్యారు. బందరును ఆక్వాహబ్‌గా మార్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోలార్ పవర్డ్ బోట్స్ సాంకేతికను వినియోగించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అనంతరం కేంద్ర బృందం కలెక్టర్ డి.కె.బాలాజీని కలిసి, హార్బర్ వద్ద సేకరించిన అంశాలను ఆయనకు వివరించింది.

'ఈ- పంట' సాగేదెలా?

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన మంచి కార్యక్రమాలన్నింటినీ చీల్చి ఛిద్రం చేయడమే లక్ష్యంగా పెట్టుకొన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం.. రైతులకు ఎన్నో ప్రయోజనాలు కల్పించే 'ఈ–క్రాప్' కార్యక్రమాన్ని కూడా చిన్నాభిన్నం చేసేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం 2019లో మొదలుపెట్టిన ఈ కార్యక్రమం ఐదేళ్లు నిరాఘాటంగా సాగి, అన్నదాతలకు అండగా నిలిచింది. రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు దీని పేరును 'ఈ–పంట' అని మార్చి, దాని నమోదులోనూ మార్పులు తెచ్చింది. ఇప్పుడు ఈ మార్పులే రైతులపాలిట శాపంగా మారాయి. కొత్త ప్రభుత్వం ఫోన్ యాప్ ద్వారా పంటల వివరాల నమోదుకు అంగీకరించడంలేదు. అప్‌డేట్ చేసిన ఈ–పంట వెబ్‌సైట్ సాంకేతిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. దీనికి తోడు రైతు సేవా కేంద్రం (ఆర్బీకే)లోని సిస్టమ్ ద్వారా మాత్రమే పంట వివరాలు నమోదు చేయాలన్న నిబంధన మరిన్ని సమస్యలు సృష్టిస్తోంది.

ఫోన్ యాప్ ద్వారా పంట వివరాల నమోదుకు తిరస్కరణ

- పంట వివరాలన్నీ రైతు సేవా కేంద్రంలోని కంప్యూటర్ ద్వారానే నమోదు
- వెబ్‌సైట్‌లోనూ సాంకేతిక సమస్యలు
- వివరాల నమోదుకే రోజంతా సరి
- క్షేత్రస్థాయికి ఎప్పుడు వెళ్తామంటున్న సిబ్బంది
- కౌలుదారుల పంట వివరాల నమోదులోనూ ఇబ్బందులు
- సీసీఆర్సీ లేదా భూ యజమాని అంగీకారంతోనే నమోదు
- ఇలా అయితే నష్టమే అంటున్న కౌలుదారులు
- వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్లు సాఫీగా పంటల నమోదు
- దాని ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు



వెబ్‌సైట్ ఓపెన్ కాక ఇబ్బందులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి జాతీయ స్థాయిలో కేంద్రం శ్రీకారం చుట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు అనుసంధానం చేసి ఈ పంట నమోదు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 31న మార్గదర్శకాలు జారీ చేసి, ఈ నెల 5 నుంచి పంటల నమోదు చేపట్టింది. ఈ పంట వెబ్‌సైట్ పూర్తి స్థాయిలో సిద్ధం కాలేదు. యాప్‌లో కొత్త ఫీచర్స్‌పై క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వలేదు. గతంలో ఫోన్‌లోనే ఈ–క్రాప్ యాప్ ద్వారా పంట వివరాలు నమోదు చేసేవారు. ఆ తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలనలో ఫోటోలు అప్‌లోడ్ చేసేవారు. దీని వల్ల సమయం ఆదా అయ్యేది. ప్రస్తుతం ఈ పంట వివరాలు ఫోన్‌లో నమోదు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంలేదు. కార్యాలయం కంప్యూటర్‌లోని వెబ్‌సైట్ ద్వారా మాత్రమే వివరాలు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వివరాలను కంప్యూటర్ నుంచి ఫోన్‌లోని యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకొని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలి. రైతు సేవా కేంద్రాల్లో ఇంటర్నెట్, విద్యుత్ సరఫరా సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అసలు కంప్యూటర్‌లో ఈ పంట వెబ్‌సైట్ ఓపెన్ అవడమే చాలా కష్టం. అది ఓపెన్ అయిన తర్వాత పంట వివరాలు నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఒక్కో రైతు పంట వివరాల నమోదుకు చాలా సమయం పడుతోంది. పైగా పంట వివరాల నమోదుకే రోజంతా కార్యాలయంలోనే ఉండాల్సి వస్తోందని, క్షేత్ర స్థాయి పరిశీలన ఎప్పుడు పూర్తి చేస్తామని సిబ్బంది వాపోతున్నారు. కంప్యూటర్‌లో నుంచి మళ్లీ ఎలాగూ ఫోన్లోకి తీసుకోవాలని, అప్పుడు నేరుగా ఫోన్‌లోనే వివరాలు నమోదు చేసుకోవచ్చు కదా అన్న సూచనలూ వస్తున్నాయి. మరోపక్క కౌలుదారుల పంట వివరాల నమోదులోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సీసీఆర్సీ లేదా భూ యజమాని అంగీకారంతోనే నమోదుకు అవకాశం ఉంది. కానీ ఉన్నతాధికారులు వాస్తవ సాగు దారుల వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. అలా చేస్తే భూ యజమానుల నుంచి ఇబ్బందులు తలెత్తుతాయని కౌలుదారులు వాపోతున్నారు. మరొక వైపు సిబ్బందికి ఇచ్చిన ట్యాబ్‌లు కూడా సరిగా పనిచేయడంలేదు. దీంతో క్షేత్ర స్థాయి పరిశీలనలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఆలస్యమైతే జరిగే నష్టమిది..

ఈ క్రాప్ నమోదు ఆలస్యమైతే రైతులకు అన్ని విధాలుగా నష్టం జరుగుతుంది. ప్రధానంగా పంట కొనుగోలులో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పంట కొనుగోలు పూర్తిగా ఈ–పంట నమోదు ఆధారంగానే జరుగుతుంది. దీంతో రైతులు దళారుల ద్వారా పంటలను అమ్ముకోవల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఉచిత పంటల బీమాకు అర్హత కోల్పోతారు. తుపానులు, భారీ వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంట రైతులు ఈ–క్రాప్‌లో నమోదు కాకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ పొందే అర్హత కోల్పోతారు. సున్నా వడ్డీ రాయితీకి అర్హత కోల్పోతారు.

గడువులోగా పూర్తయ్యేనా?

రైతుల నుంచి పంట వివరాలు సేకరించాక పొలం వద్దకు వెళ్లి జియోఫెన్సింగ్‌తో సహా పంట ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జియో కోఆర్డినేట్స్‌తో సహా ఎల్‌పీ నంబరు వివరాలు నమోదు చేయాలి. ఆర్బీకే సిబ్బంది, వీఆర్వోల ధ్రువీకరణ పూర్తి కాగానే రైతుల ఈ కేవైసీ నమోదు చేసి రైతులకు డిజిటల్, ఫిజికల్ రసీదులు ఇవ్వాలి. గతేడాది మాదిరిగానే సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 19 నుంచి 24వ తేదీ వరకు సోషల్ ఆడిట్ కింద ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శిస్తారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను 25 నుంచి 28వ తేదీ వరకు పరిష్కరిస్తారు. తుది జాబితాలను 30వ తేదీన ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శించాలని నిర్ణయించారు. అయితే, ఈ పంట నమోదులో ఉన్న గందరగోళ పరిస్థితుల మధ్య గడువులోగా పంటల నమోదు పూర్తవుతుందా! అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్ జగన్ హయాంలో పక్కా ప్రణాళికతో ఈ-పంట నమోదు

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2019 రబీ నుంచి ఈ–క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టింది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ (పంట సాగు హక్కుపత్రం) డేటా ఆధారంగా జాయింట్ అజమాయిషీ కింద పంట వివరాలు నమోదు చేసేవారు. ఏటా ఖరీఫ్‌లో జూలై మొదటి వారంలో మొదలు పెట్టి సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేసేవారు. సోషల్ ఆడిట్ అనంతరం అక్టోబర్ రెండో వారంలోగా తుది జాబితాలు ప్రదర్శించేవారు. రబీ సీజన్‌లో నవంబర్ మొదటి వారంలో శ్రీకారం చుట్టి జనవరి నెలాఖరులోగా పూర్తి చేసేవారు. ఫిబ్రవరి రెండో వారంలోగా తుది జాబితాలు ప్రదర్శించేవారు. కానీ ఈసారి ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా, 40 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నా ఇప్పటివరకు కనీసం 10 శాతం పంటలు కూడా నమోదు కాని దుస్థితి.

ఈ -క్రాప్‌తో ఐదేళ్లలో రైతులకు జరిగిన మేలు..

గడిచిన ఐదేళ్లలో 8.24 కోట్ల ఎకరాల్లో సాగైన పంటల వివరాలు నమోదు కాగా, ఈ–క్రాప్ ప్రామాణికంగా వివిధ రకాల సంక్షేమ ఫలాలు అందించారు. 75.82 లక్షల మందికి రూ.1,373 కోట్ల సబ్సిడీతో కూడిన 45.16 లక్షల టన్నుల విత్తనాలు, 15 లక్షల మందికి రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగుల మందులు, 176.36 లక్షల టన్నుల ఎరువులు అందాయి. 5.13 కోట్ల మంది రైతులకు రూ.8.37 లక్షల కోట్ల పంట రుణాలు లభించాయి. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున 53.58 లక్షల మందికి రూ.34,288 కోట్ల పెట్టుబడి సాయం అందింది. 54.58 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల పంటల బీమా పరిహారం, 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్ల పెట్టుబడి రాయితీ, 84.67 లక్షల మందికి రూ.2051 కోట్ల సున్నా వడ్డీ రాయితీలు అందాయి. రైతులు పండించిన పంటల విక్రయం సాఫీగా సాగి, ప్రతి పంటకీ మద్దతు ధర లభించింది.

ఇసుకను మింగేస్తున్నారు..!

- ఎన్టీఆర్ జిల్లా మోగులూరులో కరిగిపోతున్న ఇసుక గుట్ట
- 64.654 మెట్రిక్ టన్నుల ఇసుక మాయం..
- ఓ టీడీపీ నాయకుడితో కలిసి అక్రమార్జనకు తెరదీసిన అధికారి..

సాక్షి నెట్‌వర్క్: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరు వద్ద భారీగా నిల్వ ఉంచిన ఇసుక గుట్ట నుంచి పెద్ద మొత్తంలో ఇసుక మాయమైందనే విమర్శలొస్తున్నాయి. గత ప్రభుత్వం నిల్వ చేసిన కొండలా ఉండే ఇసుక గుట్ట క్రమంగా కరిగిపోయింది. అమ్మింది కొంత.. అమ్ముకున్నది కొంత.. ఎగరేసుకుపోయింది మరికొంత.. అధికారులు చెబుతున్న లెక్కలకు.. కళ్లముందు కనిపిస్తున్న వాస్తవానికి పొంతన కుదరకపోవడం ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తున్నది. కృష్ణానది, మున్నేరులకు వచ్చే వరదలు, భారీ వర్షాల సమయంలో ఇసుక కొరత రాకూడదనే సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరు వద్ద భారీగా ఇసుక నిల్వ చేసింది. గత నెల 9వ తేదీకి ముందు ఇక్కడ జిల్లా మైనింగ్ అధికారులు లెక్కలు వేసి 1,39,000ల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు ఇసుకను కొలతలు వేసి లిఖితపూర్వకంగా రాసి స్థానిక అధికారులకు అప్పగించారు. అనంతరం ఇక్కడ గత నెల 8వ తేదీన ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 44.346 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయించినట్లు అధికారులు తెలిపారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలైంది. అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఇక్కడ ఇంకా 84.654 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండాలి. కానీ వాస్తవంగా ఉన్న ఇసుక సుమారు 20వేల టన్నులు మాత్రమే ఉంటుందని అధికారులు తాజాగా అంచనాకు వచ్చారు. మిగిలిన 64.654 మెట్రిక్ టన్నుల ఇసుక ఏమైందనేది ప్రశ్నార్థకం. ఇప్పటికే ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో.. ఏమాత్రం తేడా వచ్చినా అందుకు స్థానిక అధికారులదే బాధ్యత అని స్పష్టం చేయడంతో అక్రమార్కులు హడలెత్తిపోతున్నారు.



ఇసుకను తరలిస్తున్న లారీలు

లెక్క తేలేది ఎలా?

మొదట్లో మైనింగ్ అధికారులు రెండు రోజుల పాటు స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను కొలతలు వేశారు. అలా మరో మూడు రోజులు లెక్కలు కట్టిన తర్వాతే ఇసుక నిల్వలను ప్రకటించారు. అయితే ఇప్పుడు వారి లెక్కలకు.. ఉన్న ఇసుకకు భారీగా తేడా రావడంతో.. ఇసుక ఏమైందో అర్థంకాక అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా మోగులూరు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక ఎవరినీ బలి తీసుకుంటుందోనన్న ఆందోళనతో స్థానిక అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

టీడీపీ నేతతో చేతులు కలిపిన అధికారి?

మోగులూరు స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఓ పంచాయతీ అధికారి ఓ అధికారపార్టీ నాయకుడితో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడ్డాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో లారీకి 20 టన్నుల ఇసుక మాత్రమే తరలించేందుకు ప్రభుత్వం అనుమతులివ్వగా.. ఆ అధికారి కాసులకు కక్కుర్తిపడి అదే లారీకి అదనంగా ఐదు బొచ్చెలు ఇసుక అదనంగా నింపుతున్నాడు. ఒక బొచ్చె (2.50 మెట్రిక్ టన్నులు) రూ.700 చొప్పున ఒక లారీకి అదనంగా రూ.3,500 ఆ అధికారికి అందుతున్నాయని సమాచారం.

క్లుప్తంగా...

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



మాట్లాడుతున్న అధ్యక్షుడు పి.దామోదర రావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో బస్సుల సంఖ్యను పెంచడంతోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) అధ్యక్షుడు పి.దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబును ఇప్పటికే రెండుసార్లు కలిసి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను తక్షణమే ఇవ్వాలని కోరామన్నారు. ఈ సమావేశంలో ఈయూ ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్యతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ వైద్యసేవ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశం విజయవాడ యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగింది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవాపథకంలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తం ఒకే యూనియన్‌గా ఏర్పడాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఏపీ వైద్యసేవ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడాలని తీర్మానించారు. ఈ జేఏసీకి రాష్ట్ర అధ్యక్షుడిగా చవ్వాకుల గోవింద్, ఉపాధ్యక్షుడిగా గార్లపాటి నాగరాజ్, ప్రధాన కార్యదర్శిగా మద్దూరు సుధీర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా కాకాని అప్పారావు,. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివకుమారి, జేఏసీ కార్యదర్శులుగా నవీన్, జ్యోతి, మహిళా ప్రొటెక్షన్ కమిటీ కార్యదర్శిగా వల్లూరి బంగారి శ్రీ, రాష్ట్ర కోశాధికారిగా రజనీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

‘ఉపాధి’ నిధులు పెంచాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ గ్రామ సభలు జరపడంతోపాటుగా ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పథకంలో జాబు కార్డులు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని, కాంట్రాక్టర్లకు కేటాయించకుండా మరిన్ని ఉపాధి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ద్వారా కాలువల తవ్వకం, మట్టి తీయడం, జంగిల్ క్లియరెన్స్ తదితర 29 రకాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూమి అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టి తద్వారా వ్యవసాయ కార్మికులకు మరిన్ని ఉపాధి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉచిత విద్య, వైద్యం అందించండి చాలు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఉంగుటూరు: ప్రభుత్వాలు ప్రజలను సోమరులుగా తయారు చేసే ఉచితాలను అందించడం మానుకుని.. విద్య, వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించి పేదవారి అభ్యున్నతికి కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో గుడివాడ ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం తాత్కాలిక లబ్ధి కోసం అవసరం లేని ఉచిత పథకాలను తీసుకొస్తున్నాయని, దీనివల్ల ప్రజలకు లాభం కంటే నష్టమే ఎక్కువని చెప్పారు. ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, డైరెక్టర్ పరదేశి పాల్గొన్నారు.

మాణిక్కం ఠాగూర్‌తో షర్మిల భేటీ

నేడు అధిష్టానంతో చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌తో భేటీ అయ్యారు. ఇప్పటికే ఏపీలో పార్టీకి సంబంధించిన కమిటీలన్నీ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త కమిటీల ఏర్పాటుపై మాణిక్కం ఠాగూర్‌తో షర్మిల చర్చించారు. కొత్త అధికార ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, తదితర నియామకాలకు సంబంధించి తయారుచేసిన జాబితాపై ఠాగూర్‌తో షర్మిల మాట్లాడారు. సోమవారం సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి సిద్ధం చేసిన జాబితాను అందజేసే అవకాశముంది. అనంతరం.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో షర్మిల భేటీ కానున్నారు.



‘మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అయ్యింది.. మీ ఫోన్‌కు ఓటీపీ పంపాం.. అది చెప్పండి.. వెంటనే ఖాతాను పునరుద్ధరిస్తాం’.. ఈ మాటలు నమ్మి ఎవరైనా ఓటీపీ నంబర్ చెప్పారో అంతే.. వారి ఖాతా ఖాళీ. కొన్నేళ్లుగా బెంబేలెత్తిస్తున్న సైబర్ నేరాల తీరిది. దాదాపు 65 శాతం సైబర్ నేరాలకు ప్రధాన కారణం అవాంఛనీయమైన వ్యక్తులకు ఓటీపీ నంబర్ చెప్పేయడమేనని తేలింది. వేగం పుంజుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు తగ్గట్లుగా పెరుగుతున్న ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలో డిజిటల్ చెల్లింపులు అమాంతంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని దుర్వినియోగం చేస్తూ సైబర్ ముఠాలు చెలరేగిపోతున్నాయి. అందుకే సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు డిజిటల్ చెల్లింపుల విధానంలో సంస్కరణలు తీసుకురావాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్ణయించింది. ఈ మేరకు ఓటీపీ నంబరుకు ప్రత్యామ్నాయంగా మరికొన్ని విధానాలను అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది.

- సాక్షి, అమరావతి

డిజిటల్ చెల్లింపులు మరింత సురక్షితం

ఓటీపీ స్థానంలో పిన్, పాస్‌వర్డ్, బయోమెట్రిక్ పద్ధతులు

- సైబర్ నేరాల అడ్డుకట్టే లక్ష్యంగా కొత్త మార్గదర్శకాలు
- రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్ణయం
- అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథంటికేషన్ విధానాలకు ఆమోదం

మూడు ప్రత్యామ్నాయ విధానాలు..

డిజిటల్ చెల్లింపులను మరింత సురక్షితం చేసేందుకు ఆర్బీఐ ‘అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథంటికేషన్ (ఏఎఫ్ఏ) విధానాలను ఆమోదించింది. అంటే ఓటీపీతోపాటు ఈ అదనపు అథంటికేషన్‌ను కూడా కచ్చితంగా పరిశీలించిన అనంతరమే డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుంది. ఆ అదనపు అథంటికేషన్ డైనమిక్‌గా ఉంటుంది. చెల్లింపు లావాదేవీ మొదలైన తరువాత అది జనరేట్ అవుతుంది. అది కూడా ఆ ఒక్క లావాదేవీకే పరిమితమవుతుంది. త్వరలోనే అమలులోకి రానున్న ఈ కొత్త మార్గదర్శకాల్లో మూడు ప్రత్యామ్నాయ విధానాలను పొందుపరిచింది. అవి..



నాలెడ్జ్ బేస్ట్: ఖాతాదారుడు (చెల్లింపుదారుడు)కు మాత్రమే తెలిసిన సమాచారాన్ని తెలపాల్సి ఉంటుంది. ఆ ఖాతాదారుడు ముందుగా నిర్ణయించుకున్న పాస్‌వర్డ్, పాస్‌ఫ్రేజ్, పిన్ నంబర్‌లలో ఒకదాన్ని ఎంటర్‌చేస్తేనే డిజిటల్ చెల్లింపు ప్రక్రియ పూర్తవుతుంది.

పొసెషన్ బేస్ట్: ఖాతాదారుడు (చెల్లింపుదారుడు) తాను వ్యక్తిగతంగా కలిగి ఉన్నవాటి సమాచారాన్ని తెలపాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లకు టోకెన్ల వంటి తనకు మాత్రమే తెలిసిన సమాచారాన్ని ఎంటర్‌చేస్తేనే డిజిటల్ చెల్లింపు పూర్తవుతుంది.

బయోమెట్రిక్ బేస్ట్: వేలిముద్రలు, ఐరీస్, ముఖ గుర్తింపు వంటివి. అవి సరిపోలితేనే డిజిటల్ చెల్లింపు సాధ్యపడుతుంది.

ఇటికి మినహాయింపులు..

తాజా మార్గదర్శకాల పేరుతో రోజువారీ సాధారణ లావాదేవీలు, తక్కువ మొత్తం చెల్లింపుల ప్రక్రియకు ప్రతిబంధకం కాకుండా ఆర్బీఐ జాగ్రత్తలు కూడా తీసుకుంది. అందుకే ఈ కొత్త విధానం నుంచి కొన్నింటికి మినహాయింపులిచ్చింది. మినహాయింపులు ఇచ్చిన డిజిటల్ చెల్లింపులు ఏమిటంటే..

- దుకాణాలు, వాణిజ్య కేంద్రాలు, ఇతర కేంద్రాల్లో రూ.5వేల లోపు చెల్లింపులు..
- బ్యాంకుల ద్వారా రికరింగ్ చెల్లింపుల (నియమిత కాలంలో ఆటోమెటిగ్గా బ్యాంకు ఖాతాల నుంచి చెల్లింపులు) కోసం ముందుగానే ఆమోదించి బ్యాంకుకు తెలిపిన లావాదేవీలు..
- రూ.లక్షలోపు మ్యూచువల్ ఫండ్స్ చెల్లింపులు..
- బీమా ప్రీమియంల చెల్లింపులు..
- క్రెడిట్ కార్డు చెల్లింపులు..
- రూ.15వేల వరకు ఇ-మ్యాండేట్ చెల్లింపులు..
- టోల్‌గేట్ల వద్ద చెల్లింపులు.



టీచర్ల ‘సర్దుబాటు’పై కొత్త మార్గదర్శకాలు

నేటి నుంచి ఈనెల 14లోగా సర్దుబాటు పూర్తి చేయాలని ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ‘పని సర్దుబాటు’ బదిలీలపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత నూతన మార్గదర్శకాలను రూపొందించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సర్దుబాటు ప్రక్రియను సోమవారం నుంచి ఈనెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



ఇవీ మార్గదర్శకాలు..

- ఒకే సబ్జెక్టుకు సంబంధించి అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల ఆధారంగా సబ్జెక్ట్ టీచర్లు (ఎస్ఏ), ఎస్జీటీలను సర్దుబాటు చేయాలి. మిగులు స్కూల్ అసిస్టెంట్లను ఇతర సబ్జెక్టుల ప్రకారం, వారి మెథడాలజీల మేరకు సర్దుబాటు చేయాలి
- అర్హత గల మిగులు ఎస్జీటీలు, సంబంధిత డిగ్రీ, బీఈడీ మెథడాలజీని ప్రామాణికంగా తీసుకుని ప్రీ హైస్కూల్, హైస్కూల్స్‌లో సర్దుబాటు చేస్తారు
- ఒక స్కూల్‌లో ఒకటికంటే ఎక్కువ మంది ఎస్ఏ (పీడీ) లేదా పీఈటీ ఉన్నవారిని గుర్తించి అదనపు సిబ్బందిని లేని స్కూళ్లకు పంపిస్తారు
- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు సర్దుబాటులో ప్రాధాన్యం ఇస్తారు
- యూపీ స్కూల్స్‌లో ఎన్‌రోల్‌మెంట్ 98 కంటే తక్కువ ఉంటే 3 నుంచి 8 తరగతులు, 1 – 2 తరగతులను విడివిడిగా వర్గీకరించి టీచర్లను సర్దుబాటు చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో పాత నిబంధనల ప్రకారమే సద్దుబాటు చేస్తారు.
- కొత్తగా మిగులు ఉపాధ్యాయులను గుర్తించినట్లయితే వారిని అవరోహణ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు
- ఎస్ఏ (పీడీ), పీఈటీలను ఈ సేవలు లేని స్కూళ్లకు పంపిస్తారు

రెండు దశల్లో సర్దుబాటు

కొత్త నిబంధనల ప్రకారం రెండు దశల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ఉంటుంది. మొదటి దశలో మండలంలోని ఒకే మేనేజ్‌మెంట్ కింద ఉన్న స్కూళ్లకు, ఇంటర్ సబ్జెక్టుకు సంబంధించి అదే మండలానికి, మండల పరిధిలోని అర్హత కలిగిన అదే మండల పరిధిలోని స్కూళ్లలో సర్దుబాటు చేస్తారు. ఇంకా మిగులు ఉపాధ్యాయులు ఉంటే ఇంటర్ మేనేజ్‌మెంట్ కింద రెండో దశలో డివిజన్ స్థాయిలో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఒకే సబ్జెక్టు ఉన్నవారికి అదే డివిజన్‌లో, డివిజన్‌లోని ఇంటర్ సబ్జెక్ట్, ఎస్జీటీలను డివిజన్ పరిధిలో స్కూళ్లకు సర్దుబాటు చేస్తారు. కేడర్ సీనియారిటీలో అత్యంత జూనియర్‌ను మిగులు ఉపాధ్యాయుడిగా గుర్తిస్తారు. ఎక్కడ సబ్జెక్టు టీచర్, ఎస్జీటీలు లేరో ఆ స్కూల్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

పాత నిబంధనలే కొత్తగా

పాఠశాల విద్యా శాఖ ఆదివారం ప్రకటించిన మార్గదర్శకాల్లో ‘కేడర్ సీనియారిటీ’ మినహా మిగిలినవన్నీ పాతవే. తొలుత ఈ నెల 9న ఒకసారి మార్గదర్శకాలు విడుదల చేయగా, ఉపాధ్యాయవర్గాలు పలు అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తాయి. పలు సూచనలు చేశాయి. దీంతో మార్గదర్శకాల్లో మార్పులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం సర్దుబాటు ప్రక్రియ చేపట్టనుండగా ఆదివారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటిలో అన్నీ పాతవే ఉన్నాయి. వాటినే కొత్తగా ఇవ్వడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. తాము సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని, మరెందుకు చర్చలకు పిలిచారని ప్రశ్నిస్తున్నాయి.

వక్ఫ్ చట్టం సవరణలు అంగీకరించం

ముస్లిం లాయర్లు, విద్యావంతుల నిర్ణయం



అబ్దుల్ మతీన్


కృష్ణలంక (విజయవాడతూర్పు): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కుట్రపన్ని తీసుకురానున్న వక్ఫ్ చట్టం సవరణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ముస్లిం లాయర్లు, వైద్యులు, విద్యావంతులు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముస్లిం అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ముస్లిం సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వక్ఫ్ సవరణ చట్టం 2024 పర్యవసానాలపై జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం లాయర్లు, డాక్టర్లు, విద్యావంతులు పాల్గొన్నారు. ముస్లిం మత పండితులు ముఫ్తి షాబాన్ మాట్లాడుతూ.. వక్ఫ్ భూములు అంటే అల్లాహ్ భూములని, వీటిని కొనడం, అమ్మటం నేరమన్నారు. ముస్లింల పూర్వీకులు దానంగా ఇచ్చిన భూములను కాపాడుతూ లీజుల ద్వారా వచ్చే ఆదాయంతో ప్రజలకు సేవ చేయడమే వక్ఫ్‌బోర్డు ప్రధాన లక్ష్యమన్నారు. ముస్లిం లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ.. కొత్తగా సవరణ చేసిన చట్టంలో వక్ఫ్ ట్రిబ్యునల్, వక్ఫ్ కమిషనర్ అధికారాలను నిర్వీర్యం చేసి, స్థానిక కలెక్టర్లకు పూర్తి అధికారాలు కల్పించి రాజకీయ జోక్యంతో వక్ఫ్ భూములను ముస్లింలకు కాకుండా చేయాలనే కుట్ర జరుగుతుందన్నారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ మాట్లాడుతూ ముస్లిం సంస్థల భూములు, ఆస్తులను మసీదులు, దర్గాలు, ఈద్గాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అడ్వకేట్స్ అసోసియేషన్ కోశాధికారి ఎండి ఖలీలుల్లాహ్, గురునానక్ సొసైటీ పర్యవేక్షకులు మహేందర్ సింగ్ సహానీ, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు హబీబుర్రహాన్, ముస్లిం సంక్షేమ సమితి అధ్యక్షుడు ముక్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితకు తృటిలో తప్పిన ప్రమాదం

ఉంగుటూరు: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రయాణిస్తున్న కారు ఏలూరు జిల్లా కైకరం వద్ద ఆదివారం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో మంత్రి అనితకు తృటిలో ప్రమాదం తప్పింది. అమరావతి నుంచి తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో జరగనున్న కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. మంత్రి ఎస్కార్ట్‌తో కలిసి కైకరం సెంటరుకు వచ్చేసరికి అకస్మాత్తుగా ఓ బైక్ అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే వస్తున్న మంత్రి కారు ఎస్కార్ట్ కారును ఢీకొట్టింది. దీంతో మంత్రి కారు ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది. ఈ ఘటనతో సిబ్బంది అంతా ఒక్కసారిగా కంగారుపడ్డారు. మంత్రి అనితకు ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కొట్టుకుపోయిన ‘తుంగభద్ర’ గేటు

ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరి



లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని వదలడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

సాక్షి, అమరావతి/హొళగుంద/సాక్షి, బళ్లారి/ఆలూరు: రాయలసీమ, ఉత్తర కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల వరదాయిని తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయింది. డ్యాం 19వ గేటు లింక్ చానల్ శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో తెగి గేటు నదిలో కొట్టుకుపోవడంతో భారీఎత్తున నీరు నదిలోకి పోటెత్తింది. దీంతో డ్యాం రక్షణలో భాగంగా అధికారులు 33 గేట్లలో 29 గేట్లు ఎత్తి నీటిని నదిలోకి వదిలేస్తున్నారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటుచేయాలంటే గేటు బిగించే స్థాయి (క్రెస్ట్ లెవల్)కి అంటే 1,613 అడుగులకు నీటిమట్టాన్ని తగ్గించాలని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. అంటే.. అప్పుడు 43.83 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుంది. గేటు కొట్టుకుపోకముందు డ్యాంలో 1,632.6 అడుగుల్లో 104.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే.. ఆ స్థాయికి నీటి మట్టాన్ని తగ్గించాలంటే 61 టీఎంసీలను దిగువకు వదిలేయాలి. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకుంటే రోజుకు 9 టీఎంసీల చొప్పున వారంపాటు నీటిని దిగువకు వదిలేస్తే.. డ్యాంలో నీటి మట్టం 1,613 అడుగుల స్థాయికి తగ్గుతుంది. ఆ తర్వాత కొత్త గేటు ఏర్పాటుకు కనీసం వారం రోజులు పడుతుందని తుంగభద్ర బోర్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి. దాదాపు నెలాఖరుకుగానీ కొత్త గేటును అమర్చలేరన్నది స్పష్టమవుతోంది. ఈ ఘటనతో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పలువురు కర్ణాటక మంత్రులు డ్యాంను పరిశీలించారు. తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం అక్కడే మకాం వేసింది. హైదరాబాద్, చెన్నై నుంచి ప్రత్యేక నిపుణులు రానున్నారు. నిజానికి.. 71 ఏళ్ల ‘తుంగభద్ర’ చరిత్రలో ఎన్నడూ గేట్లు కొట్టుకుపోయిన దాఖలాల్లేవు.

టీబీ బోర్డు నిర్లక్ష్యం..

టీబీ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్యాం భద్రతను మరచి నీటిని నిల్వచేయడంతో నేడు ఎన్నడూలేనంత దారుణ పరిస్థితి జలాశయం ఎదుర్కొంటోంది. డ్యాంలో నీటి చేరిక మొదలుకాక ముందే గేట్లన్నీ పరిశీలించి ట్రయల్ రన్‌చేసి నీటినిల్వకు అన్ని విధాలా సిద్ధంచేయాల్సిన అధికారులు అలా చేయకపోవడంతో వారి నిర్లక్ష్యం నేడు రైతుల పాలిట శాపంగా మారింది. గతేడాది ఒకే పంటతో సరిపెట్టుకున్న రైతులు ఈ ఏడాది దానికన్నా అధ్వాన పరిస్థితిలోకి వెళ్లడంతో ఆందోళన చెందుతున్నారు.

రైతుల ఆశలు ఆవిరి..

ఇక సాధారణంగా తుంగభద్రలో సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరులో వరదలు ఉండవు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే.. డ్యాంలో నీటి లభ్యత తగ్గుతుంది. దీంతో.. గత ఐదేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ నీటి లభ్యత అధికంగా ఉంటుందని ఆశించిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. నిజానికి.. ఈ జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది తుంగభద్రే. గడిచిన చాలా ఏళ్లుగా తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత తగ్గిపోగా ఈ ఏడాది ఆశాజనకంగా నీరు చేరింది. కానీ, తాజా పరిస్థితితో మిగిలిన నీటితో ఖరీఫ్‌లో ఒక పంటకు మాత్రమే బొటాబొటిగా నీళ్లు సరిపోతాయి. యుద్ధప్రాతిపదికన డ్యాం గేటును ఏర్పాటుచేసినా డ్యాం ఎగువ భాగంలో చినుకు జాడలేకపోతే సాగునీటి మాట దేవుడెరుగు.. తాగునీరు కోసం ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందేమోనని అందరూ కలవరపడుతున్నారు.

17.33 లక్షల ఎకరాలపై ప్రభావం

తుంగభద్ర డ్యాం ఆయకట్టు విస్తరించిన రాయలసీమ, ఉత్తర కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలు వర్షాభావ ప్రాంతాలు. రాయలసీమలో హెచ్చెల్సీ, ఎల్లెల్సీల కింద 4.42 లక్షల ఎకరాలు, ఉత్తర కర్ణాటకలో 8.96 లక్షల ఎకరాల ఆయకట్టు నేరుగా డ్యాంపై ఆధారపడ్డాయి. డ్యాం దిగువన రాయలసీమలో కేసీ కెనాల్ కింద 2.78 లక్షల ఎకరాల ఆయకట్టు.. ఉత్తర కర్ణాటకలో రాయబసవన ఛానల్స్ కింద 24,468 వేల ఎకరాలు.. ఉత్తర, కర్ణాటక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం) కింద 92,900 ఎకరాల ఆయకట్టు వెరసి 3.95 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేసీ కెనాల్, ఆర్డీఎస్, రాయబసవన ఛానల్స్ కూడా తుంగభద్ర డ్యాంలో నీటి కేటాయింపులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ఏడాది 17.33 లక్షల ఎకరాల ఆయకట్టుపై గేటు కొట్టుకుపోవడం తీవ్ర ప్రభావం చూపుతుంది. మరోవైపు.. ఈ ఏడాది రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాలు సాగు, తాగునీటికి ప్రధానంగా ఆధారపడేది హెచ్చెల్సీ (ఎగువ కాలువ) పైనే. ఎల్లెల్సీ (దిగువ కాలువ)పై కర్నూలు, నంద్యాల జిల్లాలు ఆధారపడతాయి. హెచ్చెల్సీ, ఎల్లెల్సీలతోపాటు కేసీ కెనాల్‌కు నీటి లభ్యత తగ్గితే తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

త్వరలో గేటు పునరుద్ధరణ: డీకే




డ్యాం వద్ద కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ, గేటు కొట్టుకుపోవడం బాధాకరమని.. వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు అందేలా చూస్తామని, అయితే మళ్లీ డ్యాంలోకి నీరు వచ్చేదాన్ని బట్టి రబీ పంటకు నీటివసతి కల్పిస్తామని చెప్పారు.

అధికారులను అప్రమత్తం చేశాం: నిమ్మల



తుంగభద్ర గేటు కొట్టుకుపోవడంపై కర్నూలు జిల్లాలో కౌతాలం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. వెంటనే గేటు అమర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

నిధులు ఇవ్వకపోవడంతో..: విరూపాక్షి




డ్యాం మరమ్మతులకు ఏపీ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకపోవడం, ఇంజినీర్ల వైఫల్యంతోనే గేట్ కొట్టుకుపోయిందని ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆరోపించారు. ఆదివారం ఆయన డ్యాం గేట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గేట్ పనులను త్వరతగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిస్థితి దారుణం: అజ్జప్ప, కౌలు రైతు



వర్షాల్లేక పరిస్థితి దారుణంగా తయారైయింది. నేను నాలుగెకరాలను కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాను. వేలాది రూపాయిలు పెట్టుబడి పెట్టాను. ఒకవైపు కర్ణాటక రైతులు ఎల్లెల్సీ ఎగువన పైపులు వేసి, గండికొట్టి సాగునీరందకుండా చేస్తుంటే ఇప్పుడు ఏకంగా డ్యాంకే గండి పడింది. ఇలాగైతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.

శ్రీశైలం జలాశయానికి నెమ్మదించిన వరద ఉధృతి



శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/అచ్చంపేట: శ్రీశైలం జలాశయానికి రెండురోజులుగా వస్తున్న వరద ప్రవాహం ప్రస్తుతం నెమ్మదించింది. ప్రస్తుత వరద ప్రవాహ అంచనాలతో ఇంజినీర్లు గేట్ల ఎత్తును, సంఖ్యను తగ్గిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఏడు గేట్ల ద్వారా 1,89,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం నుంచి ఆదివారం వరకు శ్రీశైలానికి జూరాల, సుంకేసుల నుంచి 3,50,468 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. డ్యాం నీటిమట్టం 882.70 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం జలాశయానికి వరద తగ్గడంతో నాగార్జున సాగర్ వద్ద కొన్ని గేట్లను మూసివేశారు. ఆదివారం సాయంత్రం ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం ఆరుగేట్లను ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,89,133 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 68,170 క్యూసెక్కులు మొత్తంగా 2,57,303 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులో వరద ఉధృతి తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.844 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువనుంచి 67,799 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతే మొత్తాన్ని రెండు గేట్లను రెండు మీటర్ల పైకి ఎత్తి దిగువకు వదులుతున్నారు.

1,989 టీఎంసీలు కడలిపాలు

సాక్షి, హైదరాబాద్: గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ కడలి వైపు కదిలిపోతున్నాయి. ఇప్పటికే 1,903 టీఎంసీల గోదావరి, 86 టీఎంసీల కృష్ణా జలాలు కలిపి మొత్తం 1,989 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తెరపి ఇవ్వడంతో గోదావరి, కృష్ణాలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ గోదావరి పరీవాహకంలో ఇప్పటికీ చెప్పుకోదగ్గ వరద రాకపోవడంతో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూరు ప్రాజెక్టులు సగం కూడా నిండలేదు. కృష్ణాలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండడంతో 10 రోజులుగా వచ్చిన వరదను సముద్రంలోకి వదిలివేస్తున్నారు. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం(తెలంగాణ) నుంచి అంతర్వేది(ఏపీ) వరకూ పరీవాహకంలోని ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండడంతో వస్తున్న వరదను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.



పాత విషయాలపై ఎక్కువ అభ్యాసం లేకుండా కొత్త విషయాలను కనుగొనే అవకాశం లేదు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 12 ఆగస్టు 2024

దేశ'భుక్తి' గేయం

ఎప్పటి గురజాడ! ఎప్పటి దేశభక్తి గీతం! నూటపాతికేళ్ళ క్రితం నాటి ఆ గీతం ఇన్ని కోట్ల తెలుగుప్రజల పెదాలపై ఎన్ని కోట్ల సార్లు నర్తించి ఉంటుంది! 'దేశమును ప్రేమించుమన్నా' అని చెప్పే ఆ గీతం నిత్యస్మరణనే కాదు, నిరంతరాచరణను ఉద్బోధించడం లేదా? అది కాలభేదాలను దాటి నూతనత్వాన్ని తెచ్చుకునే సముజ్వలపాఠం కాదా? దాని సారమూ, సందేశమూ జాతి జనులలో ఇప్పటికైనా ఇంకాయా?

మనదేశం లాంటి జనతంత్ర వ్యవస్థలో రాజకీయ, ఆర్థిక, సామాజికాది అన్ని రంగాలకూ ఎప్పటికీ దిశానిర్దేశం చేసే మహిమాన్విత మంత్రం ఆ గీతం! అరవై అయిదు పంక్తుల ఆ గీతంలో మనకు ఎంత చటుక్కున గుర్తొస్తాయో, అంతే అలవోకగా మరచిపోయే పంక్తులు రెండే; అవి, 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'! ఆ కవితాహారంలో అవే మణిపూసలైన మహావాక్యాలు. దేశాన్ని మట్టిగానూ, భూభాగంగానూ చూడడమే పరిపాటి కాగా, మనుషులుగా గుర్తించిన గురజాడ తన కాలానికి ఎన్నో మన్వంతరాలు ముందున్నాడు. దేశమంటే మనుషులని ఎలుగెత్తి చాటడంలో వేల సంవత్సరాల వెనక్కీ వెళ్లగలిగిన విలక్షణ క్రాంతదర్శి ఆయన. దేశమూ, రాజ్యమూ అనే భావనే అంకురించని గణసమాజంలో అస్తిత్వానికి మనిషే మణిదీపమూ, కొలమానమూనూ...

గురజాడ గీతోపదేశానికి పూర్తి వ్యతిరేకదిశలో నేటి మన ప్రజాస్వామికగమనం సాగుతున్న వైనాన్ని ఆ గీతంలోని ప్రతి చరణమూ ఛెళ్ళున చరచి చెబుతుంది. వొట్టి మాటలు కట్టిపెట్టి, గట్టి మేలు తలపెట్టమంటాడాయన. మంచి గతమున కొంచెమే, మందగించక ముందుకడుగేయమంటాడు. వ్యర్థకలహం వద్దనీ, కత్తి వైరం కాల్చమనీ హితవు చెబుతాడు. దేశాభిమానపు గొప్పలు మానేసి జనానికి నికరంగా పనికొచ్చేది చేసి చూపమంటాడు. దేశస్థులంతా చెట్టపట్టాలు వేసుకు నడవాలనీ, అన్ని జాతులూ, మతాలూ అన్నదమ్ముల్లా మెలగాలనీ సందేశిస్తాడు. మతం వేరైనా మనసులొకటై మనుషులుండాలంటాడు. దేశమనే దొడ్డవృక్షం ప్రేమలనే పూలెత్తాలనీ, ఆ చెట్టు మూలం నరుల చెమటతో తడిసి ధనమనే పంట పండించాలనీ స్వప్నిస్తాడు...

మరో రెండురోజుల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబవుతున్న భారత జనతంత్ర ప్రస్థానం గురజాడ చూపిన జాడకు ఏ కొంచెమైనా దగ్గరగా ఉందా? వొట్టి మాటల వరదలో గట్టి మేలు గడ్డిపరక అయింది. మంచి అంతా గతంలోనే ఉందని చెప్పి జనాన్ని వెనకడుగు పట్టించడమే రాజకీయమైంది. దేశం వ్యర్థకలహాలు, కత్తివైరాలతో సంకుల సమరాంగణమైంది. జనాన్ని చీల్చి పాలించడమే అధికార పరమపదానికి సోపానమైంది. దేశమనే దొడ్డవృక్షం ప్రేమలనే పూలెత్తడం లేదు; వైర, విద్వేషాల విరితావులు వీస్తోంది. ఆ చెట్టు మూలం మనుషుల చెమటతో తడిసి ధనమనే పంట పండించాలన్న కవి ఆశాభావం, ఇప్పటికీ గట్టిగా వేటుపడని నిరుద్యోగపు జడలమర్రి కింద నిలువునా సమాధి అయే ఉంది.

దేశమంటే మనుషులనే కాదు, ఆ మనుషులకు ఏది అత్యవసరమో గురజాడ ఉద్ఘాటిస్తాడు. తిండి కలిగితె కండ కలదోయ్, కండగలవాడేను మనిషోయని, మనిషిని నిర్వచిస్తాడు; ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడుతుందంటాడు; మనిషి సంపూర్ణ జవసత్త్వాలతో హుందాగా శిరసెత్తుకు జీవిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామి అవడానికీ, తిండిపుష్టికీ ఉన్న అన్యోన్య సంబంధాన్ని ఆనాడే నొక్కిచెబుతాడు. అటువంటిది, యావత్ప్రజలకూ పుష్టికరమైన ఆహారాన్ని సమకూర్చే లక్ష్యానికి ఇప్పటికీ యోజనాల దూరంలోనే ఉన్నాం. పోషకాహార లోపంతో ఉసూరుమంటున్న ప్రపంచ బాలల్లో 50 శాతం భారత్‌లోనే ఉన్నారనీ, కేవలం పదిశాతం మందికే పోషకాహారం అందుతోందనీ గణాంకాలు చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం, అయిదేళ్ళ లోపు వయసు పిల్లల్లో శారీరకమైన ఎదుగుదల లోపించినవారు 35 శాతానికి పైగా, బలహీనులు దాదాపు 20 శాతమూ ఉన్నారు. రక్తహీనతను ఎదుర్కొంటున్న పురుషులు, మహిళలు, పిల్లల శాతం గరిష్ఠంగా 67 నుంచి కనిష్ఠంగా 25 వరకూ ఉంది. 2023 లెక్కల ప్రకారమే మన దేశంలో 74 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదు. ప్రపంచ ఆకలి సూచిలో భారత్ స్థానం ఆందోళన గొలుపుతూ 28.7 దగ్గర ఉంది.

భారత్ త్వరలోనే 5 ట్రిలియన్ల ఆర్థికత అవుతుందనీ, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికతలలో మూడవది కాబోతోందనీ పాలకులు అరచేతి స్వర్గాలు ఆవిష్కరిస్తుంటే అసలు నిజాలు ఇలా నిలువునా వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికీ దేశ జనాభాలో సగానికి పైగా, 81 కోట్లమంది నెలకు అయిదు కిలోల రేషన్ పైనే ఆధారపడుతున్నారు. ఈ మాత్రానికీ నోచుకోని వలస, అసంఘటిత రంగ శ్రామికులు 8 కోట్లమంది ఉన్నారు. జనాభా లెక్కల సేకరణ సకాలంలో జరిగి ఉంటే ఈ సంఖ్య ఇంకా పెరిగేదంటున్నారు. కోవిడ్ దరిమిలా వీరిని కూడా ఆహార భద్రతా చట్టం కిందికి తేవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరయ్యాయి. పైగా తాజా బడ్జెట్‌లో ఆహార సబ్సిడీపై ఇంకా కోత పడింది. పోషకాహార లోపం వల్ల భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో ఏకంగా 4 శాతం నష్టపోతోంది.

తిండికి, కండకు, మనిషికి; దేశాభివృద్ధిలో మనిషి పాత్రకు ఉన్న అన్యోన్యాన్ని ఆనాడే చెప్పిన గురజాడది ఎంత గొప్ప ముందుచూపు! దేశభక్తిని, దేశభుక్తితో మేళవించిన గురజాడ గీతం అంతర్జాతీయ గీతమే కాగలిగినదైనా రాష్ట్రీయ గీతం కూడా కాకపోవడం విషాదం కాదూ!?

మాయాలోకపు జీవన నైపుణ్యాలు

కామెంట్



కరణ్ థాపర్

మోసం ఏ రూపంలోనైనా మనల్ని మాయలో పడేసే లోకంలో జీవిస్తున్నాం! ఒకరికి ఒకరం ఎన్ని జాగ్రత్తలు చెప్పుకుని మోసపోవటం అన్నది ఎప్పుడూ కొత్తగా జరుగుతుంది. కాలింగ్ బెల్ కొడతారు. ఫలానా కంపెనీ నుంచి వచ్చాం అంటారు. మనల్ని బుట్టలో పడేసి, 'సర్దుకుని' వెళ్లిపోతారు... ఇదొక రకం మోసం! ఎవరో ఒక పెద్ద కంపెనీ నుంచి ఫోన్ చేస్తారు. మీరు ఫారిన్ ట్రిప్‌కి ఎంపికయ్యారని చెబుతారు. ఫలానా చోటుకు రమ్మంటారు. వెళ్లాక అక్కడ మనల్ని పెద్ద వెంచర్‌లో ఇరికించేస్తారు... ఇది ఇంకో రకం మోసం! ఇక ఓటీపీ మోసాలైతే ఏ మార్గంలో మనల్ని వెతుక్కుంటూ వస్తాయో అంతే పట్టదు. అనుక్షణం జాగ్రత్తగా ఉండటం, ప్రతిదాన్నీ అనుమానించటం జీవితానికి ఇప్పుడు అవసరమైన నైపుణ్యాలు అయ్యాయి!

వాట్సాప్‌లో తరచూ మిమ్మల్ని హెచ్చరిస్తూ వస్తుండే సందేశాల వంటిదే ఇది. గడప గడపకూ తిరిగే సేల్స్‌మెన్‌తో జాగ్రత్త, రాత్రికి రాత్రి బిచాణా ఎత్తేసే కంపెనీల ఆకర్షణీయమైన ఆఫర్‌ల ఎరకు చిక్కుకోకండి, బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని చెప్పి మిమ్మల్ని మీ క్రెడిట్ కార్డు పిన్ నెంబర్ అడిగితే ఇవ్వకండి... అంటూ అప్రమత్తం చేసే మెసేజ్‌లు నాకు నిరంతరం వస్తూనే ఉంటాయి. మీక్కూడా వస్తుంటాయని కచ్చితంగా చెప్పగలను. అలా వారు ఒక హెచ్చరికగా తప్పించాలనుకున్న సంఘటన గతవారం నా సోదరి కిరణ్ విషయంలో జరిగింది.

శనివారం మధ్యాహ్నం ఆమె ఇంటి కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తీయగానే ద్వారం ముందు ముగ్గురు వ్యక్తులు కనిపించారు. తాము ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ఇంజినీర్లమని చెప్పుకున్నారు. గ్యాస్ కనెక్షన్‌ను పరిశీలించేందుకు వచ్చామని చెప్పారు. అదృష్టవశాత్తూ వారిని గుర్తింపు కార్డులు అడగాలన్న ఆలోచన కిరణ్‌కు వచ్చింది. వాళ్లవి చూపించినప్పటికీ, నేననుకోవటం అవి నకిలీవి అయుంటాయని. ఆమె తెలివిగా ఇంకో పని చేసింది. ఆ ఐడీ కార్డులను ఫొటో తీసుకుంది. వారి ఫోన్ నెంబర్‌లను అడిగి రాసుకుంది. అందుకు వాళ్లు కంగు తిన్నప్పటికీ వాళ్ల ఆత్మవిశ్వాసం ఏ మాత్రం సడలలేదు.

కిరణ్... వాళ్లని వంటింట్లోకి తీసుకొని వెళ్లారు. కానీ, ఇంట్లో పనిమనుషులు కూడా వాళ్లతో పాటు అక్కడ ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఆ ముగ్గురు వ్యక్తులు గ్యాస్ పైపులను 'తనిఖీ' చేసి, ఆ పైపులలో ఒకటి వారెంటీ గడువును దాటేసింది కనుక దానిని మార్చవలసిన అవసరం ఉందని చెప్పారు. అందుకు కిరణ్, 'మాది పాతబడిపోతే మిగతా ఫ్లాట్‌లో ఉన్నవాళ్లవీ పాతబడి ఉండాలి కదా! మా గ్యాస్ కనెక్షన్లన్నీ ఒకేసారి బిగించినవి' అని వారితో అన్నారు.

ఆ మాటకు, ఆ ముగ్గురిలో సీనియర్ ఇంజినీర్‌నని చెప్పుకున్న వ్యక్తి ఏ మాత్రం వెరపు లేకుండా పక్క ఫ్లాట్‌లో చెక్ చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. కొన్ని నిమిషాల తర్వాత తిరిగొచ్చి, 'వాళ్ల పైప్ బాగానే ఉంది. కొత్తది మార్చి ఉంటారు, మీక్కూడ కొత్తది వెయ్యవలసిన అవసరం ఉంది' అని కిరణ్‌తో చెప్పాడు.

ఆ ముగ్గురు వ్యక్తులు పైప్‌ను మార్చే పని ప్రారంభించగానే కిరణ్ తన దగ్గరున్న ఐజీఎల్ నెంబర్‌లకు మెసేజ్ చేయటం మొదలుపెట్టారు. 'పైపును మార్చాలని, మా ఇంజినీర్లను పంపిస్తున్నామని' ఐజీఎల్ తనకు ముందే సమాచారం ఇవ్వకపోవటం పట్ల కిరణ్ విసుగ్గా ఉన్నారు. పది, పదిహేను, ఇంకా ఎక్కువ నెంబర్‌లకే ఆమె మెసేజ్ పెట్టి ఉంటారు. వాటిల్లో ఒకటి ఐజీఎల్ పూర్వపు సీఈవోది అన్నట్లు ఆమెకు గుర్తు.



ఆ నెంబర్‌ల నుండి రిప్లయ్‌లు రావటానికి మరీ అంత సమయం ఏమీ పట్టలేదు. ఆ వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఐజీఎల్ పంపినవారు కాదు! వారు మోసగాళ్లు. అంతకన్నా కూడా, 'వాళ్లను పైపులు మార్చనివ్వకండి' అని, 'ఐజీఎల్ సిబ్బంది ముసుగులో కొందరు మోసాలకు పాల్పడుతున్నార'ని హెచ్చరిస్తూ ఐజీఎల్ నంబర్లలో కొన్నింటి నుంచి కిరణ్‌కు వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. ఆ మనుషుల్ని తక్షణం బయటికి పంపించేయండి అన్నది వారి నుంచి వచ్చిన స్పష్టమైన సందేశం. నిజంగానే వాళ్లు మోసగాళ్లు!

కానీ అప్పటికే వారు పైపును తొలగించి, దాని స్థానంలో మరొక పైపును బిగించారు. చిత్రంగా వాళ్లు ఆ పనికి డబ్బులు అడగలేదు. పైగా వెళ్లిపోయే తొందరలో ఉన్నట్లు కనిపించారు. బహుశా కిరణ్ ఐజీఎల్ వాళ్లతో మాట్లాడినందువల్ల భయపడినట్లున్నారు. తదుపరి గ్యాసు బిల్లులో పైపు మార్పిడి చార్జీలు కలిసి ఉంటాయని చెప్పి బయల్దేరుతూ, అనుకోకుండా కందెన అంటిన ఒక ఫోల్డర్‌ను అక్కడ వదిలి వెళ్లారు.

ఈలోపు ఐజీఎల్ కంపెనీ వాళ్లు కిరణ్‌కి ఫోన్ చేసి, తక్షణం తమ ఇంజనీర్లను ఆమె ఇంటికి పంపుతున్నట్లు చెప్పారు. నిజానికి పూర్వపు సీఈఓ నెంబరు అయివుండవచ్చని మెసేజ్ ఇవ్వటం ద్వారా ఆమె చేసిన ప్రత్యేక ప్రయత్నం ఐజీఎల్ సొంత ఇంజనీర్‌లు – మెక్ కాయ్ కంపెనీ వాళ్లు – వీలైనంత త్వరగా ఆమె ఇంటికి చేరుకుని, ఆ మోసగాళ్లు బిగించి వెళ్లిన కొత్త పైపును ఒకటికి రెండుసార్లు పరిశీలించటాన్ని సాధ్యం చేసింది.

మొత్తానికి మోసం జరగబోయిందన్నది స్పష్టం. కిరణ్ వసంత్ విహార్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కి ఫోన్ చేసిన వెంటనే ఆయన తమ పోలీసులను పంపారు. ఆఫీసర్ స్పందన నిజాయితీగా, చురుకుగా, సౌమ్యంగా ఉందని కిరణ్ చెప్పారు. ఆ ముగ్గురు మోసగాళ్లు తమ 'పని' పూర్తి చేసి వెళ్లిన కొద్దిసేపటికే ఐజీఎల్ ఇంజినీర్లు, పోలీసులు దాదాపుగా ఒకేసారి అక్కడికి చేరుకున్నారు.

మార్చిన పైపు నకిలీది అవటమే కాకుండా, దాని దిగువ భాగం సరిగా బిగించి లేదని ఐజీఎల్ ఇంజనీర్లు కిరణ్‌కు చెప్పారు. అంటే ఒకవేళ గ్యాస్ స్విచ్ ఆన్ చేసి ఉంటే లీక్ అయుండేది. కిరణ్ ఫొటో తీసిన గుర్తింపు కార్డుల్ని, ఆ మోసగాళ్లు వదిలి వెళ్లిన ఫోల్డర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి కిరణ్ తీసుకున్న ఫోన్ నెంబర్‌లను బట్టి వారిని కనిపెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ విధంగా 90 నిమిషాల వ్యవధిలో పరిస్థితి చక్కబడి, నష్టం జరగకుండా ఆగింది. ఇందుకు విరుద్ధంగా జరిగి ఉంటే కిరణ్ దాని గురించి చెప్పవలసి వచ్చినప్పుడు అది మరింత దారుణమైన పరిస్థితిగా ఉండేది. అదృష్టవంతురాలు. అలా జరగలేదు.

మూడు విషయాలను ఆమెను రక్షించాయని నేను అంటాను. గుర్తింపు కార్డులను ఫొటో తీసుకోవటం, వాళ్ల ఫోన్ నెంబర్లను అడిగి తీసుకోవటం, 'మీ ఇంజినీర్లను పంపిస్తున్నట్లు ముందుగా నాకెందుకు సమాచారం ఇవ్వలేద'ని ఐజీఎల్ వాళ్లను ఆమె అడగటం! అన్నిటి కన్నా ముఖ్యంగా ఆ మోసగాళ్లు 'పాడైపోయిన' పైపును మార్చే 'పని' మీద ఉన్నప్పుడు తన ఇంట్లో పని చేసేవాళ్లు కూడా అక్కడ ఉండేలా జాగ్రత్త పడటం. ఒకవేళ ఆమె ఇవేవీ చేయకపోయుంటే?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మళ్లీ రావాలి!



ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడైనా చూశారా? ప్రజలకు ట్విట్టర్ ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. పదవిలో లేకున్నా నిరంతరం ప్రజా సేవలోనే ఉంటున్నారు. ఈయన మళ్లీ సీఎం అవటం అవసరం. (జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయ్ సొరేన్ ఒక రోగికి సహాయం చేయమని కోరుతూ రాంచీ డిప్యూటీ కమిషనర్‌కు, రాంచీ 'రిమ్స్' ఆసుపత్రికి, న్యూరో సర్జన్ డాక్టర్ వికాస్‌కు ట్వీట్ పెట్టడంపై).

– డాక్టర్ ధ్రువ్ చౌహాన్, హెల్త్ యాక్టివిస్ట్

ఏం మారలేదు!



కొన్నిసార్లు... వేరే కాలాలు, సమయ సందర్భాల నాటి మాటలు నేటికీ సరిగ్గా సరిపోతాయి! అందుకే, నేను – నా కూతురు కలిసి ఈ రోజు 'చారులత' (1964) సినిమా చూస్తున్నప్పుడు 'ఇక్కడ ఆపు, ఇక్కడ ఆపు, ఇక్కడ ఆపు' అంటూ పాజ్‌లతో చూశాను. నిజానికి బెంగాలీలను ఎవరైనా కాపాడగలరా? నాడు టాగూర్‌ది అదే ప్రశ్న, సత్యజిత్‌రేది అదే ప్రశ్న, నేడు మా అమ్మాయిదీ, నాది కూడా!

– సహానా సింగ్, రచయిత్రి

ఆ మాత్రం ఉండదా!



ఏ రోజు చూసినా నా బరువులో 3 కిలోల వరకు అటూ ఇటూ అవుతుంటుంది. భోజనానికి ముందు, భోజనం తర్వాత; రన్నింగ్ ముందు, రన్నింగ్ తర్వాత ఈ తేడా కనిపిస్తుంది. అలాంటిది, జీవిత కాలం ప్రిపరేషన్ తర్వాత – ఒక్క క్షణంలోనైనా తగ్గగల 100 గ్రాముల బరువును అధికంగా ఉన్న బరువుగా పరిగణించి, బంగారు పతకం కోసం పోటీ పడబోతున్న వారిని బయటికి పంపటం పిచ్చికాకపోతే ఏంటి?!

– చేతన్ భగత్, మోటివేషనల్ పర్సనాలిటీ

అదే నిజమైతే..!



2020 ఢిల్లీ అల్లర్ల కేసుల్లో పోలీసులు నిందితులుగా పేర్కొన్న అనేకమంది కార్యకర్తల బెయిల్ దరఖాస్తులను పరిష్కరించటంలో న్యాయ స్థానాలలో అనాలోచితమైన జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవి నిజమే కనుకైతే ఇది ఆ నిందితుల స్వేచ్ఛా హక్కులను పూర్తిగా ఉల్లంఘించటమే!

– ప్రశాంత్ భూషణ్, లాయర్

ముందే తెలుసు!



ఆరు నెలల క్రితం నేను నా తదుపరి చిత్రం 'ది ఢిల్లీ ఫైల్స్' కోసం ఇండో–బంగ్లాదేశ్ సరిహద్దులో ఇండియా వైపు ఉన్న వారిని ఇంటర్వ్యూ చేశాను. అప్పుడు నేను గ్రహించినదేమంటే – ఆ గ్రామస్థులకు భారత రాజకీయాల కంటే బంగ్లాదేశ్ రాజకీయాలపైనే ఎక్కువ అవగాహన ఉందని! షేక్ హసీనాపై తిరుగుబాటు జరగబోతోందని వారు ఆనాడే అంచనా వేశారు!

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, బాలీవుడ్ దర్శకుడు

ఎవరికి పట్టింది?



దేశంలోని ముస్లిమేతరులందరి హక్కులను తొలగిస్తూ ఇరాక్ ప్రభుత్వం కొత్త చట్టాన్ని ఆమోదించింది. కనీస వివాహ వయస్సును 9 సంవత్సరాలకు తగ్గించటం ద్వారా బాల్య వివాహాలను సమర్థంగా చట్టబద్ధం చేసింది. ఈ చర్యకు వ్యతిరేకంగా ఆ దేశంలో ఏదైనా నిరసన ఉంటుందా? ఉండక పోవచ్చు!

– డా॥ మాలౌఫ్, జియో పొలిటికల్ కామెంటేటర్

ఇన్‌బాక్స్

ఊపిరి తీస్తున్న వాయు కాలుష్యం

మనిషి బ్రతకడానికి ఊపిరి తీసుకుంటాడు. అలాంటిది ఈ మధ్య కాలంలో ఊపిరి తీసుకోవడమే ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించింది. వాతావరణంలో కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరిగిపోవడం వలన స్వచ్ఛమైన ప్రాణవాయువు శాతం తగ్గిపోతోంది. దీనివలన చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు అనేక ఆరోగ్య సమస్యలు అనుభవించాల్సి వస్తోంది.

మనం పీల్చే గాలిలో ప్రాణాంతకమైన కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. ఊపిరి తీసుకున్న తరువాత శరీరంలోకి చేరిపోయి అవయవాలను నిర్వీర్యం చేస్తున్నాయి. మనదేశంలో అతిపెద్ద నగరాలలో సంభవిస్తున్న మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణమని తాజా అధ్యయనంలో తెలిసింది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలలోని గాలిలో అత్యంత సూక్ష్మమైన 'పి.ఎం 2.5' ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు ఒక నివేదిక తెలిపింది. మనదేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో చాలా మరణాలకు వాయు కాలుష్యమే కారణమవుతున్నట్లు తెలిపింది. పి.ఎం అంటే పార్టిక్యులేట్ మ్యాటర్. 2.5 అంటే... గాలిలో ఉండే సూక్ష్మ కణాల వ్యాసం 2.5 మైక్రోమీటర్లు లేదా అంతకంటే తక్కువ ఉన్నవని అర్థం. ఈ కణాలు ఆరోగ్యానికి చాలా హాని చేస్తాయి. ఇవి ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, శ్వాసనాళాల మీద ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. ఈ గాలిలోకి చేరే సల్ఫేట్లు, బొగ్గు సంబంధమైన కలుషితాల వంటివి ఊపిరితిత్తులకు పట్టేస్తున్నాయి. గుండెకు వెళ్లే రక్తపునాళాల్లో పేరుకుపోతున్నాయి.

మనదేశంలోని పెద్ద పెద్ద నగరాలలో నిత్యం వెలువడుతున్న పి.ఎం 2.5 ధూళికణాల వలన మరణాలు రేటు నానాటికీ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఒక క్యూబిక్ మీటర్ గాలిలో 2.5 ధూళి కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువారీ మరణాల సంఖ్య 1.4 శాతం పెరుగుతున్నట్లు ఒక పరిశోధనలో గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమాల ప్రకారం ఒక రోజు అనగా 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 15 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం వుండదు, అంతకంటే పెరిగితే ముప్పు తప్పదు.

భారతదేశ వాయు నాణ్యతా ప్రమాణాల ప్రకారం 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 60 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం అంతగా ఉండదు. కానీ మనదేశంలో ప్రస్తుతం 75 మైక్రోగ్రాముల కంటే అధికంగానే ఉంటున్నట్లు తెలిసింది. క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాల రేటు సగటున 3 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించారు. వాయు కాలుష్యం వలన బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ వ్యాధులు, న్యూమోనియా, శ్వాసకోశ ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో చీకాకుతో పాటు దగ్గు, తుమ్ములు పెరుగుతాయి. దీనితో పాటు ఆస్తమా లాంటి సమస్యలు వస్తాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ వాయుకాలుష్యం ఇలానే పెరిగితే భూమికి రక్షణ కవచం అయిన ఓజోన్ పొర క్షీణించడం ఎక్కువవుతుంది. ఓజోన్ పొర దెబ్బతింటే యూవీ కిరణాలు నేరుగా భూమిపైన పడడం వలన చర్మ, నేత్ర సమస్యలు వస్తాయి. వ్యవసాయంపైన కూడా ప్రభావం చూపుతుంది. కాబట్టి వాయుకాలుష్యం తగ్గించడానికి ప్రభుత్వాలు సాధ్యమైనంత సత్వర చర్యలు తీసుకోవాలి.

– మోతె రవికాంత్ | సేఫ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, హైదరాబాద్

పగటి నిద్ర మేలే సుమా!

అభిప్రాయం



డా॥ కె. బి. గోపాలం

పగటి నిద్ర పనికి చేటు అన్నారు మనవాళ్లు. కానీ పరిశోధకులు మరోరకంగా అంటున్నట్టున్నారు. పగటి పూట పని చేసుకునేటప్పుడు కళ్ళు బరువెక్కుతాయి. నిద్ర వస్తున్న భావన కలుగుతుంది. అప్పుడు కాసేపు పడుకుంటే తప్పా? అంటే కాదు అంటున్నారు పరిశోధకులు. ఆరోగ్యం దృష్ట్యా చూస్తే కొంతసేపు పడుకోవడం మంచిదే అంటున్నారు. అయితే ఈ పగటి నిద్ర అందరిపైనా ఒకే ప్రభావం కలిగిస్తుందా అన్న ప్రశ్న కూడా ఉంది. చాలామందిలో మాత్రం కొంతసేపు పడుకుంటే మంచి జరుగుతుంది అని గమనించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. క్రమంగా ప్రతి నిత్యం మధ్యాహ్నం కొంచెం సేపు పడుకుంటే అన్ని రకాల మంచిదే. దాని వల్ల గుండెకు సంబంధించిన సమస్యలు దూరం అవుతాయి అని కొంత కాలం క్రితమే తెలుసుకున్నారు. మెదడుకు కూడా మంచిదే అంటున్నారు. మెదడు కణాలు తగ్గకుండా ఉంటే జ్ఞాపకశక్తి తగ్గడం అనే సమస్య తగ్గుతుంది.

అయితే ఎంతసేపు పడుకోవాలి అన్నది పెద్ద ప్రశ్న. అరగంట వరకు పడుకుంటే తప్పు లేదు. మెదడుకు మంచి ఆరోగ్యం అందుతుంది, అది పనిచేసే, పెరిగే తీరు సక్రమంగా సాగుతుంది అంటున్నారు విక్టోరియా గార్ఫీల్డ్. ఆమె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌లో పరిశోధకురాలు.

సరైన సమయంలో కొద్దిపాటి నిద్ర వెంటనే మెదడు మీద ప్రభావం చూపిస్తుంది. ఈ విషయాన్ని చాలా పరిశోధనల్లో నిర్ధారించారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఒక క్రమంలో నిద్రపోతూ ఉంటే వాళ్ల మీద పరిశోధనలు జరిగాయి. పాత పరిశోధనల ఫలితాలను ఇక్కడి ఫలితాలతో సరిపోల్చి చూశారు. నిజానికి 2009లోనే ఇటువంటి పరిశోధనా ఫలితాలు 'స్లీప్ రీసెర్చ్' అనే పత్రికలో వచ్చాయి. కొంతసేపు పడుకున్న వారిలో వారు పరిస్థితులకు ప్రతిచర్య చూపించే తీరు, చురుకుదనం, జ్ఞాపకశక్తి లాంటి అంశాలలో మంచి ప్రభావాలు కనిపించాయి. నిద్రపోయి లేచిన తర్వాత సృజనాత్మకత కూడా పెరుగుతుంది. అంటే కొత్త అంశాలను ఊహించడం కూడా బాగా జరుగుతుంది. ఈ అంశం ఇటీవల పరిశోధనల్లో గమనించారు.

పరిశోధనకు కూర్చున్న వారికి కొన్ని లెక్కలు ఇచ్చి చేయమన్నారు. ఆ లెక్కల్లో కొన్నింటికి సులభ మార్గాలు ఉన్నాయి. వాటి గురించి మాత్రం వాలంటీర్లకు చెప్పలేదు. ప్రశ్న ఇచ్చిన తర్వాత కాసేపు పడుకుంటే మాకేమీ అభ్యంతరం లేదు అన్నారు పరిశోధకులు. కొద్దిసేపు కునికిన వారు కూడా ఆ లెక్కలను సులభంగా సాల్వ్ చేయగలిగారు. వారికి స్వల్ప మార్గాలు చటుక్కున తోచాయి. అదే ఎక్కువ సేపు నిద్ర పోయిన వారిలో మాత్రం ఇటువంటి చురుకుదనం కనిపించలేదు. అంటే మెదడులో ఎక్కడో విరామం కలిగే అవకాశం గల స్థానం ఉందని, దానివల్ల యురేకా అనుభవం కలుగుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.



నిద్ర సరిగా రానివారూ, కావలసినంత నిద్ర పోలేని వారు కూడా కొద్దిసేపు పడుకున్నందుకు మంచి ప్రభావాలు ఉంటాయి అంటున్నారు. షిఫ్టులలో పనిచేసేవారూ, చిన్న శిశువులతో బతికే తల్లితండ్రులూ, రాత్రిపూట సరిగా నిద్ర పట్టని పెద్ద వయసు వారూ చిన్న కునుకు వల్ల లాభం పొందినట్టు గమనించారు. రాత్రి షిఫ్ట్‌లో పని చేస్తున్న వాళ్లు షిఫ్ట్ మధ్యలో కొద్దిసేపు పడుకుంటే తప్పకుండా నిద్ర మత్తు తగ్గుతుంది. అసలు నిద్ర వస్తున్న భావమే కలుగదు. కొద్దిసేపు పడుకుని లేచిన తరువాత త్వరలోనే పరిస్థితి మారిపోతుంది. వారిలో చురుకుదనం కనిపిస్తుంది.

వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీలో పని చేస్తున్న నటాలి డాటోవిచ్ బృందం వారు కూడా ఈ అంశం గురించి పరిశోధిస్తున్నారు. వారికి నిజానికి ఔషధాలు తయారు చేసే కంపెనీలు, వైద్య పరికరాల కంపెనీలు ఆర్థిక సహాయం చేస్తున్నాయి. 20 నిమిషాలు పడుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. గంట నుంచి గంటన్నరసేపు పడుకుంటే మరింత మంచి ఫలితాలు కనిపిస్తాయి అంటున్నారు నటాలి. పడుకుంటే 20 నిమిషాలు పడుకోవాలి, లేదంటే గంటపైన పడు కోవాలి. అంతే కానీ మధ్యలో లేస్తే అంత మంచి ప్రభావం ఉండదు అని గమనించారు.

ఎక్కువ రోజులపాటు ఇలా కునుకులు తీసే వారి మీద ప్రభావం గురించి మాత్రం అంతగా సమాచారం లేదు. నిద్రకు ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి గల సంబంధాన్ని గురించి చెప్పడం అంత తేలిక కాదు అని కూడా ఈ పరిశోధకులు అంటున్నారు.


'కొంచెం సేపు నిద్రపోతే మంచిదేనట' అని నిద్రకు ఉపక్రమించేవారు ఫలితాలను గురించి కూడా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. మంచి ఫలితాలు కనిపిస్తే కొంచెం సేపు నిద్రించవచ్చు. ఆ నిర్ణయం చాలా జాగ్రత్తగా తీసుకోవాల్సినది.

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత

అర్థం చేసుకోవడంలోనే...

శ్రీ రామకృష్ణ పరమహంస ఓ కథ చెప్పారు. అది ఇలా సాగుతుంది:

"ఊరి పొలి మేరలో ఓ ఆశ్రమంలో గురువు ఉండేవారు. ఆయనకు శిష్యులనేకమంది. ఒకరోజు వారందరినీ కూర్చోపెట్టి... 'ఈ లోకంలో ఉన్నవన్నీ దేవుడి రూపాలే. దానిని మీరు అర్థం చేసుకుని నమస్కరించాలి' అన్నారు. శిష్యులందరూ సరేనన్నారు.



జ్యోతిర్మయం

ఓరోజు ఓ శిష్యుడు గురువుగారు చెప్పిన పని మీద అడవిలోకి బయలుదేరాడు. ఇంతలో 'ఎవరెక్కడున్నా సరే పారిపోండి... మదమెక్కిన ఏనుగొకటి వస్తోంది. దాని కంట పడకండి' అని హెచ్చరిస్తూ ఒక వ్యక్తి పారిపోతున్నాడు. ఈ హెచ్చరికతో అక్కడక్కడా ఉన్నవారు పారిపోయారు. కొందరు చెట్టెక్కి కూర్చున్నారు. కానీ ఈ గురువుగారి శిష్యుడున్నాడు చూశారూ, అతను తన ధోరణిలోనే నడుస్తున్నాడు. పైగా 'నేనెందుకు పరుగెత్తాలి... నేనూ దేవుడు, ఆ ఏనుగూ దేవుడే! ఇద్దరం ఒక్కటే... ఏనుగు నన్నేం చేస్తుంద'నుకుని దారి మధ్యలో నిల్చుండిపోయాడు. ఏనుగు సమీపిస్తోంది. కానీ అతను ఉన్న చోటనే నిల్చున్నాడు. చేతులు రెండూ పైకెత్తి నమస్కరించాడు. పైగా దైవప్రార్థన చేశాడు. ఇంతలో ఏనుగుమీదున్న మావటివాడు కూడా అతనిని పక్కకు తప్పుకోమని హెచ్చరించాడు. కానీ శిష్యుడు ఆ హెచ్చరికను ఖాతరు చేయలేదు. అతను కావాలంటే ఏనుగుని దేవుడిగా భావించవచ్చు. కానీ ప్రతిగా ఏనుగు అలా అనుకోదుగా! అతను చేతులు రెండూ పైకెత్తి నిల్చోడంతో ఏనుగు పని మరింత సులువైంది. అది అతనిని ఒక చుట్ట చుట్టి కింద పడేసి ముందుకు వెళ్ళిపోయింది. అతనికి గాయాలయ్యాయి. విషయం తెలిసి ఆశ్రమానికి చెందినవారు అక్కడికి చేరుకుని కింద పడి ఉన్న అతనిని అతికష్టం మీద గురువుగారి వద్దకు తీసుకుపోయారు. అతను జరిగినదంతా చెప్పాడు. అప్పుడు గురువుగారు 'నువ్వనుకున్నది నిజమే, కానీ మావటివాడు కూడా దేవుడే కదా! అతను నిన్ను హెచ్చరించాడుగా తప్పుకోమని! ఆ మాటైనా పట్టించుకోవాలి కదా' అని చెప్పగా శిష్యుడు అయోమయంగా చూశాడు. 'వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోక పోవడం వల్ల వచ్చిన ప్రమాదమిది' అంటూ గురువుగారు కథ ముగించారు."

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి తె.4.56 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.11.45 నుండి 1.25 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.20 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.53 వరకు, **అమృతఘడియలు:** రా.9.56 నుండి 11.44 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.25.

క్లుప్తంగా...

7 నుంచి 'కాణిపాకం'లో బ్రహ్మోత్సవాలు



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 7 నుంచి 27 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఉభయదారుల సమక్షంలో ఆదివారం నిర్వహణ పత్రాన్ని విడుదల చేశారు. తేదీల వారీగా వాహన సేవలను వివరించారు.

18 నుంచి దుర్గగుడిలో పవిత్రోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సమయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ తెలిపింది. 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలు ఉదక శాంతి జరుగుతుంది. 18వ తేదీ తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, అనంతరం విశేష అలంకరణ, పవిత్రమాల ధారణ జరుగుతుంది. ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుంది. చండీహోమ యాగశాలలో గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, దేవతారాధన, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మూలమంత్ర హవనం, దేవ పారాయణ, హారతి జరుగుతుంది. 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. అనంతరం కలశోద్వాసన, మార్జన, మహాదాశీర్వచనం జరుగుతుంది.

గుంటూరులో నార్త్ క్లబ్ మూత



మూసివేసిన క్లబ్ ప్రధాన ద్వారాలు

పట్నంబజారు: గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో ఉన్న నార్త్ క్లబ్ మూతపడింది. కొద్ది రోజులుగా టీడీపీ నేతల కనుసన్నల్లో నార్త్ క్లబ్‌లో ముమ్మరంగా పేకాట జరుగుతోంది. ఈ క్రమంలో 'సాక్షి'లో ఆదివారం 'బ్రోకర్.. జోకర్.. సర్కారే' పేరుతో కథనం ప్రచురితం కావడంతో క్లబ్ నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. క్లబ్ ప్రధాన ద్వారాలు మూసివేశారు. లోపల క్లబ్‌లో పనిచేసే సిబ్బంది మాత్రమే ఉన్నారు. కొంతమంది జూదరులు వచ్చినప్పటికీ 'ఆట లేదు...' అని అక్కడి సిబ్బంది చెప్పడం కనిపించింది.

పొలాన్ని ఆక్రమించారంటూ దళిత మహిళ నిరాహారదీక్ష



నరసరావుపేటరూరల్: తన పొలాన్ని అగ్రవర్ణాల వారు ఆక్రమించారంటూ పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో దళిత మహిళ పొలంలోనే నిరవధిక నిరాహార దీక్షకు దిగింది. శనివారం రాత్రి తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఆందోళన కొనసాగించింది. గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు తన భూమిని ఆక్రమించుకున్నారని, భూమి కోసం ఎనిమిదేళ్లుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. 1989లో అమడపూడి తిరుమలయ్యకు గ్రామంలోని 177/10బీ సర్వే నంబర్‌లో ఎకరం పొలానికి ప్రభుత్వం డీకే పట్టా ఇచ్చింది. ఈ పొలం తన తాత ద్వారా తల్లికి, ఆమె నుంచి తనకు హక్కుగా వచ్చిందని తెలిపారు. ఈ భూమిని గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు 2016లో ఆక్రమించుకున్నారని, అప్పటి నుంచి ఎన్నోసార్లు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఒంటరి మహిళనైన తనకు భూమి మినహా ఇతర ఆధారం లేదని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరింది.

'భోగాపురం' పనులు త్వరగా పూర్తి చేయండి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రామ్మోహన్‌నాయుడు

భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ఆదివారం కేంద్ర విమానాశ్రయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. టెర్మినల్, ఏటీసీ, రన్‌వే నిర్మాణ పనులను ఆయన పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులకు సూచించారు. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బంగారులోకం!

ఆంధ్రా సింగరేణిగా మారనున్న 'చింతలపూడి'


బొగ్గు గనుల వేలం జాబితాలో చింతలపూడి రెండు సెక్టార్లకు చోటు

ఇక్కడ భూ ఉపరితలానికి 500 మీటర్ల లోతులోనే నాణ్యమైన గ్రేడ్-1 బొగ్గు

బొగ్గు తవ్వకాలు ప్రారంభమైతే ఏలూరు జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు

వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి

సాక్షి ప్రతినిధి, ఏలూరు



ఆంధ్రా సింగరేణిగా ఏలూరు జిల్లా చింతలపూడి ప్రాంతం వెలుగొందనుంది. నల్ల బంగారు గనులతో రాష్ట్రానికి కాసుల పంట పండించనుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. నవ్యాంధ్ర అభివృద్ధికి ఊతం అందించనుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 80 బొగ్గు గనుల వేలానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ జాబితాలో ఏలూరు జిల్లా చింతలపూడి సెక్టార్ ఏ–1 (ఎస్‌డబ్ల్యూ), చింతలపూడి సెక్టార్ ఏ–1 (ఎస్‌ఈ)లు 44, 45 స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు సెక్టార్లు కూడా చింతలపూడి మండలంలోనే ఉండటం విశేషం. దీంతో చింతలపూడి మండలంలో నాణ్యమైన బొగ్గు తవ్వకాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

గతంలోనే వేలంలో చోటు దక్కినా...!

చాట్రాయి మండలం సోమవరం గ్రామం నుంచి చింతలపూడి వరకు 2వేల మిలియన్ టన్నుల నుంచి 3వేల మిలియన్ టన్నుల బొగ్గు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలోని సింగరేణి తరహాలో ఇక్కడ బొగ్గు తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి 2015లో ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎండీసీ) లేఖ రాసింది. దానిపై కేంద్రం స్పందించలేదు. కానీ, గతంలో కేంద్రం దేశవ్యాప్తంగా నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో ప్రస్తుతం ఏలూరు జిల్లా చాట్రాయి మండలం సోమవరం, తడికలపూడితోపాటుగా చింతలపూడి బ్లాక్‌లోని జంగారెడ్డిగూడెం కూడా ఉన్నాయి. ఈ వేలంలో సింగరేణి సంస్థ పోటీలో లేకపోవడంతో బొగ్గు గనుల వేలం వాయిదా పడింది. తాజాగా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దేశవ్యాప్తంగా నూతన బొగ్గు గనుల వేలం జాబితాను ప్రకటించగా, చింతలపూడి సెక్టార్ ఏ–1 (ఎస్‌డబ్ల్యూ), చింతలపూడి సెక్టార్ ఏ–1 (ఎస్‌ఈ)లకు చోటు దక్కింది. దీంతో బొగ్గు తవ్వకాలు ప్రారంభమైతే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

60 ఏళ్ల నుంచి అన్వేషణ..

- ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల పరిధిలో బొగ్గు గనులను కనుగొనేందుకు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తోపాటు వివిధ సంస్థలు 60 ఏళ్ల నుంచి సర్వేలు చేశాయి. తొలి దశలో 1964 నుంచి 2006 వరకు నాలుగు దఫాలుగా సర్వేలు నిర్వహించారు. 2006 నుంచి 2016 వరకు మళ్లీ సర్వేలు కొనసాగాయి.
- అన్ని సర్వేల్లోనూ చింతలపూడి ప్రాంతంలో నాణ్యమైన బొగ్గు గనులు ఉన్నట్లు గుర్తించారు. ఆయా సర్వే సంస్థల నివేదికల్లో కొన్ని స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ చింతలపూడి మండలంలో 30 కిలో మీటర్ల వ్యాసార్థంలో బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నట్లు దాదాపు అన్ని సంస్థలు అంచనా వేశాయి.
- లక్నోకు చెందిన బీర్బల్ సహానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియో బోటనీ అనే సంస్థ 2013లో నాటి కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బొగ్గు గనులపై అధ్యయనం చేసింది. చాట్రాయి మండలం సోమవరం నుంచి చింతలపూడి, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం మండలాల మీదుగా రాజమండ్రి వరకు నాణ్యమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ఇతర రాష్ట్రాల్లో లభించే బొగ్గుతో పోల్చితే ఇక్కడ అత్యంత నాణ్యమైన గ్రేడ్-1 రకం బొగ్గు ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. అది కూడా భూ ఉపరితలానికి 500 మీటర్ల లోతులోనే బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని వెల్లడించింది.
- సౌత్ వెస్ట్ పినాకిల్ సంస్థ మరో సంస్థతో కలిసి చింతలపూడి ప్రాంతంలో 120 పాయింట్లను గుర్తించి అధునాతన రిగ్గులతో డ్రిల్లింగ్ చేపట్టింది. ఈ 120 పాయింట్ల ద్వారా సుమారు 65,000 మీటర్ల లోతున బొగ్గు అన్వేషణ చేపట్టి సుమారు 40,000 మీటర్ల పనులు పూర్తి చేసింది.
- ఇక్కడ గనుల్లో తవ్వకాలు ప్రారంభమైతే ఏడాదికి 8 వేల మెగావాట్లు చొప్పున 60 సంవత్సరాల వరకు విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు సరిపోతుందని వివిధ సర్వే రిపోర్టుల ఆధారంగా అధికారులు అంచనా వేశారు.

మహిళా జెడ్పీటీసీపై టీడీపీ గూండాల దాడి

పెదకూరపాడు: అధికారమే అండగా టీడీపీ ముష్కర మూకలు యథేచ్ఛగా దౌర్జన్యకాండ సాగిస్తూనే ఉన్నాయి. తాజాగా పల్నాడు జిల్లా పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి ఇంటిపై ఆదివారం తెల్లవారుజామున టీడీపీ గూండాలు దాడికి దిగారు. ఒక్కసారిగా 15 మంది టీడీపీ రౌడీలు పెదకూరపాడు మండలం గారపాడులోని జెడ్పీటీసీ ఇంటిలోకి ప్రవేశించి ఆమె సెల్‌ఫోన్ లాక్కొని పగలకొట్టారు. వృద్ధురాలన్న కనికరం కూడా లేకుండా స్వర్ణకుమారి తల్లి గణేశ్ శివమ్మని కింద పడేశారు. దీంతో ఆమె కాళ్లకు గాయాలయ్యాయి. టీడీపీ గూండాలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన జెడ్పీటీసీ స్వర్ణకుమారిని, ఆమె పెద్ద కుమార్తెను పక్కకు తోసేశారు. 'నీ భర్తను పిలువు.. మాకు అప్పగించు' అంటూ దౌర్జన్యం చేశారు. తన భర్త ఇక్కడ లేరని చెప్పినా వినిపించుకోకుండా భయోత్పాతం సృష్టించారు.

రెక్కీ నిర్వహించి మరీ..

వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా నాయకుడైన కంకణాల శివాజీ తెలంగాణలో కాంట్రాక్టులు చేస్తుంటారు. గత ఎన్నికల్లో పెదకూరపాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా తన భార్య స్వర్ణకుమారిని పోటీ చేయించి గెలిపించుకున్నారు. స్వర్ణకుమారి, శివాజీ దంపతుల ఇద్దరు కుమార్తెలు హైదరాబాద్‌లో ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ఆ దంపతులు కొద్ది రోజులు హైదరాబాద్‌లో, మరికొద్దిరోజులు స్వగ్రామం గారపాడులో ఉంటున్నారు. మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న తన భర్త తల్లిని స్వగ్రామంలో వదిలిపెట్టడానికి జెడ్పీటీసీ స్వర్ణకుమారి, తన కుమార్తెలతో కలిసి కారులో శనివారం రాత్రి హైదరాబాద్‌లో బయలుదేరారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో గారపాడుకు వచ్చిన వెంటనే శివారులో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉట్లపల్లి శ్రీనివాసరావు కారులో మాటు వేశాడు. జెడ్పీటీసీ తన అత్తను వారి ఇంటి వద్ద దించి, ఆమె బాగోగులు చూసుకోవడానికి చిన్న కుమార్తెను ఉంచారు. పెద్ద కుమార్తెను తీసుకుని తన తల్లి గణేశ్ శివమ్మ ఇంటికి జెడ్పీటీసీ వెళ్లారు.



జెడ్పీటీసీ స్వర్ణకుమారి ఇంటిపైకి వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్న టీడీపీ రౌడీ మూకలు

సెల్‌ఫోన్ పగులకొట్టి జెడ్పీటీసీ తల్లిపై దాడి

ఈ క్రమంలో ఉట్లపల్లి శ్రీనివాసరావు తనతోపాటు నెల్లూరి వెంకటేశ్వర్లు, ఉట్లపల్లి కోటేశ్వరరావు, మక్కెన ప్రభాకరరావు, కొంకా శౌరీలు, మక్కెన పవన్, ఉట్లపల్లి శ్రీనివాసరావు, బండారు మాధవరావు, పొదిలె కోటేశ్వరరావు, మక్కెన అప్పారావు, పెనుముచ్చు రమేశ్‌లతోపాటు మరో ఐదుగురిని తీసుకుని ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వర్ణకుమారి ఇంటికి వచ్చి తలుపు కొట్టారు. ఆమె తలుపులు తీయగానే ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించిన టీడీపీ గూండాలు 'నీ భర్త శివాజీ గాడు ఎక్కడ.. వాడి అంతుచూస్తాం.. బయటకు రమ్మను' అంటూ బిగ్గరగా కేకలు వేసి భయభ్రాంతులకు గురి చేశారు.

ఎస్‌ఐకి ముందుగానే సమాచారమిచ్చినా..

తమపై టీడీపీ గూండాలు దాడికి దిగనున్నారని ముందుగానే తెలుసుకున్న జెడ్పీటీసీ స్వర్ణకుమారి భర్త శివాజీ పెదకూరపాడు ఎస్ఐ విపర్ల వెంకట్రావుకు ముందుగానే సమాచారం ఇచ్చారు.

ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదు..

రెండు వేల ఓట్లు ఉన్న గారపాడులో గతంలో ఇలాంటి సంస్కృతి ఎన్నడూ లేదు. ఇళ్లపైకి వచ్చి దాడి చేయడం ఏమిటి? మీ నాయకుడు చంద్రబాబు ఇదేనా మీకు నేర్పింది? మా గ్రామంలోకి మేము రాకూడదా? మా ఇంటిపైకి బీభత్సం సృష్టించిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

–స్వర్ణకుమారి, జెడ్పీటీసీ, పెదకూరపాడు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టెక్ మహీంద్రా సీఈఓ సీపీ గుర్నానీ, బిగ్‌బాస్ కంటెస్టెంట్ రతిక రవీందర్ శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. – తిరుమల

వీఆర్వోపై టీడీపీ నేతల దాడి

- ఆక్రమణలు అడ్డుకోవడమే కారణం
- సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో తమ్ముళ్ల బరితెగింపు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చెరువు, గుట్ట పోరంబోకును ఆక్రమించుకుని సాగు చేస్తుండగా అడ్డుకున్నందుకు వీఆర్‌వోపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలోని గుడుపల్లె మండలం గుండ్లసాగరంలో జరిగింది. గ్రామ పంచాయతీ నక్కనపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 62,63లో బచ్చన చెరువు, వడ్డేనిగుట్ట 14.56 ఎకరాలు విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రభుత్వ స్థలంపై గుండ్ల సాగరం పంచాయతీ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఆర్ముగం కన్నేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే చెరువు, గుట్ట పోరంబోకు 4.52 ఎకరాలను చదును చేసి వ్యవసాయం చేయడం ప్రారంభించారు. దీంతోపాటు భవన నిర్మాణం కోసం పునాదులు వేశారు. విషయం తెలుసుకున్న పక్కనే ఉన్న గుత్తార్లపల్లి గ్రామస్తులు చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు బచ్చన చెరువు,



గుత్తార్లపల్లి గ్రామస్తులతో వాగ్వాదం చేస్తున్న ఆక్రమణదారులు (ఇన్‌సెట్లో) వీఆర్వో కుమార్

చెనెస్ చెరువు, వడ్డెని గుట్టను రెండు రోజులుగా సర్వే చేసి, ప్రభుత్వ స్థలం చుట్టూ జేసీబీతో గుంత తవ్వారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఆర్ముగం తను ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలంలో కొబ్బరి చెట్లు నాటేందుకు ఆదివారం ప్రయత్నించగా వీఆర్‌వో కుమార్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు ఆర్ముగం, అతని తమ్ముడు రాజేంద్ర, గోవిందరాజులు వీఆర్‌వోపై దాడి చేశారు. ఈ దాడిలో వీఆర్ఓ కుడి కన్నుకు బలంగా గాయం కావడంతో కుప్పం వంద పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు గుడుపల్లె పోలీసులు ముగ్గురు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మోహన్‌బాబు కృషి అనిర్వచనీయం

ఎంబీయూ స్నాతకోత్సవంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చంద్రగిరి(తిరుపతి జిల్లా): పట్టుదలకు మారుపేరు మోహన్‌బాబు అని, యూనివర్సిటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో ఆదివారం వర్సిటీ మొదటి స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డెప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆకాంక్షల మేరకు విద్యార్థులు భవిష్యత్‌లో మంచి విజయాలను సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎంబీయూని మొదటిసారి సందర్శించానని, ఒక మానససరోవరంగా ఉందని చెప్పారు. పీఈటీగా జీవితాన్ని మొదలుపెట్టిన మోహన్‌బాబు పద్మశ్రీ స్థాయికి ఎదగడం వెనుక గొప్ప కృషి దాగి ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న భట్టి విక్రమార్క. చిత్రంలో మోహన్‌బాబు, విష్ణు తదితరులు

సర్వీసు వివాదాలను ఇతరులు సవాలు చేయలేరు

- అలా దాఖలుచేసే రిట్ పిటిషన్‌కు విచారణార్హతే లేదు
- సాటి ఉద్యోగి మాత్రమే సవాలు చేయగలరు
- సంబంధంలేని మూడో వ్యక్తి రిట్ ద్వారా ప్రశ్నించజాలరు
- అభ్యంతరాలుంటే వాటిని తగిన వేదిక ముందు సవాలు చేసుకోవచ్చు
- తీర్పునిచ్చిన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె. మన్మథరావు
- శ్రీకృష్ణ గీత ఆశ్రమం ఈఓపై దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి : ప్రభుత్వ సంస్థలో పనిచేయని, ఆ సంస్థ పరిపాలన వ్యవహారాలతో సంబంధంలేని ఏ వ్యక్తి అయినా కూడా ఆ సంస్థ కార్యకలాపాలను, అధికారుల చర్యలను ప్రశ్నిస్తూ అధికరణ–226 కింద రిట్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టంచేసింది. అలా దాఖలు చేసే రిట్ పిటిషన్‌కు ఎంతమాత్రం విచారణార్హత లేదని తేల్చి చెప్పింది. ఆ సంస్థ, ఆ అధికారి చర్యలపై అభ్యంతరాలుంటే వాటిని తగిన వేదికల ముందు సవాలు చేసుకోవచ్చునని సూచించింది. సర్వీసు వివాదాలను సాటి ఉద్యోగి మాత్రమే సవాలు చేయగలరని, సంబంధంలేని మూడో వ్యక్తి ప్రశ్నించజాలరని స్పష్టంచేసింది. వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీత ఆశ్రమం కార్యనిర్వహణాధికారి (ఈఓ) అయిన సి. శంకర బాలాజీని జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడాన్ని సవాలు చేస్తూ ఎం. సురేష్ అనే వ్యక్తి



దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కుంభజడల మన్మథరావు ఇటీవల తీర్పు వెలువరించారు.

ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడం తగదు..

ప్రొద్దుటూరుకు చెందిన సురేష్ శ్రీకృష్ణ గీత ఆశ్రమానికి చెందిన స్థలాన్ని లీజుకు తీసుకుని అందులో శారదా జూనియర్ కాలేజీ పేరుతో విద్యా సంస్థను నడుపుతున్నారు. ఆ ఆశ్రమానికి శంకర బాలాజీ ఈఓగా వ్యవహరిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన్ను జిల్లా దేవాదాయశాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. దీనిని సవాలుచేస్తూ సురేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. శంకర బాలాజీ రెండు పోస్టుల్లో కొనసాగడానికి వీల్లేదని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. అసిస్టెంట్ కమిషనర్‌గా శంకర బాలాజీ నియామకం చట్ట విరుద్ధమన్నారు.

ఆ నియామకం పిటిషనర్‌కు సంబంధంలేనిది..

అందరి వాదనలు విన్న న్యాయమూర్తి.. శ్రీకృష్ణ గీత ఆశ్రమం, దేవదాయ శాఖ పరిపాలన వ్యవహారాల్లో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధంలేదన్నారు. శంకర్ బాలాజీని పూర్తిస్థాయి ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడమన్నది పిటిషనర్‌కు సంబంధంలేని వ్యవహారమని తేల్చిచెప్పారు. అందువల్ల ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా శంకర్ బాలాజీ నియామకాన్ని ప్రశ్నించజాలరన్నారు. సురేష్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యం కోర్టును విసిగించేదన్నారు. కాబట్టి.. సురేష్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కొట్టేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

సర్వీసు ఉద్యోగాల్లో సహ ఉద్యోగే బాధితుడు

దేవదాయ శాఖ కమిషనర్ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా బాలాజీ నియామకంవల్ల పిటిషనర్ ఏ విధంగా బాధితుడు కాదని, ఆయన నియామకాన్ని ప్రశ్నించేందుకు సహ ఉద్యోగి కూడా కాదన్నారు. సర్వీసు వివాదాల్లో సహ ఉద్యోగి మాత్రమే బాధిత వ్యక్తి అవుతారని కమిషనర్ తన కౌంటర్‌లో పేర్కొన్నారు. ఆశ్రమం ఈఓ కౌంటర్ దాఖలు చేస్తూ కళాశాల నిర్వహిస్తున్న స్థలాన్ని ఎలాంటి వేలం నిర్వహించకుండా తనకే 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని పిటిషనర్ సురేష్ దేవదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారన్నారు. చెల్లించాల్సిన లీజు బకాయిలను కూడా చెల్లించలేదని, బకాయిల కోసం పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. అద్దె కూడా సక్రమంగా చెల్లించకుండా కాలేజీ నిర్వహిస్తున్నారని, వీటన్నింటినీ ప్రశ్నిస్తున్నందుకే శంకర బాలాజీ నియామకాన్ని సవాలుచేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. శంకర బాలాజీ సైతం ఇదే విషయాలతో వ్యక్తిగత హోదాలో కౌంటర్ దాఖలు చేశారు.



కాలువ గట్లు గుల్ల!

- పోలవరం కాలువ గట్లను యథేచ్ఛగా తవ్వేస్తున్న కూటమి నేతలు
- ద్వారకా తిరుమల, ఉంగుటూరు మండలాల్లో అడ్డగోలుగా తవ్వకాలు
- మట్టి రవాణా కోసం సొంతంగా రోడ్డు నిర్మాణం
- వందలాది టిప్పర్లలో మట్టి తరలింపు.. పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో కూటమి నేతలు పోలవరం కాలువ గట్లను గుల్ల చేస్తున్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు యంత్రాలతో కాలువ గట్లను తవ్వి మట్టి తరలిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని ద్వారకా తిరుమల, ఉంగుటూరు మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో కాలువ గట్లను సగానికి పైగా తవ్వేశారు. అవసరమైతే మట్టి తరలించడానికి సొంతంగా రోడ్లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కాలువ వైపు కన్నెత్తి చూడటం లేదు.

అడ్డగోలు తవ్వకాలు ఇలా...

ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, గుళ్లపాడులో టీడీపీ నాయకులు భారీగా అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఎం. నాగులపల్లిలో పోలవరం కుడి కాలువ గట్టును దాదాపు సగం తవ్వేశారు. దీంతో కాలువ పటిష్టతపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటంతో వారం రోజులుగా తవ్వకాలు ఆపారు. గుళ్లపాడులో మాత్రం యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి రోజూ 100 నుంచి 130 వరకు టిప్పర్లు, 50కి పైగా ట్రాక్టర్లలో ఏలూరుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. ఉంగుటూరు మండలం కంసాలిగుంటలో పోలవరం ఎడమ గట్టును తవ్వి మట్టిని తరలించేందుకు జనసేన నాయకుడు ఏకంగా రోడ్డు నిర్మించాడు.

రూ.కోట్లలో ఆదాయం

ప్రభుత్వం అనుమతి పొందిన చోట మట్టి తవ్వకాల కోసం ఒక క్యూబిక్ మీటర్‌కు మైనింగ్ శాఖకు రూ.120, ఇరిగేషన్ శాఖకు రూ.110 చొప్పున మొత్తం రూ.230 చెల్లించాలి. టిప్పర్‌కు 18 క్యూబిక్ మీటర్ల వరకు మట్టి లోడ్ చేసి విక్రయిస్తున్నారు. ఈ లెక్కన క్యూబిక్ మీటరుకు రూ.230 చొప్పున ఒక లారీకి రూ.4,140 ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ పైసా ఫీజు చెల్లించకుండానే అక్రమంగా పోలవరం కాలువ గట్లు తవ్వి వందలాది టిప్పర్లలో రోజూ మట్టిని తరలించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.

కేంద్ర మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత



న్యూఢిల్లీ: మాజీ దౌత్యాధికారి, కేంద్ర మాజీ మంత్రి కున్వర్ నట్వర్ సింగ్ (93) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 15 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నట్వర్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రాజ కుటుంబీకుడు...

1931లో రాజస్తాన్‌లోని భరత్‌పూర్‌లో సంస్థానాధీశుల కుటుంబంలో నట్వర్ జన్మించారు. 1953లో విదేశాంగ శాఖ అధికారిగా కెరీర్ ప్రారంభించారు. చైనా, అమెరికా, పాకిస్తాన్, బ్రిటన్ తదితర దేశాల్లో కీలక హోదాల్లో పనిచేశారు. 1984లో కేంద్రం ఆయన్ను పద్మభూషణ్‌తో గౌరవించింది. అదే ఏడాది రాజకీయాల్లో చేరి భరత్‌పూర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. పలు అంశాలపై పుస్తకాలు కూడా రాశారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. 1985లో కేంద్ర ఉక్కు, బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. 1986లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి అయ్యారు. యూపీఏ-1 హయాంలో 2004లో మన్మోహన్ కేబినెట్లో ఏడాదిన్నరపాటు విదేశాంగ మంత్రిగా చేశారు. ఇరాక్ నుంచి చమురు కొనుగోలు అక్రమాల్లో నట్వర్ కుటుంబం లబ్ధి పొందినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ విషయంలో సోనియా గాంధీ మద్దతివ్వకపోవడంతో రాజీనామా చేశారు. కుమారుడు జగత్‌సింగ్‌తో పాటు 2008లో బీఎస్పీలో చేరినా 4 నెలలకే బహిష్కరణకు గురయ్యారు. జగత్ ప్రస్తుతంలో బీజేపీలో ఉన్నారు. నట్వర్ సింగ్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. దౌత్య రంగానికి ఆయన ఎనలేని సేవలందించారన్నారు.

భూమి రెండో పొర నుంచి... రాళ్ల నమూనా!

సముద్రగర్భం నుంచి 1.26 కి.మీ. లోతులో సేకరణ

తొలిసారిగా చేజిక్కిన భూ ప్రవార శిల ● జీవావిర్భావం గుట్టు వీడే ఆస్కారం

బ్రిటన్ భూ భౌతిక శాస్త్రవేత్తలు అత్యంత అరుదైన ఘనత సాధించారు. భూమి రెండో పొర అయిన మ్యాంటల్ (ప్రవారం) నుంచి తొలిసారిగా రాళ్ల నమూనాలను సేకరించగలిగారు. అట్లాంటిక్ మహాసముద్ర గర్భం నుంచి ఏకంగా 1,268 మీటర్ల మేర లోపలికి తవ్వి మరీ వాటిని వెలికితీశారు! భూగర్భంలో ఇప్పటిదాకా అత్యంత లోతైన ప్రాంతం నుంచి సేకరించిన శిల నమూనా ఇదే!! భూ ప్రవారంలో ఇంత లోతు దాకా డ్రిల్లింగ్ చేయగలగడమూ ఇదే మొదటిసారి. మహాసముద్రాల్లో డ్రిల్లింగ్ పనులు చేపట్టడంతో తిరుగులేని రికార్డున్న నౌక జోయిడిస్ రిజల్యూషన్ సాయంతో ఈ ఘనత సాధించారు. భూమి పుట్టుకకు సంబంధించిన ఇప్పటిదాకా మనకందని పలు కీలక రహస్యాల గుట్టు విప్పడంలో ఈ నమూనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటిదాకా మనకంతగా తెలియని భూ ప్రవారం తాలూకు కూర్పు, అక్కడ నిత్యం జరిగే కీలక రసాయనిక ప్రక్రియల గురించి విలువైన సమాచారం కూడా తెలుస్తోందట.

అతి పెద్ద ముందడుగు

భూమి ప్రధానంగా మూడు పొరలుగా ఉంటుంది. బాహ్య పొరను పటలం అంటారు. రెండో పొర రాళ్లమయమైన ప్రవారం కాగా అత్యంత లోపలి భాగమైన కేంద్రమండలం మూడో పొర. భూమి మొత్తం పరిమాణంలో ప్రవారం వాటాయే 80 శాతం దాకా ఉంటుంది. అట్లాంటిక్ మహాసముద్ర గర్భంలో దాగున్న అట్లాంటిస్ పర్వత శ్రేణి నుంచి అత్యంత వ్యయ ప్రయాసలకు ఓర్చి మరీ తాజా నమూనాలను సేకరించగలిగారు. భూ ప్రవార శిలా ఖండాలు సముద్ర జలాలతో ఎలా ప్రతిచర్య చెందుతున్నాయో అర్థం చేసుకోవడానికి తాజా నమూనాల విశ్లేషణ బాగా దోహదపడిందట. వందలాది కోట్ల ఏళ్ల కింద భూమిపై తొలిసారిగా జీవం ఎలా పురుడు పోసుకుందో తెలుసుకునే క్రమంలో ఈ తాజా వివరాలను అతి పెద్ద ముందడుగుగా సైంటిస్టులు అభివర్ణిస్తుండటం విశేషం.

సేకరణ అంత ఈజీ కాదు...

భూ ప్రవార శిలలు మానవాళికి ఇప్పటిదాకా అందరానివిగానే ఉండిపోయాయి. అందుకు కారణం లేకపోలేదు. భూ పలకలు పరస్పరం కలిసే చోట్ల, అదీ సముద్ర గర్భంలో మాత్రమే వాటిని సేకరించే వీలుంది. దాంతో సైంటిస్టులు అదే మార్గంలో ప్రయత్నించి ఫలితం సాధించారు. మహాసముద్ర గర్భంలో మిడ్ అట్లాంటిక్ రిడ్జ్‌కు అతి సమీపంలో ఉన్న అట్లాంటిస్ పర్వతశ్రేణి వద్ద ప్రవార శిలలు మనకు గట్టి ప్రయత్నంతో అందేంతటి లోతులోనే ఉంటాయన్న అంచనాతో రంగంలోకి దిగారు. 2024 ఏప్రిల్ నుంచి జోయిడిస్ ఇదే పనిలో గడిపింది. చివరికి జూన్ నాటికి రికార్డు స్థాయి లోతు దాకా డ్రిల్లింగ్ చేసి 886 అడుగుల పొడవున్న శిలా నమూనాను వెతికి తీయగలిగారు. ఈ క్రమంలో సముద్రగర్భం నుంచి 200 మీటర్ల లోతుకు తవ్విన గత రికార్డు తుడిచిపెట్టుకుని పోయింది. పైగా నాటి ప్రయత్నంలో పెద్దగా ప్రవార శిలలేవీ చిక్కలేదు కూడా. కనుక ఎలా చూసినా తాజా నమూనాల వెలికితీత అన్ని రికార్డులనూ బద్దలు కొట్టిందని కార్డిఫ్ వర్సిటీ జియాలజిస్టు, ఈ అధ్యయన సారథి జొహాన్ లీసెన్‌బర్గ్ చెప్పారు. ''ప్రవార శిలను పరిశీలించిన మీదట విలువైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిలోని ఖనిజ మూలకాలు వివిధ ఉష్ణోగ్రతల వద్ద సముద్ర జలంతో పలు రకాలుగా ప్రతి చర్య జరుపుతున్నట్టు తేలింది. ఫలితంగా సూక్ష్మజీవజాల ఉనికికి అతి కీలకమైన మీథేన్ వంటి సమ్మేళనాలు ఏర్పడుతున్నాయి. ఇంకా వీలైనన్ని ఉష్ణోగ్రతల వద్ద వాటిని విశ్లేషించిన మీదట భూమిపై జీవావిర్భావం తాలూకు రహస్యాలెన్నో విడిపోయే అవకాశముంది'' అని ఆయన వివరించారు. ఈ పరిశోధన వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు.



\- సాక్షి, నేషనల్ డెస్క్

నాపై అమెరికా కుట్ర

సెయింట్ మార్టిన్ ద్వీపం, బంగాళాఖాతంపై పెత్తనం కోరింది

షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు
- హింసాకాండ, మరణాలు చూడలేకే రాజీనామా చేశానని వెల్లడి
- త్వరలో బంగ్లాదేశ్‌లో అడుగు పెడతానని ప్రకటన

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధాని పదవి నుంచి తనను తప్పించడం వెనుక అమెరికా హస్తముందని చెప్పారు షేక్ హసీనా సంచలన ఆరోపణలు చేశారు. సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని, బంగ్లా సరిహద్దుల వెంబడి బంగాళాఖాతంపై పెత్తనాన్ని అప్పగించాలని అమెరికా కోరింది. అలా చేసి ఉంటే నా పదవికి ఢోకా ఉండేది కాదు'' అన్నారు. బంగ్లా ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు వంటి ఆ డిమాండ్లకు ఒప్పుకోనందుకే తనను దింపేసి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలని అమెరికా కుట్ర పన్నిందని మండిపడ్డారు. విద్యార్థుల శవాల మీదుగా అధికారం దక్కించుకోవాలని ప్రత్యర్థులు కుట్రలు చేశారని ఆరోపించారు. దేశంలో హింసాకాండను, మృతదేహాల ఊరేగింపులను చూడటం ఇష్టం లేకే రాజీనామా చేసినట్టు వెల్లడించారు. భారత్‌లో తలదాచుకుంటున్న హసీనా తాజాగా ఓ ఆంగ్ల పత్రిక ద్వారా బంగ్లాదేశ్ ప్రజలకు సందేశం విడుదల చేశారు. దేశం వీడే ముందు దీన్ని ప్రజలందరికీ చదివి విన్పించాలని భావించినా వీలు పడలేదన్నారు. కుట్రదారుల వలలో చిక్కుకోవద్దని బంగ్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలపై దాడులు, హత్యలు, వారి ఆస్తుల విధ్వంసంపై ఆవేదన వ్యక్తంచేశారు. భగవంతుడి దయతో త్వరలో బంగ్లాదేశ్ చేరుకుంటానన్నారు.

అమాయక విద్యార్థులను రెచ్చగొట్టారు

విద్యార్థులను రజాకార్లుగా తానెప్పుడూ సంబోధించలేదని హసీనా తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం వారిని రెచ్చగొట్టడానికి తన వ్యాఖ్యలను వక్రీకరించారని మండిపడ్డారు. అమెరికాపై హసీనా గతంలోనూ ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్‌లో వైమానిక స్థావరం ఏర్పాటుకు అనుమతిస్తే ఎన్నికల్లో ప్రధాని పదవి నిలబెట్టుకోవడానికి సహకరిస్తామంటూ ఓ దేశం ఆఫర్ ఇచ్చిందని గత మేలో ఆమె వెల్లడించారు.

చీఫ్ జస్టిస్‌గా రెఫాత్ అహ్మద్

ఢాకా: బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సయ్యద్ రెఫాత్ అహ్మద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విద్యార్థి నేతల డిమాండ్‌తో సీజే, ఐదుగురు న్యాయమూర్తులు శనివారం రాజీనామా చేయడం తెల్సిందే. దేశంలో అశాంతికి ఆజ్యం పోసే వదంతుల వ్యాప్తిపై యూనుస్ ప్రభుత్వం కన్నెర్రజేసింది. వాటిని ప్రచారం చేసే, ప్రచురించే మీడియా సంస్థలను మూసేస్తామని హెచ్చరించింది.

హసీనా ఎలాంటి ప్రకటనా చేయలేదు: కుమారుడు

హసీనా ఓ ఆంగ్ల పత్రిక ద్వారా విడుదల చేశారంటున్న ప్రకటన పూర్తిగా అవాస్తమని ఆమె కుమారుడు సాజీబ్ వాహెద్ జాయ్ చెప్పారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని మార్చేందుకు అమెరికా కుట్ర పన్నిందని ఆమె చెప్పినట్టుగా వచ్చిన ఆ కథనమంతా పూర్తిగా కట్టుకథ అని ఆరోపించారు. ''దీనిపై నా తల్లితో మాట్లాడాను. బంగ్లాను వీడే ముందు గానీ, వీడాక గానీ ఏ పత్రికకూ తాను అలాంటి ప్రకటన విడుదల చేయలేదని ఆమె స్పష్టం చేశారు'' అని తెలిపారు.



ఏమిటీ సెయింట్ మార్టిన్ ద్వీపం?

అమెరికాపై హసీనా ఆరోపణలతో సెయింట్ మార్టిన్ ద్వీపం ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. ఇది ఈశాన్య బంగాళాఖాతంలో బంగ్లాదేశ్‌కు చెందిన కాక్స్ బజార్-టెక్నాఫ్ ద్వీపకల్పానికి దక్షిణంది 9 కి.మీ. దూరంలో ఉంది. కేవలం 3 చదరపు కి.మీ. విస్తీర్ణముండే ఈ ద్వీపాన్ని బెంగాలీలో నారికేళ్ (కొబ్బరి) ద్వీపమంటారు. ఇందులో 3,700 మంది నివసిస్తున్నారు. చేపల వేట, వరి సాగు, కొబ్బరి తోటల పెంపకం వారి వృత్తి. ఈ ద్వీపం వ్యూహాత్మకంగా అతి కీలక ప్రాంతంలో ఉంది. చైనాతో వైరం దృష్ట్యా భావి అవసరాల దృష్ట్యా ఇక్కడ సైనిక స్థావరాన్ని ఏర్పాటుకు అమెరికా ప్రయత్నిస్తోంది.

వైద్యురాలి మృతికి నిరసనగా... నేటినుంచి వైద్యసేవలు బంద్

న్యూఢిల్లీ: కోల్‌కతాలో ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై రేప్, హత్యోదంతంపై వైద్యలోకం ఆందోళన ఉధృతం చేసింది. నిందితుడికి ఉరి శిక్ష విధించడంతోపాటు, ఆస్పత్రుల్లో మహిళా సిబ్బందికి రక్షణ కరువైన నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ జూనియర్ డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. నిరసనలను ఉధృతం చేస్తూ సోమవారం నుంచి దేశవ్యాప్తంగా కొన్ని రకాల వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఇండియా ఆదివారం ప్రకటించింది. అవసరమైతే ఆందోళనలు ఉధృతం చేస్తామంది.

గురువారం నాటి ఈ హత్యోదంతం శుక్రవారం వెలుగుచూసింది. దాంతో మొదలైన ఆందోళనలతో బెంగాల్ వ్యాప్తంగా ఆస్పత్రుల్లో వైద్యసేవలు స్తంభించాయి. డాక్టర్లు, సిబ్బంది విధులను బహిష్కరించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీలోనూ ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలో మరో వైద్యురాలిని బెదిరించిన పౌర వలంటీర్‌ను అరెస్ట్‌చేశారు. అతను పూటుగా తాగి శనివారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. తనకు వైద్యం త్వరగా చేయాలని వైద్యురాలిని గద్దించాడు. ''కోల్‌కతాలో ఏం జరిగిందో తెల్సుకదా? త్వరగా వైద్యం చేయకపోతే నీకు కూడా అదే గతి పడుతుంది'' అంటూ బెదిరించాడు. దాంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

అదానీ-సెబీ చైర్‌పర్సన్ ఉదంతంపై... జేపీసీతో దర్యాప్తు

విపక్షాల డిమాండ్
- సుమోటోగా స్వీకరించండి
- సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి
- మాధబీ బచ్ రాజీనామా చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో సెబీ చైర్‌పర్సన్ మాధబీ పురీ బచ్ పెట్టుబడుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గుతేల్చడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని ప్రతిపక్షాలు ఆదివారం డిమాండ్ చేశాయి. ''అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. దీనిపై మోదీ ప్రభుత్వం తక్షణం స్పందించాలి'' అన్నాయి. అదానీ గ్రూప్‌లో మాధబీ దంపతులు పెట్టుబడులు పెట్టినట్లు హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించడం తెలిసిందే. అదానీ గ్రూప్, సెబీ చైర్‌పర్సన్ బంధంపై కేంద్రం నోరు విప్పాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ ఉదంతాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించాలని సుప్రీంకోర్టును కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న సంపన్న మిత్రులను కాపాడుకొనేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధబీ పదవిలో కొనసాగడం అనైతికమన్నారు. ఆమె ఇంకా రాజీనామా ఎందుకు చేయలేదని రాహుల్ ప్రశ్నించారు. నియంత్రణ సంస్థ సమగ్రతను కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. సెబీ చైర్‌పర్సన్-అదానీ బంధం స్పష్టంగా కనిపిస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని సీతా రాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), జైరాం రమేశ్ (కాంగ్రెస్), మహువా మొయిత్రా (టీఎంసీ), సంజయ్ సింగ్ (ఆప్), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐ-ఎంఎల్) ఆరోపించారు. అదానీ గ్రూప్‌ను కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు.

విపక్షాల కుట్ర: బీజేపీ

దేశంలో ఆర్థిక అస్థిరత సృష్టించడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని బీజేపీ మండిపడింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలను కొట్టిపారేసింది. విదేశీ కుతంత్రాల్లో ప్రతిపక్షాలు భాగంగా మారాయని ధ్వజమెత్తింది.

నూతన వంగడాలను ఆవిష్కరించిన మోదీ

- కరువు, నీటి ఎద్దడిని తట్టుకుని అధిక దిగుబడి
- 109 రకాలు అందుబాటులోకి

వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రైతులు, శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న మోదీ



న్యూఢిల్లీ: కరువు కాటకాలను, నీటి ఎద్దడి పరిస్థితులను తట్టుకుంటూనే అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం ఆవిష్కరించారు. వీటిలో 61 పంటలకు సంబంధించిన 109 రకాల విత్తనాలున్నాయి. వీటిలో 34 ఆహార, వాణిజ్య పంటల వంగడాలు కాగా 27 ఉద్యాన పంటలకు చెందినవి. పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు, నూనె గింజలు, చెరకు, పత్తి, మొక్కజొన్న, పూలు, పండ్లు, కూరగాయలు, దినుసులు, ఔషధ గుణాల మొక్కల విత్తనాలు ఇలా పలురకాల నూతన వంగడాలను ఢిల్లీలోని పూసా క్యాంపస్‌లోని మూడు వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో ప్రధాని వీటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో మోదీ ముచ్చటించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) ఈ నూతన వంగడాలను అభివృద్ధిచేసింది. ఏటా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయానికి అదనపు విలువ జోడింపు ప్రస్తుతం తక్షణ అవసరమని ప్రధాని వ్యాఖ్యానించారు. కొత్త వంగడాల విశిష్టతపై అక్కడి రైతులతో కలిసి చర్చించారు. తక్కువ నిర్వహణ వ్యయం కారణంగా నూతన వంగడాలతో తమకు మరింత లబ్ధి చేకూరనుందని అక్కడి రైతులు చెప్పారు. '' తృణధాన్యాల గొప్పదనం, వాటిలోని పోషకవిలువ గురించి తెలిశాక ప్రజలు వాటి వినియోగానికి మొగ్గుచూపుతున్నారు. సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు. ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగింది. సేంద్రీయ ఆహారం కావాలని జనం అడిగి మరీ కొనుగోలుచేస్తున్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన వంగడాలపై దేశవ్యాప్తంగా కృషి విజ్ఞాన్ కేంద్రాలు రైతులకు అవగాహన పెంచాలి. కొత్త రకాలను సృష్టిస్తున్న శాస్త్రవేత్తలకు నా అభినందనలు'' అని మోదీ అన్నారు. సహజసిద్ధ సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పట్ల తమలో సానుకూలత పెరిగిందని, కృషి విజ్ఞాన్ కేంద్రాల పాత్ర ఇందులో కీలకమని రైతులు చెప్పారని ప్రభుత్వం తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వంగడాల్లో పోషక విలువలు మెండుగా ఉంటాయని తర్వాత ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

మా ఈ-మెయిళ్లు హ్యాకయ్యాయి

ట్రంప్ ప్రచార బృందం ఆరోపణలు



వాషింగ్టన్: తమ ఈమెయిళ్లు హ్యాకింగ్‌కు గురయ్యాయని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచార బృందం ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వెల్లడించిన మర్నాడే ట్రంప్ బృందం ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. ''మెయిళ్లలోని సున్నిత సమాచారాన్ని తస్కరించి బయట పెడుతున్నారు. అమెరికాకు ముప్పు వాటిల్లేలా విదేశీ శక్తులు పని చేస్తున్నాయి. ట్రంప్ గెలిస్తే తమ ఉగ్ర చర్యలను అడ్డుకుంటారని ఇరాన్‌కు బాగా తెలుసు'' అని ఆయన బృందం పేర్కొంది. ఎన్నికల్లో విదేశీ శక్తుల జోక్యం తీవ్రమైన అంశమని అమెరికా జాతీయ భద్రతా మండలి పేర్కొంది. ఇందులో తమ జోక్యముందన్న వార్తలను ఇరాన్ ఖండించింది.

బిహార్‌లో కూలిన మరో వంతెన

పట్నా: బిహార్‌లో మరో వంతెన కూలింది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్ బ్లాక్‌లోని 20 ఏళ్ల నాటి వంతెన శనివారం రాత్రి కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి ప్రాణహాని జరగలేదు. 2021లో భారీ వర్షాలతో వంతెనకు ముప్పు వాటిల్లడంతో అప్పట్నుంచీ దాన్ని మూసేశారు. ఇటీవలి కాలంలో బిహార్‌లో డజనుకు పైగా వంతెనలు, కాజ్‌వేలు కూలడం తెలిసిందే.

టిప్‌లపై పన్ను ఎత్తేస్తా: హారిస్



లాస్ వెగాస్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే దేశంలోని రెస్టారెంట్ల సిబ్బంది టిప్పులపై పన్నులను రద్దు చేస్తానని డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ హామీ ఇచ్చారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వినోద పరిశ్రమల పన్నులపైనే అధికంగా ఆధారపడే నెవెడా రాష్ట్రంలో ర్యాలీలో ఆమె ఈ మేరకు ప్రకటించారు. మాట్లాడారు. శ్రామికుల కనీస వేతనం పెంచుతానన్నారు. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ కూడా ఇదే హామీ ఇవ్వడం విశేషం. దాన్నే హారిస్ కాపీ కొట్టారంటూ ఆయన ఎద్దేవా చేశారు. తన ఐడియాలను దొంగిలించడం మినహా హారిస్‌కు ఇంకేమీ చేతకాదన్నారు.

ఈఫిల్ టవర్‌పైకి ఆగంతకుడు

పారిస్: ఒలింపిక్ క్రీడల ముగింపు ముంగిట్లో ఆదివారం ఓ వ్యక్తి పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌పైకి ఎక్కడం కలకలం రేపింది. 330 మీటర్ల ఎత్తున్న టవర్‌పై అతను రెండో సెక్షన్ వద్ద ఉండగా సిబ్బంది గమనించారు. దాంతో పర్యాటకులను ఖాళీ చేయించారు. అతన్ని కిందికి దించి అరెస్ట్ చేశారు. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో ఈఫిల్ టవర్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలకు మరో వేదికను నిర్ణయించడం తెలిసిందే. వీటికోసం 30 వేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

అవును, రష్యాపై దాడి చేశాం: జెలెన్‌స్కీ



కీవ్: రష్యాలోని సరిహద్దు ప్రాంతం కర్స్క్‌లో ఉక్రెయిన్ ఆకస్మిక సైనిక దాడులు చేసినట్టు అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిర్ధారించారు. తమ సైన్యం పోరాటాన్ని రష్యా భూభాగంలోకి తీసుకెళ్లిందన్నారు. కర్స్క్‌లో తమ దళాలు ముందుకు దూసుకెళుతున్నాయని చెప్పారు. ఈ యుద్ధంతో రష్యా గడ్డపై ఉక్రెయిన్ చేసిన అతిపెద్ద దాడి ఇది.

దాడిలో బాలుడు సహా ముగ్గురు మృతి

ఆదివారం రాత్రి కీవ్‌పై రష్యా డ్రోన్, క్షిపణి దాడుల్లో ఓ నాలుగేళ్ల బాలుడు, మరో ఇద్దరు మరణించారు. 53 డ్రోన్లను కూల్చేసినట్టు ఉక్రెయిన్ వెల్లడించింది. ఈ దాడిలో రష్యా వాడిన క్షిపణులు ఉత్తరకొరియావని జెలెన్‌స్కీ అన్నారు.



3,000 అడుగుల ఎత్తయిన విద్యుత్ భవనం!

అత్యంత ఎత్తయిన ఆకాశ హర్మ్యాల నిర్మాణం కొత్తేమీ కాదు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్, విల్లీస్ టవర్, దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా వంటివి ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందాయి. అయితే ఇవన్నీ నివాసాలు, కార్యాలయాలే. వాటిని తలదన్నేలా 3,000 అడుగుల (914.4 మీటర్లు) ఎత్తయిన భవనాన్ని నిర్మించనున్నట్టు స్కిడ్‌మోర్, ఒవింగ్స్ అండ్ మెరిల్ (ఎస్‌ఓఎం) కంపెనీ ప్రకటించింది. నివాసానికే గాక విద్యుత్ నిల్వకు కూడా వీలు కల్పించడం దీని ప్రత్యేకత. ఇందుకోసం విద్యుత్ స్టోరేజీ కంపెనీ 'ఎనర్జీ వాల్ట్'తో ఒప్పందం చేసుకుంది. విద్యుత్‌ను నిల్వచేసే బ్యాటరీలాగా ఇది పని చేస్తుందని కంపెనీ పేర్కొంది. భవనం వెలుపలి భాగంలో అమర్చే ఫలకాల్లో విద్యుత్‌ను నిల్వ చేస్తారు. దాన్ని అవసరమైనప్పుడు ఉపయోగించుకుంటారు. ఈ భవనాన్ని ఎక్కడ నిర్మించాలన్నది ఇంకా ఖరారు చేయలేదు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తరాదిన కుండపోత.. 28 మంది మృతి

న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు రెండు రోజులుగా వణికిస్తున్నాయి. ఇళ్లు కూలి, కొండచరియలు విరిగిపడి, జలాశయాలు పొంగిపొర్లిన ఘటనల్లో 28 మంది మృతి చెందారు. హరియాణాలో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. జమ్మూకశ్మీర్ యంత్రాంగం అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసింది. రాజస్తాన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 16 మంది చనిపోయారు. రాష్ట్రంలోని కరౌలీ జిల్లాలో రికార్డు స్థాయిలో 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఆదివారం వరదల్లో వాహనం కొట్టుకుపోయిన ఘటనలో ఒకే కుటుంబంలోని 8 మంది చనిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలో జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో నీరు నిల్చి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏడేళ్ల బాలుడు నీట మునిగి చనిపోయాడు. హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడి ముగ్గురు బాలికలు మృత్యువాత పడ్డారు.

వాగులో కొట్టుకుపోయిన కారు

- ఒకే కుటుంబానికి చెందిన 8 మంది, డ్రైవర్ దుర్మరణం
- హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో ఘటన



వాగులో కొట్టుకుపోతున్న కారు (సర్కిల్‌లో)

సిమ్లా: ఎగువన కురుస్తున్న వర్షాలకు ఉనా జిల్లాలోని జైజోన్ చో వాగు ఉప్పొంగడంతో ఎస్‌యూవీ వాహనం కొట్టుకుపోయి తొమ్మిది మంది మృతి చెందారు. ఇద్దరు గల్లంతయ్యారు. మృతుల్లో 8 మంది ఒకే కుటుంబానికి చెందినవారు కాగా, మరొకరు డ్రైవర్. ఉనా జిల్లాలోని డెహ్రా నుంచి పంజాబ్‌లోని ఎస్‌బీఎస్ నగర్ జిల్లా మెహ్రోవాల్ గ్రామానికి ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఎస్‌యూవీ వాహనంలో ఒకే కుటుంబానికి చెందిన 11 మంది, డ్రైవర్ ప్రయాణిస్తున్నారు. భారీ వర్షం కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న జైజోన్ చో నదిని దాటుతుండగా వారి వాహనం కొట్టుకుపోయింది. స్థానికులు దీపక్ భాటియా అనే వ్యక్తిని రక్షించి జైజోన్ లోని ప్రభుత్వ డిస్పెన్సరీకి తరలించారు. వాహనం వరద నీటిలో ఇరుక్కుపోయింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందం రంగంలోకి దిగింది. వాగు నుంచి ఐదుగురు మహిళలతో సహా తొమ్మిది మంది మృతదేహాలను వెలికితీసింది. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాటొద్దని స్థానికులు హెచ్చరించినా డ్రైవర్ పట్టించుకోలేదని పోలీసులు తెలిపారు. మృతులను సూర్జిత్ భాటియా, అతని భార్య పరమజీత్ కౌర్, సోదరుడు స్వరూప్ చంద్, మరదలు బిందర్, మెహత్‌పూర్‌లోని భటోలీకి చెందిన షినో, ఆమె కుమార్తెలు భావన, అను, కుమారుడు హర్షిత్, డ్రైవర్ బిందుగా గుర్తించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 12 । ఆగస్టు । 2024



వందేమాతరం

త్వరలో స్వాతంత్ర్య దినోత్సవం జరగనుంది. బెంగళూరులో సందడి ఆరంభమైంది. ఆదివారం విధానసౌధ ముందు త్రివర్ణ పతాకాలను కొంటున్న యువత

గేటు జారి గల్లంతు

తుంగభద్ర డ్యాం చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా గేటు కొట్టుకుపోవడం రైతులు, ప్రజల మనసులను కలచివేసింది. ఏడు దశాబ్దాలుగా తుంగభద్ర డ్యాం ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయింది. డ్యాం కళకళలాడితే తమ బతుకులు సాఫీగా సాగిపోతాయన్న నమ్మకం ప్రజలది. కానీ ఆ నమ్మకం వమ్ము అవుతూ గేటు కొట్టుకుపోవడం అధికారులు, సర్కారు వైఫల్యమా? అనే ప్రశ్న వినిపిస్తోంది. తక్షణం జలాశయాన్ని, గేట్లను పటిష్టం చేసి ప్రజలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

- ప్రశ్నార్థకంగా తుంగభద్ర ఆయకట్టు రైతుల పరిస్థితి
- ఈ ఏడాది ఊపిరి పీల్చుకునేలోగా ఉపద్రవం



గేటు ఊడిపోయింది ఇక్కడే



మొత్తం గేట్లను ఎత్తివేయడంతో నీరంతా వెళ్లిపోతోంది

సాక్షి, బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగు నీరందిస్తూ జీవనాడిగా విరాజిల్లుతున్న తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో రైతులు, ప్రజానీకం తీవ్ర ఆందోళనకు లోనైంది. గత ఏడాది తీవ్ర కరువు ఏర్పడి, ఖరీఫ్ సీజన్‌లో ఒక్క పంట పడించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. గత ఏడాది 70 టీఎంసీలకు మించి నీరు చేరకపోవడంతో పంటలకు నీళ్లు దక్కక బాధపడ్డారు.

డ్యాం నిండింది అనుకుంటే..

కానీ ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి మలేనాడులో, తుంగభద్ర ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో ప్రవాహం పెరిగింది. నది నిండుగా ప్రవహిస్తూ హొసపేటె తుంగభద్ర డ్యామ్‌ను పూర్తిగా నింపింది. గత నెల మధ్యలోనే డ్యాం నిండి పెద్దమొత్తంలో నీటిని వదలడంతో రైతులు, ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ ఏడాది కరువు కాటు తప్పినట్టేనని సంబరపడ్డారు. 15 రోజులు నుంచి గేట్ల ద్వారా లక్షలాది క్యూసెక్కుల నీటిని నదికి వదలడంతో ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లో డ్యాములు కళ సంతరించుకున్నాయి. మూడు రాష్ట్రాల్లో నది కిందనున్న రైతులు వరినాట్లు, మిర్చి, పత్తి, తదితర పంటల సాగు చేపట్టారు.

సగం నీరు వృథానే

కానీ దేవుడు వరమిచ్చినా... అన్న సామెత చందంగా డ్యాం 19వ గేటు శనివారం రాత్రి నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. డ్యాం చరిత్రలో ఇలా ఎన్నడూ జరిగింది లేదు. డ్యాం మిగతా గేట్ల భద్రత ప్రశ్నార్థకమైంది. విషయం తెలిసి అధికారులు, నాయకులు డ్యాం వద్దకు పరుగులు తీశారు. ఖరీఫ్‌లో రైతులకు పూర్తి స్థాయిలో నీరు అందాలంటే 70 టీఎంసీలకుపైగా నీటి అవసరం ఉంటుంది. ప్రస్తుత ఉపద్రవం వల్ల డ్యాంలో నీటిని 40 లేదా 50 టీఎంసీలు మాత్రమే ఉంచి మిగతా నీటిని నదిలోకి వదిలేస్తున్నట్లు తెలిపారు. నీరు తగ్గిన తరువాత గేటు అమర్చే పనులు మొదలు పెడతారు. ఇందుకు 10 రోజులు పట్టవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు. ఒక్కో గేటు 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో కూడిన బృహత్ విస్తీర్ణంతో ఉంటుంది. అంత భారీ గేటు నదిలోకి కలిసిపోయింది. దీంతో అధికారులు ముందు జాగ్రత్తగా అన్ని గేట్లను ఎత్తివేసి నదిని వదులుతున్నారు. ఇప్పటివరకు ఉన్న నీరు మొత్తం వృథా అయినట్లే.



టీబీ భద్రతపై సందేహాల గుబులు

1953లో డ్యాం పూర్తి

దక్షిణ భారత దేశంలోనే తుంగభద్ర డ్యామ్‌కు ఘనమైన చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం రాక పూర్వమే బ్రిటిష్ పాలకులు జలాశయం నిర్మాణానికి పరిశీలన చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉమ్మడి మద్రాసు ప్రభుత్వంలో 1953లో డ్యామ్‌ను సాకారం నదిని ప్రజలకు అందించారు. డ్యాం నిర్మాణ పనులను 1952 సెప్టెంబరు 29వ తేదీన అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా హొసపేటెకు వచ్చి పరిశీలించారు. 70 ఏళ్ల నుంచి మూడు రాష్ట్రాలకు టీబీ డ్యాం తాగు, సాగు నీటిని అందిస్తూ ఆదుకుంటోంది. డ్యాం నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయలను కేటాయిస్తోంది. ఉన్నతాధికారులతో ఒక బోర్డు కూడా ఉంది. ఇక డ్యాం దిగువన నదిని ఆనుకుని ప్రపంచ పర్యాటక కేంద్రంగా హంపి నెలకొని ఉంది.



డ్యాం నిర్మాణాన్ని పరిశీలించిన నెహ్రూ (ఫైల్)

అపార నష్టం జరిగింది

- డిప్యూటీ సీఎం ఆవేదన

హొసపేటె: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు శివరాజ్ తంగడగి, బోసురాజు, నీటి పారుదల అధికారులతో కలిసి డ్యాంను పరిశీలించారు. ప్రవాహాన్ని తగ్గించి వెంటనే మరమ్మతులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. మరమ్మతులకు ప్రముఖ నిపుణులు కన్నాయ్ నాయుడు, నారాయణ సహా జిందాల్ ఇంజనీర్లను రప్పించడం జరిగిందని డీకే తెలిపారు. అపారమైన నీరు వృథా కావడంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర రైతులకు నష్టం వాటిల్లిందని ఆవేదన వెలిబుచ్చారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు వచ్చి మళ్లీ డ్యాంలో నీరు వచ్చి చేరే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య 13న డ్యాంను సందర్శిస్తారని చెప్పారు.

పంటలపై రైతన్నల దిగులు



డ్యాం కింద వరినాట్లు

ఈ నేపథ్యంలో రైతులకు ఖరీఫ్ పంట చేతికి అందుతుందా అన్నదానిపై అనుమానంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆయకట్టు రైతులు సగానికి పైగా వరినాట్లు పూర్తి చేశారు. గేటు అమర్చిన తర్వాత డ్యాంలోకి మళ్లీ ఇన్‌ఫ్లో వస్తే కానీ ఖరీఫ్ పంట, ఆపై రబీకి నీళ్లు ఇచ్చేది లేనిది స్పష్టత వస్తుంది. ఈ సంఘటనతో రైతుల ఆశలు అడియాయలు అయ్యాయి.

న్యూస్‌రీల్

ఏపీఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు

బాగేపల్లి: బాగేపల్లి సమీపంలో బెంగళూరు రహదారిలో చెండూరు క్రాస్ వద్ద ఏపీఎస్ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 13 మందికి పైగా ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగింది. బెంగళూరు నుంచి పుట్టపర్తి వైపుగా వెళుతున్న ఆర్టీసీ బస్సు గుడిబండె తాలూకా చెండూరు క్రాస్ వద్ద డ్రైవర్ నియంత్రణ తప్పడంతో వేగంగా వెళ్లి పల్టీలు కొట్టింది. ఆ సమయంలో బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఇందులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 13 మంది గాయపడ్డారు. బాధితులను చిక్కబళ్లాపుర జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరికొందరిని బాగేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. కొందరికి చిన్న చిన్న గాయాలు తగిలినా వేరే బస్సుల్లో వెళ్లిపోయారు. గుడిబండె పోలీసులు కేసు నమోదు చేశారు.

కారుపై పడిన కంటైనర్

- ఐదుమంది సురక్షితం



నుజ్జునుజ్జయిన కారు

యశవంతపుర: అనూహ్య ప్రమాదంలో ఐదు మంది క్షేమంగా బయటపడ్డారు. కారుపై కంటైనర్ పడిన ఘటన హైవే-75లో దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడిలో జరిగింది. దావణగెరెకి చెందిన ఐదుమంది కారులో వెళుతుండగా ఒకరికి వాంతి వచ్చింది. అతనితో పాటు అందరూ కారు దిగి రోడ్డు పక్కన ఉన్న సమయంలో కంటైనర్ లారీ వేగంగా వచ్చి కారు మీద పడిపోయింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. అయితే వాంతి రావటం వల్ల అందరూ కిందకు దిగడంతో ప్రాణాలతో బతికిపోయారు. డ్రైవర్, ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు కలిసి ధర్మస్థళం మంజునాథస్వామిని, కుక్కే సుబ్రమణ్యం స్వామిని దర్శించుకొని తిరిగి దావణగెరెకి వెళుతున్నారు. శనివారం ఉదయం 11:30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. కంటైనర్ బరువుకు కారు అప్పచ్చి అయిపోయింది. దేవుని దయ వల్లనే బతికి బట్టకట్టామని కారులోని వారు ఆనందం వ్యక్తంచేశారు.

సైబర్ ముఠా గుట్టురట్టు

- లండన్ నుంచి మోసాలు
- 50 బ్యాంకు ఖాతాలు సీజ్



బనశంకరి: ఇటీవల బెంగళూరుకు చెందిన టెక్కీ దంపతులకు సైబర్ కేటుగాళ్లు రూ.1.53 కోట్లు మోసగించారు. తూర్పు వలయ సైబర్‌క్రైం పోలీసులు దర్యాప్తు చేసి మోసగాళ్ల ఆచూకీ కనిపెట్టారు. 50 బ్యాంకు ఖాతాలను సీజ్ చేసి రూ.1.4 కోట్లను జప్తు చేశారు. బాణసవాడిలో నివాసం ఉంటున్న టెక్కీ దంపతులకు బ్యాంక్ అధికారులతో కలిసి వంచనకు వలవేశారు. అసలు సూత్రధారి బ్రిటన్‌లో ఉంటూ, ఉత్తర భారత దేశానికి చెందిన కొంతమంది బ్యాంకు అకౌంట్లను గుప్పిట్లో తీసుకున్నాడు. వసూలు చేసిన నగదును ఆ ఖాతాల్లోకి మళ్లించేవాడు. టెక్కీ దంపతులతో షేర్ల ట్రేడింగ్ అని కోటిన్నర దాకా పెట్టుబడి పెట్టించాడు. పెద్దమొత్తంలో లాభం చూపడంతో వారు సంతోషించారు. కొద్దినెలల తరువాత నగదు వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో పాటు వారి యాప్ కూడా పనిచేయలేదు. పోలీసులు బ్యాంక్ అధికారులతో చర్చించి వంచక ముఠాను వివరాలను రాబట్టారు. ఈ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న 50 కి పైగా అకౌంట్లను బ్లాక్ చేశారు. సూత్రధారి లండన్‌లో కూర్చుని వంచనకు పాల్పడినట్లు సమాచారం అందింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ. కోటికిపైగా నగదును బాధిత దంపతులకు అందజేశారు.

వధువు ఫ్రం.. బ్రెజిల్



ఆదిత్య, తాత్యానా జంట

యశవంతపుర: మంగళూరు నగర కరంగల్పాడికి చెందిన ఆదిత్య, బ్రెజిల్‌కు చెందిన తాత్యానా ఒక్కటయ్యారు. ఆదిత్య 8 ఏళ్ల క్రితం ఐటీ ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాడు. అక్కడే పనిచేసే తాత్యానాతో పరిచయమై ప్రేమ మొదలైంది. మతం, జాతి వేరైనా వీరి పెళ్లికి ఇరు కుటుంబాలవారు ఒప్పుకోవడంతో హిందూ సంప్రదాయం ప్రకారం మంగళూరులో ఓ ఫంక్షన్‌హాల్‌లో వైభవంగా పెళ్లి జరిగింది.

బీదర్ జిల్లాలో భూప్రకంపనలు

శివాజీనగర: బీదర్ జిల్లాలో భూ ప్రకంపనలు వచ్చాయి. కొన్ని సెకన్లు భూమి కంపించగా, బెంగళూరు యలహంకలో ఉన్న కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిఘా కేంద్రంలో నమోదైంది. ఆ జిల్లాలోని హుమనాబాద్ తాలూకా సీతలగేరాను కేంద్రంగా ప్రకంపనలు వచ్చాయి, రిక్టర్ స్కేలుపై 2.6 పాయింట్లుగా నమోదైంది. ఎక్కడా అపాయం సంభవించలేదు. అయితే భూకంపం అనుభవంతో కొన్ని గ్రామాల్లో ప్రజలు భయాందోళనతో ఇళ్ల నుంచి బయటికి వచ్చారు. కొన్ని క్షణాల పాటు ప్రకంపనలు వచ్చాయి. గత సంవత్సరం నవంబర్, ఈ మార్చి నెలలో కూడా భూకంపనాలను జిల్లా ప్రజలు అనుభవించారు. ఇది తక్కువ స్థాయి కంపనం. ప్రజలు ఆందోళన పడాల్సిన పని లేదు అని నిపుణులు తెలిపారు. కొన్నేళ్లుగా ఉత్తర కర్ణాటకలో తరచుగా స్వల్ప స్థాయి ప్రకంపనలు వస్తున్నాయి.

బీఎంటీసీ డ్రైవర్ దుర్మరణం

కోలారు: రోడ్డు ప్రమాదంలో బెంగళూరు సిటీ బస్ డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన ముళబాగిలు తాలూకా కప్పల మడుగు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పెత్తాండ్లహళ్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ (40) బీఎంటీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ముళబాగిలులో జరిగిన బంధువుల పెళ్లికి హాజరై తిరిగి గ్రామానికి బైక్ మీద వెళుతున్నాడు. ఇంతలో కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డాడు. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కేఆర్‌ఎస్ డ్యాంను భద్రం చేయాలి

- కేంద్రమంత్రి కుమారస్వామి సూచన



వరినాట్లు వేస్తున్న కుమారస్వామి

మండ్య: తుంగభద్రా జలాశయం గేటు తెగిపోయినందున, మండ్య కేఆర్‌ఎస్ డ్యాం భద్రతపై దృష్టి సారించాలని, అలాంటి దుస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సర్కారుకు సూచించారు. ఆదివారం పాండవపుర తాలూకా అరళకుప్పే గ్రామంలో రైతులతో కలిసి వరినాట్లు వేసి, మొక్కలు నాటారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నారాయణపుర, ఆలమట్టి జలాశయాల్లో స్టాప్‌లాక్‌లను అమర్చినట్లు, తుంగభద్ర డ్యాంలో ఇవి లేవని, అందుకే గేటు తెగినా నీటిని నిలిపి ఉంచడం వీలు పడడం లేదని తెలిపారు. కేఆర్‌ఎస్ ఆనకట్టకు కూడా స్టాప్ లాక్ గేట్లు అమర్చలేదన్నారు. అప్పట్లో ఆ సదుపాయం ఉండేది కాదన్నారు. కేఆర్‌ఎస్‌కు ఇలాంటి ప్రమాదం రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. తుంగభద్ర డ్యాం 70 ఏళ్ల క్రితం నిర్మించినదని, గతంలో అనేక సమస్యలు వచ్చాయని చెప్పారు.

ఎవరు పిచ్చాసుపత్రికి వెళతారు

తరువాత పాండవపుర తాలూకా సీతాపుర గ్రామంలో కావేరి నదికి ఆయన వాయినం సమర్పించారు. పిచ్చాస్పత్రికి ఎవరు వెళతారు? జైలుకు ఎవరు వెళతారు అనేది చూద్దాం అంటూ డీసీఎం డీకే శివకుమార్‌ను హెచ్చరించారు. తాను పిచ్చాస్పత్రికి వెళ్లినా అక్కడ చికిత్స దొరుకుతుందని, అయితే ఆయన వెళ్లే జైలులో అది కూడా ఉండదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఖజానాను ఈ కాంగ్రెస్ సర్కార్ లూటీ చేస్తోందని మండిపడ్డారు.



పెయింటింగ్స్‌ను వీక్షిస్తున్న సందర్శకులు



చిత్ర వైభవం

బనశంకరి: నగరంలో చిత్రలేఖనాల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వసంత ఆర్ట్స్ గ్రూప్ పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో ఏ సింబల్ ఆఫ్ కలర్స్ పేరుతో బసవనగుడి బీపీ.వడియార్‌రోడ్డు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కల్చర్‌లో ఆరంభమైంది. ఏపీ, కర్ణాటక, తెలంగాణ, న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన చిత్రకారుల పెయింటింగ్స్ ఇక్కడ కొలువయ్యాయి. ప్రకృతి పర్యావరణం, భారతీయ కళలు, దేవతలు, సమాజంలో మహిళల సవాళ్లు తదితరాల మీద గీసిన చిత్రలేఖనాలు ఆకట్టుకుంటాయి. ఈ ప్రదర్శన 13వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు మాల్యాద్రి తెలిపారు.

నేటి నుంచి పీజీ వైద్యుల సమ్మె

శివాజీనగర: నేడు సోమవారం బెంగళూరుతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీడీ, నాన్ ఎమర్జెన్సీ సేవలు బంద్ అయ్యే అవకాశముంది. స్టైఫండ్ పెంపు కోరుతూ రెసిడెంట్ (పీజీ) డాక్టర్లు సమ్మె చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఫ్రీడం పార్కులో ధర్నా జరగనుంది. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ధర్నా కొనసాగుతుందని 6 వేల మంది రెసిడెంట్లు హెచ్చరించారు. బెంగళూరులోని విక్టోరియా, బౌరింగ్‌తో పాటుగా అన్ని ప్రభుత్వ వైద్యవిద్యా ఆసుపత్రుల్లో సమ్మె వల్ల సేవలకు అంతరాయం కలగవచ్చు. ఇన్ పేషెంట్, అత్యవసర సేవలు అందుబాటులో ఉండే అవకాశముంది.

ప్రస్తుతం స్టైఫండ్ ఎంత?

ప్రస్తుతం ఫస్టియర్ పీజీ వైద్యులు నెలకు రూ. 45 వేలు, రెండవ ఏడాది పీజీలు రూ. 50 వేలు, తదుపరి ఏడాదివారు రూ. 55 వేలు స్టైఫండ్ పొందుతున్నారు. ఇది చాలదని, పెంచాలని డిమాండ్ చేశారు.

అది మేక మాంసమే

శివాజీనగర: రాజస్తాన్ నుంచి బెంగళూరు శివాజీనగర వ్యాపారులు తెప్పించిన మేక మాంసంలో కుక్క మాంసం కలిపారని పునీత్ కెరెహళ్ళి తో పాటుగా పలువురు ఆరోపించి గొడవ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు మాంసం నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. అది గొర్రె/ మేక మాంసమే అని ఆహార శాఖ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ ల్యాబ్ రిపోర్ట్‌లో కూడా ఇది రుజువైందని తెలిపారు. జూలై 6న సంగొళ్ళి రాయణ్ణ రైల్వే స్టేషన్‌లో 86 మాంసం పెట్టెలు రాజస్థాన్ నుండి రైలులో వచ్చాయి. అప్పుడు కొన్ని సంఘాల కార్యకర్తలు అడ్డగించి గొడవ చేశారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్, రాజస్థాన్‌తో పాటుగా పలు చోట్ల నుండి నగరానికి మాంసం దిగుమతి అవుతుందని, నాణ్యతను ఎప్పుడూ పరీక్షిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

లాల్‌బాగ్ జనజాతర

- పుష్ప వేడుక చూసి అబ్బురం

బనశంకరి: సిలికాన్ సిటీలో పుష్ప రూపాలు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో ఏర్పాటైన ఫల పుష్ప ప్రదర్శన నాలుగవ రోజైన ఆదివారం జన జాతరను తలపించింది. పిల్లలు పెద్దలతో ప్రదర్శన పోటెత్తింది. డా. అంబేడ్కర్ థీమ్, పార్లమెంటు పుష్ప ఆకృతులు, పుష్ప నెమలి, తోరణాలు సహా అనేక కళారూపాలు చూసి ముగ్ధులయ్యారు. మొబైల్స్, కెమెరాల్లో బంధించి సంబరపడ్డారు. శనివారం 50 వేలమందికి పైగా సందర్శించగా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.21.50 లక్షలు వసూలైనట్లు రాష్ట్ర ఉద్యానవనశాఖ జేడీ ఎం.జగదీశ్ తెలిపారు. మొదటిరోజు 21 వేల మంది వచ్చారు. ఇక కొండ ప్రాంతం జనసమ్మర్థంగా మారింది.



పూలు, పండ్ల అలంకార ప్రదర్శన



ఆదివారం లాల్‌బాగ్ ఫ్లవర్ షోలో జన సందోహం



లాల్‌బాగ్ కొండపై సేద తీరుతున్న సందర్శకులు

క్లుప్తంగా

దర్శకుడు, నటి మూడుముళ్లు



తరుణ్, సోనల్ జంట

యశవంతపుర: ప్రముఖ దర్శకుడు తరుణ్ సు. దీర్, నటి సోనల్ వివాహం ఆదివారం బెంగళూరు పూర్ణిమ ప్యాలెస్‌లో జరిగింది. సిని ప్రముఖలతో పాటు ఇరువైపుల కుటుంబసభ్యుల సమీక్షంలో జంట ఒక్కటయ్యారు. కెంగేరి సమీపంలోని పూర్ణిమా ప్యాలెస్‌లో ఆదివారం ఉదయం 10:50 గంటలకు హిందు సంప్రదాయం ప్రకారం మంగళవాద్యలు, మంత్ర ఘోషణల మధ్య తరుణ్ సోనల్‌కు తాళి కట్టాడు.

పనులు చేసేవారికి మద్దతు ఇవ్వండి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవికుమార్

మండ్య: గత లోకసభ ఎన్నికల్లో తమ పార్టీకి మద్దతు ఇవ్వకపోయినా తాను ప్రజల హితం కోసం పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే పి.రవికుమార్ తెలిపారు. కథలు చెప్పుకుంటూ తిరిగే వారికి మద్దతిస్తే సరిపోదని, పనులు చేసేవారికి మద్దతు పలకాలని ఆయన స్పష్టం చేశారు. మండ్య తాలూకా బసరాళు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి జనతా దర్శన్ నిర్వహించారు.

వెట్టి నుంచి రెండు కుటుంబాలకు విముక్తి

మండ్య: అధికారుల చొరవతో రెండు కుటుంబాలకు వెట్టి నుంచి విముక్తి లభించింది. మండ్య జిల్లా మద్దూరు తాలూకా కోణసాలె గ్రామంలో నాగరాజు కుమారుడు మురళి అనే వ్యక్తి పందుల పెంపకం చేపట్టాడు. విజయపుర జిల్లా, బసవనబాగేవాడి తాలూకా గొల్లర ఉక్కలి గ్రామానికి చెందిన రమేశ్ (27), శ్వేత (25) దంపతులు కోణసాలే గ్రామానికి చెందిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వెంకటేశ్ (24),గీతా (20) దంపతులు మురళికి చెందిన పందుల పెంపకంలో పని చేస్తున్నారు. ఐదేళ్లుగా ఈ రెండు కుటుంబాలను బయటకు వదలకుండా పనులు చేయించేవారు. రెండు కుటుంబాల్లో మొత్తం నలుగురు పిల్లలు ఉన్నారు. అంతేకాకుండా యజమాని మురళి ఆ పేద కుటుంబాలకు జీతం సరిగ్గా ఇవ్వకుండా వెట్టి చేయించుకునే వారు. ఈ విషయం జీవ విముక్తి సంఘం సభ్యుల ద్వారా అధికారులకు తెలిసింది. తహసీల్దార్, పోలీసులు అధికారులు, ఉపవిభాగాధికారి దాడి చేసి ఈ రెండు కుటుంబాలను రక్షించారు. అనంతరం వీరిని మండ్య తాలూకా యత్తగదహళ్లి జ్ఞానసింధ వృద్ధాశ్రమానికి తరలించారు. వారానికి ఒకరోజు మాత్రమే ఆ పేద కుటుంబాల్లోని మగవారిని పొలం నుంచి ధాన్యం, నిత్యావసర సరుకుల కొనుగోలుకు పంపించేవారు. కోణసాలె వెంకటేశ్‌కు రూ.లక్ష ఇచ్చి వడ్డీతో కలుపుకుని రూ.3 లక్షల ఇవ్వాలని యజమాని మురళి ఒత్తిడి చేసేవారు. భార్య, భర్తలిద్దరికి నెలకు రూ. 15 వేలు ఇచ్చేవారు. పనులు చేయకుంటే అసభ్య పదజాలంతో దూషించేవారు. దాడి చేసేవారు. నిందితుడు మురళిపై కేసు నమోదు చేశారు. మద్దూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్‌భవన్ వీక్షణకు అవకాశం కల్పించండి

బనశంకరి: చారిత్రక కట్టడమైన రాజ్‌భవన్ వీక్షణకు ప్రజలకు అవకాశం కల్పించాలని జయప్రకాష్‌నారాయణ్ విచారవేదిక అధ్యక్షుడు శివకుమార్ శాసనమండలి దరఖాస్తు కమిటీకి విన్నవించారు. రాజ్‌భవన్ మైసూరు ప్యాలెస్‌కు ముందే నిర్మించారని, రాజులపాలన ముగిసి ప్రజాప్రభుత్వ వ్యవస్థ అమల్లోకి వచ్చిన అనంతరం ప్యాలెస్ పర్యాటక ప్రాంతంగా, రాజ్ భవన్ గవర్నర్ అధికారిక నివాసంగా మారిపోయిందన్నారు. రాజ్‌భవన్‌ను ప్రజల వీక్షణకు అవకాశం కల్పించాలని కోరారు.

నేటి తరాలకు ఆదర్శం సూలగిత్తి నరసమ్మ



సూలగిత్తి నరసమ్మ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: వైద్య సౌకర్యాలులేని కాలంలో వేలాది మందికి ప్రసవాలు చేసి తల్లి, పిల్లలకు కొత్త జన్మనిచ్చిన పద్మశ్రీ డాక్టర్ సూలగిత్తి నరసమ్మ నేటి తరాలకు ఎంతో ఆదర్శమని శ్రీశ్రీ మాదార చెన్నయ్య స్వామిజీ కొనియాడారు. నగరంలోని టౌన్‌హాల్‌లో నరసమ్మ ఉద్యానవనంలో ఆమె 104వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెన్నయ్య స్వామిజీ మాట్లాడుతూ ఎలాంటి ప్రచారం ఆశించకుండా సమాజ సేవను నరసమ్మ చేశారని కొనియాడారు. అవార్డులను సిఫారసుల ద్వారా పొందుతున్న నేటి కాలంలో ఎలాంటి సిఫారసులు లేకుండానే తన సమాజా సేవ ద్వారా ప్రజల్లో ఎంతో కీర్తి గడించారని గుర్తు చేశారు.

నిర్వహణ లోపంతోనే
క్రస్ట్ గేట్ తెగిందా ?

- 70 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటి సారిగా ఊడిన డ్యాం క్రస్ట్ గేటు



రైతుల కలలు కల్లలు

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పలు జిల్లాల ప్రజలు, రైతులకు తాగు, సాగుకు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర క్రస్ట్‌గేట్లలో 19వ గేట్ తెగిపోవడంతో రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో మిగతా గేట్లపై నీటి ఒత్తిడి పెరగకుండా 33 గేట్లను పైకెత్తి లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. డ్యామ్ పూర్తిగా నిండి రెండు పంటలకు సరిపడ నీరు ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. తాజా పరిస్థితులతో ఒక్క పంటకు కూడా నీరు అందక ఇబ్బందులు పడే పరిస్తితి నెలకొంది.

గేట్ తీసే సమయంలో జాగ్రత్తలు పాటించలేదా ? :

డ్యామ్ ఇన్‌ఫ్లో తగ్గడంతో రాత్రి డ్యామ్ గేట్లు మూసివేసేందుకు ప్రయత్నించారు. దీంతో 19వ గేటు చైన్ తెగింది. దీంతో అధికారులు ఆందోళన చెందారు. గేటు తీసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. 70 ఏళ్ల క్రితం నిర్మించిన డ్యామ్ చైన్‌లింక్ నిర్వహణ సరిగా లేక తెగిపోయింది. ఈసారి వర్షాలు బాగా కురవడంతో జలాశయం పొంగిపొర్లుతోంది. మరమ్మతులు చేయాలంటే రిజర్వాయర్‌లో 60 టీఎంసీల నీటిని బయటకు వదలాల్సి ఉంటుందని డ్యామ్ కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, సూపరిన్‌టెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి 60 టీఎంసీల నీరు బయటకు పంపిన తర్వాత గేటుకు సంబంధించిన పూర్తి పునరుద్ధరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. మరో వైపు ఆదివారం ఉదయం డ్యామ్‌ను కర్ణాటక మంత్రి శివరాజ్, తంగడిగ, ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే గవియప్ప సందర్శించారు. తెలంగాణ, చెన్నై నుంచి ఇంజనీర్ల నిపుణులు కూడా పిలిపిస్తున్నారు. ఇక డ్యామ్ నుంచి నీటిని పెద్ద ఎత్తున విడుదల చేస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

బీజేపీలో పతాకస్థాయికి చేరిన అసమ్మతి

- మైసూరు ఛలోకు దీటుగా బళ్లారి పాదయాత్రకు ఫిక్స్?
- సెప్టెంబర్17న పాదయాత్ర చేపట్టాలని నిర్ణయం
- బీవై విజయేంద్రకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు భేటీ



బెళగావిలో భేటీ అయిన బీజేపీ అసమ్మతి నాయకులు

సాక్షి,బళ్లారి: వాల్మీకి నిగమ మండలిలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు, ముడాలో జరిగిన అవినీతి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను సీఎం కుర్చీ నుంచి దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ఎలాగైన ఇరుకున పెట్టాలని, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై విజయేంద్ర నేతృత్వంలో బెంగళూరు మైసూరుకు ఛలో పాదయాత్ర చేపట్టి పూర్తి చేసిన నేపథ్యంలో బీజేపీలో అసమ్మతి నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం బెళగావికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు రమేష్ జారికిహోళి నేతృత్వంలో పలువురు అసమ్మతి బీజేపీ ఎమ్మెల్యేలు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించడం కలకలం రేపింది. ఈ సమావేశంలో ఛలో మైసూరుకు దీటుగా బెళగావి నుంచి ఛలో బళ్లారి పాదయాత్ర చేపట్టేందుకు నేతలు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. బెళగావి నుంచి బళ్లారికి పాదయాత్ర చేపట్టేందుకు అసమ్మతి నేతలు బెళగావి జాంబోటి రోడ్డులో ఉండే రిసార్ట్‌లో రమేష్ జారికిహోళి, అరవింద లింబావళి, ప్రతాప్ సింహా, అణ్ణాసాహేబ్ జొల్లే, కుమార బంగారప్ప, జీఎం,సిద్దేశ్‌తో పాటు పలువురు ప్రముఖ బీజేపీ నాయకులు పాల్గొని యడియూరప్ప, ఆయన తనయుడు బీ.వై. విజయేంద్రకు వ్యతిరేకంగా చర్చలు జరిపి, పాదయాత్ర చేపట్టి తమ సత్తా చాటాలని చూస్తున్నారు.సెప్టంబర్ 17న పాదయాత్ర ప్రారంభించాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని తమను పక్కన పెట్టినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి, ప్రతిపక్ష నాయకుడు అశోక్‌కు తగిన గుణపాఠం చెప్పాలనే ఆలోచనలో అసమ్మతి నేతలు గ్రూపుగా మారడంతో రాష్ట్ర బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. బీజేపీలో అసమ్మతి భగ్గుమనడంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు అవకాశాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉంది.

హత్యకేసు నిందితుడిపై పోలీసు తూటా



కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న నిందితుడు ముత్తురాజు, ముత్తురాజు(ఫైల్)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మండ్య: హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చే చేశారు. హలగూరు సమీపంలోని దేవిరహళ్లి గేట్ వద్ద ఇటీవల కాంతరాజు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. హలగూరు సీఐ బీఎస్ శ్రీదర్ .. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మళవల్లి తాలూకా హలగూరు సమీపంలోని బాళెహొన్నిగ గ్రామానికి చెందిన ముత్తరాజు అలియాస్ డక్క సూచనల మేరకే హత్య చేసినట్లు ఆ ఇద్దరు అంగీకరించారు. దీంతో ముత్తురాజు కోసం ప్రత్యేక బృందాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. నిందితుడు ఆదివారం ఉదయం మండ్య నుంచి మళవల్లి వైపు వెళుతున్నాడనే కచ్చితమైన సమాచారంతో పోలీసులు కాపుగాచారు. చిక్కములగూడు, హనియంబాడి మధ్య బైక్‌లో వెళ్తున్న ముత్తురాజును అడ్డుకున్నారు. నిందితుడు బైక్‌ను పొలాల్లోకి మళ్లించి చిన్న రోడ్డులోకి ప్రవేశించాడు. పోలీసులు వెంబడించి అతన్ని చుట్టుముట్టారు. ఈ సమయంలో ముత్తురాజు మారణాయుధాలతో పోలీసులపై దాడికి యత్నించాడు. ఆత్మరక్షణ కోసం సీఐ శ్రీధర్ తన రివల్వార్‌తో కాల్పులు జరపగా ఒక బుల్లెట్ ముత్తురాజు కాలిలో దూసుకెళ్లింది. కుప్పకూలిన అతన్ని మండ్య జిల్లాస్పత్రికి తరలించారు. నిందితుడిపై హలగూరు, కిరుగావలు, హొరోహళ్లి, మండ్య తూర్పు పోలీసు స్టేషన్లలో 11 హత్య కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.



బంగ్లాదేశ్‌లో హిందువులపై అల్లరి మూకల దాడులను నిరసిస్తూ ఆదివారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో హిందూ సంఘాల ఆందోళన. హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు

హైవేలో నిర్మాణ పనుల ఆటంకం

- బెంగళూరు– క్రిష్ణగిరి రహదారిలో ఫ్లై ఓవర్ల నిర్మాణాలు
- పూర్తి కాక.. వాహనదారులకు ఇబ్బందులు



జాతీయ రహదారి

హోసూరు: బెంగళూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఐదు చోట్ల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి, ఇవి పూర్తయితే వాహనాలు మరింత సులభంగా ప్రయాణించవచ్చు. కానీ పనులు నెమ్మదిగా సాగుతుండగా, హైవేలో ట్రాఫిక్ సమస్యతో పాటు సర్వీస్ రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి తమిళనాడు సరిహద్దు జూజువాడి నుంచి క్రిష్ణగిరి వరకు జాతీయ రహదారిపై సిఫ్‌కాట్, గోపసంద్రం, సుండగిరి, మేలుమలై, బోలుపల్లి ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి జాతీయ రహదార్ల శాఖ చర్యలు చేపట్టింది. గత ఏడాది ఆగస్ట్ నెలలో ప్రారంభించారు. ఏడాది లోపు పనులను పూర్తి చేస్తామని అప్పట్లో తెలిపారు. ఏడాది కావస్తున్నా నిర్మాణ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

రోజుకు 80 వేల వాహనాలు..

జాతీయ రహదారిపై రోజూ 80 వేలకు పైగా వాహనాలు సంచరిస్తుంటాయి. శని, ఆదివారాల్లో ఈ సంఖ్య లక్షను దాటుతుంది. పనుల వల్ల ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతోంది, గంటల తరబడి వాహనాలు రద్దీలో ఇరుక్కుపోతుంటాయి. ఇదేచోట వాహనాలు అతివేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. గత 11 నెలల్లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 40 మందికిపైగా మృతి చెందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తక్షణమే వంతెనల పనులు పూర్తిచేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

రాళ్ల లారీ స్వాధీనం

క్రిష్ణగిరి: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీని ఖనిజ సంపద శాఖాధికార్లు స్వాధీనపరుచుకొని మహారాజగడ పోలీసులకు అప్పగించారు. వివరాల మేరకు క్రిష్ణగిరి ఖనిజ సంపద శాఖాధికారి శరవణన్ నేతృత్వంలో అధికార్లు కల్లుగురికి బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ లారీని పరిశీలించగా అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు తెలిసింది. లారీని స్వాధీనపరుచుకొని మహారాజగడ పోలీసులకు అప్పగించారు.

కాలువల ఆధునికీకరణ, డ్యాం పటిష్టతపై వైఎస్సార్ ముందుచూపు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి మూడు రాష్ట్రాలకు సక్రమంగా నీరు చేరాలంటే ముందుగా కాలువలు పటిష్టంగా ఉండాలని, అప్పుడే రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేస్తారని భావించి అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించారు. ఇందు కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతో హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాలువలు రూపురేఖలు మారి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందింది. 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి ఆయ్యాక కూడా కాలువలు ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. ఏటా కాలువలకు నీరు వదిలేముందు, సంబంధిత అధికారులతో చర్చించేవారు. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునేవారు. అయితే ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, ఏపీలో కూటమి పాలకులు డ్యాం నుంచి కాలువలకు నీరు వదిలే ముందు, కాలువలు, గేట్ల పరిస్థితిపై ఎలాంటి సమీక్ష నిర్వహించలేదు. దీంతోనే టీబీ డ్యాంలో గేటు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్యాం క్రస్ట్ గేటు 19వ చైన్ లింక్ తెగిపోవడంతో డ్యాం నుంచి నదిలోకి కొట్టుకుపోవడంతో మూడు రాష్ట్రాలకు చెందిన రైతులు పంటలపై ప్రశ్నార్థకంగా మారింది. హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఎల్ఎల్‌సీ ఆధునీకరణ పనులు కూడా దాదాపు 75 శాతం పూర్తి చేశారు. ప్రతి ఏటా కాలువలకు నీరు నిలుపుదల చేసినప్పుడు కాలువలు దుస్థితి, గేట్లు ఎలా ఉన్న దానిపై ప్రత్యేక సమీక్ష జరిపి, ముందు చూపుతో ఆలోచించడం బోర్డు అధికారులు దృష్టి పెట్టలేదని రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు. ఈ సందర్భంగా తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నిర్మాణాలు పూర్తి చేసి 75 సంవత్సరాలు పూర్తి అయిందని, కాలువలు ఆధునికీకరణతో పాటు గేట్ల దుస్థితిపై కూడా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కబ్జాకు గురైన అటవీభూమి స్వాధీనం చేసుకోండి

యశవంతపుర: బెంగళూరు నగరంలోని పీణ్య జాలహళ్లి ప్లాంటేషన్ సర్వే నంబర్ 1, 2లో రూ.10 వేల కోట్లు విలువైన 599 ఏకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని అటవీశాఖ మంత్రి ఈశ్వరఖండ్రె అదనపు ప్రధాన కార్యదర్శికి సూచించారు. కబ్జాకు గురైన భూములను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హెచ్ఎంటీ.. ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తులకు భూములను అమ్ముతున్నట్లు మంత్రి తెలిపారు. 281 ఏకరాలు స్వాధీనం చేసుకొని చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

పూజలు దర్శన్ కోసం కాదు

యశవంతపుర: జైల్లో ఉన్న దర్శన్ విడుదల కోసం ఈ నెల 13, 14 తేదీల్లో కళకారుల సంఘం ఆధ్వర్యంలో గణహోమం, మృత్యుంజయ హోమం, అశ్లేషబలి, సర్వశాంతి పూజలు చేయాలని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పూజలు దర్శన్ కోసం కాదని, సినీ రంగానికి సంబంధించి అని నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, నటుడు దొడ్డణ్ణ వివరణ ఇచ్చారు.

నీటి పారుదల శాఖ నిర్వహణలో సర్కార్ నిర్లక్ష్యం

బనశంకరి: నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ కు తన శాఖ నిర్వహణ కంటే పార్టీ హైకమాండ్ ఏజెంట్ విధులు ఎక్కువని విపక్షనేత ఆర్.అశోక్ ధ్వజమెత్తారు. ఈమేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ఆదివారం పోస్ట్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తుంగభద్రాడ్యాం 19వ గేట్ చైన్ లింక్ తెగిపోయిందన్నారు. డ్యాంలో దాదాపు 60 టీఎంసీల నీరు వృథా అయ్యే ప్రమాదం ఉందని, దీంతో పంటలు ఎలా సాగు చేయాలో తెలియక రైతులు దిగాలు చెందుతున్నారన్నారు. అవినీతి, రాజకీయ కీచులాట, పక్క రాష్ట్రాల ఎన్నికలకు నగదు సరఫరాలో బిజీగా ఉన్న డిప్యూటీ సీఎం నీటి పారుల శాఖ నిర్వహణపై నిర్లక్ష్యం చేశారన్నారు. గత ఏడాది రైతులు కరువుతో అల్లాడరని, ఈఏడాది భారీ వర్షాలతో జలాశయాలు భర్తీ కావడంతో రెండు పంటలు పండించవచ్చని ఆశతో ఉండగా ప్రభుత్వ నిర్లక్ష్యం వారి ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. డ్యాం భద్రతపై దృష్టి పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేదికాదన్నారు.

ముడాకు సిద్దు పాత లేఖ వైరల్

శివాజీనగర: మైసూరు ముడా అక్రమాలకు సంబంధించి రోజూ ఒక్కో విషయం బయటపడుతోంది. 1984లో సిద్ధరామయ్య బదులు స్థలాం కావాలని ముడాకు రాసిన లేఖ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ముడా నుంచి సీఎం భార్య 14 స్థలాలను తీసుకున్నారు. ఇందులో అక్రమం ఏమీ లేదని సీఎం చెబుతున్నారు. 1984లో సిద్ధరామయ్య ఎమ్మెల్యేగా ఉండగా ఈ లేఖ రాశారని విపక్షాలు ఆరోపించాయి. జయనగర–తొణచికొప్పలలో కోరిన స్థలం ఇవ్వాలని ముడా అధ్యక్షునికి లేఖ రాయగా, ఆయన ఆమోదం తెలిపారు.

కళింగర తిని ఒకరి మృతి

పావగడ: పావగడ తాలూకా లోని కొడమడుగు గ్రామంలో కళింగర పండ్లను తిని ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. కొడమడుగు పరిసర తోటల్లో పచ్చకాయల పంట సాగు చేశారు. ఆ పంటకు వైరస్ సోకింది. పండ్లను కాపాడుకునే ఆర్థికస్తోమత లేక రైతులు తోటల్లోనే వదిలేశారు. ఆదివారం జనం తోటల్లో పండ్లను తెచ్చుకుని ఆరగించారు. వారిలో ముగ్గురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. జగన్నాథ్ రెడ్డి అనే వ్యక్తిని బెంగళూరు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

కోలారు వార్తలు...

అధ్యక్షుడిగా నియామకం

కోలారు: కోలారు జిల్లా కాంగ్రెస్ సమితి పదాధికారుల విభాగం నూతన అధ్యక్షుడిగా టీఎస్ సుధీర్‌ను నియమిస్తూ కర్ణాటక ప్రదేశ కాంగ్రెస్ సమితి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నటరాజ గౌడ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనకు నియమక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నటరాజగౌడ మాట్లాడుతూ... జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు గౌతం, రంజిత్, అహిందా రాష్ట్ర అధ్యక్షుడు సి సోమశేఖర్, నవీన్‌గౌడ తదితరులు అభినందించారు.

హాస్టల్ కుక్ సస్పెండ్

కోలారు: హాస్టల్‌లో దోసెలు తిని 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనకు సంబంధించి హాస్టల్ వంట ఉద్యోగి నరసింహప్పను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ రాకేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శాఖపరమైన విచారణకు ఆదేశించారు. హాస్టల్ వార్డెన్ గరు శాంతప్ప సెలవుపై వెళ్లారు. వంట ఉద్యోగి నరసింప్పనే హాస్టల్ నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో స్వచ్ఛత లేదు. విద్యార్థులను తిట్టడం, కొట్టడం చేసేవాడని సమాచారం. రెండు రోజుల క్రితం నాటి అన్నాన్ని దోసె పిండికి కలిపారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సైతం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి ఆ శాఖ ఏడీ చెన్నబసప్పకు కూడా నోటీసులు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రుడు

మాలూరు: ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మాలూరు - హోసూరు మార్గంమధ్యలో చోటు చేసుకుంది. తాలూకాలోని లక్కూరు ఫిర్కా హెచ్ హొసకోట గ్రామ పంచాయతీ పరిధిలోని బరగూరు గ్రామానికి చెందిన మహేష్ (26), శంకర్ (25)లు పని నిమిత్తం తమ ద్విచక్ర వాహనంలో పట్టణానికి వచ్చి తిరిగి గ్రామానికి తిరిగి వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన కంటైనర్ వాహనం ఢీకొంది, ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితులను హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కోలారు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మాలూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులకు ప్రబంధ పోటీలు

కోలారు: కర్ణాటక రాష్ట్ర సహకార మహామండలి బెంగుళూరు, కోలారు జిల్లా సహకార సమాఖ్య, కెఎం కరియప్ప పాఠశాల హంచాళ గేట్, బెంగుళూరు మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రబంధ పోటీలు, ఇంటర్ విద్యార్థులకు చర్చా పోటీలను ఈ నెల 13న మంగళవారం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రకటనలో తెలిపారు. చర్చాపోటీలో జడ్జిలుగా కోలారు జిల్లా కార్యనిరత పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బివి గోపీనాథ్, సహకార సంఘాల నిబంధకుడు ఎస్ నవీన్, నివృత్త సహకార శిక్షణాధికారి కె మల్లయ్య ఉంటారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సహకార విషయాలపై ప్రబంధ పోటీలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు డీసీసీ బ్యాంకు వద్ద ఉన్న బెంగుళూరు మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో (బిఎంఎస్ పాఠశాల) ఏర్పాటు చేశారు. ప్రబంధ పోటీ అంశం సహకార చళువళి, యువ నాయకత్వం. ప్రబంధం రాయడానికి ఒక గంట కాలావకాశం ఉంటుంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావలసి ఉంటుందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు కోలారు జిల్లా సహకార సమాఖ్య సహకార విషయాలపై ఇంటర్ విద్యార్థులకు చర్చా పోటీలను కోలారు జిల్లా సహకార సమాఖ్య సభాంగణంలో నిర్వహిస్తున్నారు. అంశం.. సహకార వలయద ప్రాథమిక సంఘాల బలోపేతంపై మాట్లాడడానికి ఐదు నిమిషాల కాలావకాశం ఉంటుంది. జిల్లా స్థాయి చర్చా పోటీలలో విజేతలైన ఇద్దరు విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే చర్చా పోటీలలో పాల్గొనడానికి అవకాశం ఉంటుంది. మరిన్ని వివరాల కోసం కోలారు జిల్లా సహకార సమాఖ్య ముఖ్య కార్యనిర్వహణ అధికారి మొబైల్ నెంబర్ 9743810438, 9591500335 నెంబర్‌లకు సంప్రదించవలసిందిగా ఆ ప్రకటనలో కోరారు.

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించండి



సమావేశమైన రైతు సంఘం పదాధికారులు

కోలారు: జిల్లా వ్యాప్తంగా అసౌకర్యాల మధ్య ఉన్న హాస్టళ్లకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం ప్రాంగణం వద్ద సమావేశమైన రైతు సంఘం పదాధికారులు జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. హాస్టళ్లకు నాసిరకం ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, పేద విద్యార్థుల జీవితాలో అధికారులు చెలగాటం ఆడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబల్లి మంజునాథ్ మాట్లాడుతూ... జిల్లాలో ఎన్నో సమస్యలు పట్టి పీడిస్తున్నా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాత్రం ఇటు వైపు తిరిగి చూడడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం పదాధికారులు మంగసంద్ర తిమ్మణ్ణ, యల్లప్ప, హరీష్, విజయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ తెరవడానికి అనుమతి

కోలారు: మాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలకు సంబంధించి హైకోర్టు అడిగిన దాఖలాలు సమర్పించడానికి ఈ నెల 13న జిల్లా యంత్రాంగం ఈవీఎంలు భద్ర పరచిన కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూంను తెరవనున్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూం తెరవడానికి రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి అనుమతి ఇచ్చారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రముఖుల సమక్షంలో మంగళవారం మాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్‌రూంను తెరవనున్నారు. కౌంటింగ్ సమయంలో సంగ్రహించిన దాఖలాలను కోర్టుకు సమర్పించడం జరుగుతుంది. స్ట్రాంగ్ రూం తెరిచే రోజున హాజరు కావాలని కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఎం, ఆప్ పార్టీల జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులకు ఇప్పటికే కలెక్టరేట్ అధికారులు సమాచారం ఇచ్చారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలో మాలూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కెవై నంజేగౌడ 50,955 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కెఎస్ మంజునాథ్‌గౌడ 50,707 ఓట్లు సాధించారు. కెవై నంజేగౌడ కేవలం 248 ఓట్ల తేడాతో మంజునాథ్‌గౌడపై విజయం సాధించారు. దీంతో రీకౌంటింగ్ నిర్వహించాలని పరాజిత బీజేపీ అభ్యర్థి మంజునాథ్‌గౌడ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతోంది.

క్లుప్తంగా

జీఏ ఆచార్య విగ్రహావిష్కరణ


జీఏ ఆచార్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే, ప్రముఖులు

గౌరిబిదనూరు: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని గ్రహించి స్వాతంత్ర్యానికి పూర్వమే 1943లో తాలూకాలో విద్యా సంస్థ స్థాపించి లక్షలాది మందికి విద్యాదానం చేసిన ఘనత జీఏ ఆచార్యకు దక్కుతుందని ఎమ్మెల్యే పుట్ట స్వామిగౌడ అన్నారు. పట్టణంలోని ఆచార్య పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆచార్య విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాభివృద్ధిలో తాలూకా వెనుకబడి ఉండటంతో జీఏ ఆచార్య తన స్వంత స్థలాన్నిచ్చి విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, విజ్ఞాని కేపీజి రెడ్డ, తహసీల్దార్ మహేశ్ పత్రి, కమిషనర్ గీత తదితరులు పాల్గొన్నారు.

రేణుకాస్వామి హత్య కేసు చార్జ్‌షీట్ సిద్ధం

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసుకు సంబంధించి పోలీసులు చార్జ్‌షీట్ సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులు చాలా వరకూ సాక్ష్యాధారాలు సేకరించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు, సీసీటీవీ పుటేజీలు, కాల్ రికార్డులు, నగదు, సాక్షుల వాంగ్మూలాలు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. నిందితులకు బెయిలు రాకుండా ఉండేలా పోలీసులు చార్జ్‌షీట్ తయారు చేశారు. రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ అండ్ గ్యాంగ్ జైలుకు వెళ్లి 50 రోజులు గడిచాయి.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

మైసూరు: కేఎస్ఆర్టీసీ బస్సు ఢీ కొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా ప్రధాన రహదారి బన్నికొప్పె వద్ద జరిగింది. తమిళనాడుకు చెందిన దొరేస్వామి (67) తన కుమార్తె ఇంటికి వచ్చాడు. టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా బస్సు ఢీ కొట్టింది. కిందపడిన అతడిపై బస్సు దూసుకెళ్లింది. అక్కడికక్కడే మృతి చెందాడు. బిళికెరె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిందితుడిపై పోలీసు కాల్పులు


నిందితుడు సతీశ్ (ఫైల్)

యశవంతపుర: దోపిడీ దారుడిపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. ఈ ఘటన హాసన్ జిల్లా చెన్నరాయపట్టణ తాలూకా హిరిసావెలోని బూకనకట్టెలో జరిగింది. రెండు దోపిడీ కేసులకు సంబంధించి నలుగురు నిందితులు బూకనబెట్టలో తలదాచుకున్నట్లు అందిన సమాచారంతో సీఐ రఘుపతి నేతృత్వంలో పోలీసులు ఆదివారం వెళ్లారు. పోలీసుల రాకను నిందితులు పసిగట్టారు. సతీశ్ అనే నిందితుడు డ్రాగన్‌తో కానిస్టేబుల్ పుట్టరాజుపై దాడికి యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం ఎస్ఐ భరత్‌రెడ్డి నిందితుడి కాలుపై కాల్పులు జరిపాడు. బలమైన గాయలు కావటంతో కుప్పకూలాడు. అనంతరం నిందితుడిని ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు తప్పించుకున్నారు.

కెంపేగౌడ సర్కిల్‌గా నామకరణం చేస్తాం

గౌరిబిదనూరు: పట్టణంలోని బైపాస్ రోడ్డులో మార్కెట్ యార్డ్ సమీపంలోని సర్కిల్‌కు ఈనెల 17న నాడప్రభు కెంపేగౌడ సర్కిల్‌గా నామరణం చేయడంతోపాటు కెంపేగౌడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జయంతిని ఆచరిస్తామని ఆదిచుంచనగిరి చిక్కబళ్లాపురం శాఖామఠం మంగళానాథస్వామీజీ తెలిపారు. బెంగళూరు నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కెంపేగౌడ పునాది వేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతిరెడ్డి, బీజేపీ నాయకుడు రవినారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చిక్కజ్జప్ప, రైతు రామచంద్రరెడ్డి, కెంపేగౌడ సాంస్కృతిక వేదిక జనార్ధన మూర్తి, సిద్దరామయ్య, జాలీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


మహాలింగప్ప(ఫైల్)

యశవంతపుర: ఎలుగుబంటి దాడిలో గాయపడి హాసన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇదే జిల్లా అరసికెరె తాలూకా బాణావర హోబళి జన్నావర గ్రామానికి చెందిన రైతు మహాలింగప్ప(75) మృతి చెందాడు. గతనెల 25న సదరు రైతు పొలానికి వెళ్తుండగా ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇతన్ని అరసికెరెలోని ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హాసన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

నలుగురిపై కేసులు

యశవంతపుర: సెంట్రింగ్ కూలి ఇద్దరు మృతి చెందిన ఘటనకు సంబంధించి కట్టడం యజమాని, కాంట్రాక్టర్, మేనేజర్, ఇంజినీర్లపై పీణ్య పోలీసులు కేసు నమోదు చేశారు. పీణ్య ఎన్విటిఎఫ్ సర్కిల్‌లో భవనం నిర్మిస్తుండగా శనివారం సెంట్రింగ్ కూలింది. ముగ్గురు కార్మికులు చిక్కుకోగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి వారిని బయటకు తీశారు. తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందగా మరొకరిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పీణ్య పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నలుగురిపై కేసులు నమోదు చేశారు.

దోమల నివారణకు ఎకో ట్రాప్



ఎకో ట్రాప్‌లో వాడే రసాయనాలు



ఎకోట్రాప్ ఇలా ఉంటుంది


దోమలతో బెంగళూరు సతమతం

- బెంగళూరులో త్వరలో ఏర్పాటు
- ముంబై దారావి మురికివాడలో సత్ఫలితాలు
- డెంగీ నియంత్రణకు వ్యూహాలు

బనశంకరి: దోమలు లేని ఊరు ఎంతో బాగుంటుంది, అలాంటి చోట జీవిస్తే ఏ సమస్యా ఉండదని కొందరు అనుకుంటారు. కానీ చెత్త, మురుగు, అపరిశుభ్రత తీరనంత వరకు దోమల సమస్యకు పరిష్కారం దొరకదు. రాజధాని బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా డెంగీ కేసుల సంఖ్య హెచ్చు మీరుతున్న నేపథ్యంలో హైకోర్టు సైతం దోమల బెడదపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో డెంగీకి కారణమయ్యే దోమల నియంత్రణకు నగరంలో ఎకో బయో ట్రాప్ సాధనాలను అమర్చాలని బీబీఎంపీ సన్నద్ధమైంది. బెంగళూరులో ఈ ఏడాది సుమారు 10 వేల డెంగీ కేసులు నమోదు కాగా ముగ్గురు చనిపోయారు. రాష్ట్రంలో మొత్తం 20 వేల మందికి పైగా డెంగీ బారినపడటంతో 10 మంది వరకు అసువులు బాశారు.

ఫలించని పాత చర్యలు

రాజధానిలో డెంగీని అరికట్టడం ఆరోగ్యశాఖ, బీబీఎంపీకి తలనొప్పిగా మారింది. క్రిమి సంహారకాలను పిచికారి చేయడం, పొగ వదలడం తదితరాలను చేపట్టారు. కానీ డెంగీ కేసులు సంఖ్య మాత్రం తగ్గడంలేదు. దీంతో ముంబై దారావి మురికివాడల్లో దోమల నివారణకు ఉపయోగించే పద్ధతుల్ని అనుసరించాలని, ఇకో బయో ట్రాప్‌లను అమర్చాలని కేంద్ర ఆరోగ్య అధికారులు సలహా ఇచ్చారు.

ఎలా పనిచేస్తుంది?

ఇకో బయో ట్రాప్ ఇది ఒక పూలకుండీ మాదిరిగా ఉంటుంది. ఈ పాట్‌లో రసాయనాల నీటిని వదులుతారు. ఆ వాసనలకు దోమలు వచ్చి పాట్‌లో పడి చనిపోతాయి. ప్రతి 400 చదరపు అడుగులకు ఒక బయో ట్రాప్ అమరుస్తారు. ఒక ట్రాప్ నెల రోజులు పనిచేస్తుంది. దీంతో దోమలు 70 శాతం తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు.

ఒక్కో దానికి రూ. 400 ఖర్చు

బీబీఎంపీ సార్వజనిక ఆరోగ్య విభాగం అధికారులు నగరంలోని కోరమంగల ఆడుగోడి వార్డులో ప్రయోగాత్మకంగా ఎకో బయోట్రాప్ అమరికకు ఎంపిక చేశారు. సుమారు 400 బయో ట్రాప్‌లను అమరుస్తారు. ప్రతి బయో ట్రాప్‌కు రూ.400 నుంచి 500 ఖర్చవుతుంది. పెద్దసంఖ్యలో కొనుగోలు చేస్తే కంపెనీలు ధరలను తగ్గిస్తాయి. ప్రయోగాత్మకంగా అమలుకు రూ.2 లక్షల నుంచి 3 లక్షలు వ్యయం అవుతుందని బీబీఎంపీ అధికారులు తెలిపారు.

25 డెంగీ హాట్‌స్పాట్స్

బెంగళూరులో సుమారు రెండు నుంచి అంతకంటే డెంగీ బాధితులు నమోదైతే ఆ స్థలాన్ని డెంగీ హాట్‌స్పాట్‌గా పరిగణిస్తారు. నగరంలో 25 డెంగీ హాట్‌స్పాట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో మహదేవపుర వలయంలోనే అత్యధికంగా 11 హాట్‌స్పాట్లు, దక్షిణ వలయంలో 7, పశ్చిమ వలయంలో 3, తూర్పు వలయంలో 2, దాసరహళ్లి, బొమ్మనహళ్లి వలయాల్లో తలా 1 డెంగీ హాట్‌స్పాట్స్ గుర్తించారు.


బెంగళూరు స్లమ్స్‌లో డెంగీ బెడద తీవ్రం


ముంబైలోని ప్రఖ్యాత దారావి మురికివాడ

విద్యార్థినికి వేధింపులు.. నిందితుడి అరెస్ట్

దొడ్డబళ్లాపురం: విద్యార్థినిని అసభ్యకరంగా తాకుతూ లైంగికంగా వేధించిన నిందితుడిని సోలదేనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. జీవర్గికి చెందిన బసవరాజు(28) చిక్కబాణావరలోని మారుతి నగర్‌లో నివసిస్తున్నాడు. ఒక మెడికల్ షాప్‌లో పని చేస్తున్నాడు. జూన్ 30న రాత్రి 9గంటల సమయంలో సప్తగిరి కళాశాల వద్ద కాలినడకన వెళ్తున్న విద్యార్థినిని లైంగికంగా వేధించాడు. ఆమె కేకలు వేయడంతో కాస్త దూరంలో నిలిపి ఉన్న బైక్‌పై పరారయ్యాడు. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ కెమెరా పుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశారు.

టైర్ పేలి బైకిస్టు మృతి

మైసూరు: బైక్ టైర్ పేలడంతో వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా హనూరు పట్టణం శివార్లలోని పోలీసు క్వార్టర్స్ వద్ద జరిగింది. యళందూరు తాలూకా కోమారనపుర గ్రామానికి చెందిన రామస్వామి (53) పని నిమిత్తం యళందూరు నుంచి హనూరుకు బైక్‌పై వస్తుండగా హఠాత్తుగా టైర్ పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా బైక్ పల్టీకొట్టింది. ఈ సమయంలో రామస్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. హనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జలాశయంలోకి దూకి రైతు ఆత్మహత్య

మైసూరు: జీవితంపై విరక్తితో రైతు జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లాలోని సరగూరు తాలూకాలో చోటు చేసుకుంది. సరగూరు తాలూకా హంచిపుర గ్రామంలో హెచ్‌సీ మంజునాథ్ అనే వ్యక్తి తన భార్య, తండ్రితో కలిసి జీవిస్తున్నాడు. తన కున్న కొద్దిపాటి భూమిలో పంటలు సాగుచేసుకుంటూ జీవిస్తున్నాడు. పంటల సాగుకు బ్యాంకులో రుణాలు తీసుకున్నాడు. పంటలు చేతికందక అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. ఒకవైపు అప్పుల భారం, మరోవైపు కడుపునొప్పి, ఛాతీపై నొప్పితో బాధపడుతూ మనస్తాపానికి గురై నుగు జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సరగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

బాలికపై అత్యాచారం

మైసూరు: బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని పోలీసులుఅరెస్టు చేశారు. మైసూరు హోటగళ్లి నివాసి భువన్ (19) కోర్గళ్లిలోని 14 ఏళ్ల బాలికపై భువన్ అత్యాచారం చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగర పోలీసులు భువన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అడ్డుగా ఉన్నాడని భర్తను కడతేర్చింది

- హత్యకేసును ఛేదించిన పోలీసులు
- భార్య, ప్రియుడి అరెస్ట్

బనశంకరి: పెడదారి పట్టిన ఓ మహిళ తన సుఖానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చింది. వైట్‌ఫీల్డ్ హగదూరులో ఈనెల 9న జరిగిన మహేశ్ (36) అనే వ్యక్తి హత్యోదంతాన్ని పోలీసులు ఛేదించారు. భార్య తేజస్విని, ప్రియుడు గజేంద్ర(35)ను అరెస్ట్ చేశారు. హాసన జిల్లా అరకలగూడు దొంబరపాళ్య నివాసి మహేష్‌తో తేజస్విని అనే మహిళకు కొద్ది సంవత్సరాల క్రితం వివాహమైంది. దంపతులు వైట్‌ఫీల్డ్ హగదూరులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తేజస్విని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రుణాలు వసూలుచేసే విభాగంలో పనిచేసేది. గత ఏడాదినుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తేజస్విని సహద్యోగి గజేంద్రతో వివాహేతరం పెట్టుకుందని మహేశ్ గుర్తించి మందలించాడు. గజేంద్రకు ఫోన్ చేసి హెచ్చరించాడు. కానీ వివాహేతర సంబంధం కొనసాగించారు. ఈనెల 9న తేజస్విని గజేంద్ర ఇంట్లో ఉండగా మహేశ్ గమనించాడు. భార్యపై దాడికి పాల్పడగా అడ్డుకోవడానికి ప్రయత్నించిన గజేంద్రపై కూడా మహేశ్ దాడిచేశాడు. ఈ సమయంలో తేజస్విని, గజేంద్రలు మహేశ్ గొంతు నులిమి హత్య చేశారు. హత్యను కప్పిపుచ్చేందుకు తేజస్విని నాటకం ఆడింది. తన భర్త ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందినట్లు స్థానికులను నమ్మించింది. అయితే స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వైట్‌ఫీల్డ్ పోలీసులు తేజస్వినిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా తప్పు ఒప్పుకుంది. భర్తను హత్యచేయడానికి ప్రియుడు గజేంద్ర సహకరించాడని తెలిపింది. ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌చేసి విచారణ చేపడుతున్నారు.

కన్ను పడింది.. స్కూటర్ మాయమైంది

కృష్ణరాజపురం: నిమిషాల వ్యవధిలో స్కూటర్ చోరీకి గురైంది. ఈఘటన బెంగళూరులోని హెబ్బాళ చోళనహళ్లి మినీ మార్ట్ ఎదుట జరిగింది. స్కూటర్‌లో వచ్చిన మహిళ వాహనాన్ని మార్ట్ ఎదుట నిలిపి కూరగాయల కోసం లోపలకు వెళ్లింది. స్కూటర్‌కు కీ ఉండడాన్ని గమనించిన ఓవ్యక్తి దాన్ని ఆన్ చేసి తీసుకెళ్లిపోయాడు. కొద్ది నిమిషాల అనంతరం బయటకు వచ్చిన మహిళ స్కూటర్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. అక్కడా ఇక్కడ గాలించినా వాహనం కనిపించలేదు.దీంతో హెబ్బాళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా స్కూటర్ చోరీ దృశ్యాలు సీసీకెమెరాలో నమోదయ్యాయి.


స్కూటర్‌ను పరిశీలిస్తున్న దొంగ

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి



నుజ్జునజ్జయిన వాహనం, మధు మృతదేహం

చిలమత్తూరు: ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని 544–ఈ జాతీయ రహదారి దేమకేతేపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకవాసి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. హిందూపురం వైపు నుంచి వస్తున్న ఇన్నోవా వాహనం, చిలమత్తూరు వైపు నుంచి వస్తున్న మహీంద్రా జైలో వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఇన్నోవా వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటకలోని కోలారు జిల్లా శ్రీనివాసపురం ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ టెక్నీషియన్ మధుసూదన(26) అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తోన్న మరో ఇద్దరు గాయపడ్డారు. జైలో వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తి కారులోనే ఇరుక్కోగా జేసీబీల సాయంతో బయటకు తీసి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటన స్థలంలో మలుపు ఉండటం, అతి వేగం వెరసి వాహనాలూ ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. రెండు వాహనాలు నుజ్జు అయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఐదేళ్లూ మా నాన్నే సీఎం

మైసూరు: ఐదేళ్ల పాటు తన తండ్రి సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర స్పష్టం చేశారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 135 మంది ఎమ్మెల్యేలంతా కలసికట్టుగా సిద్ధరామయ్యను సీఎంగా ఎన్నుకున్నారని, దీంతో ఎలాంటి కారణం లేకుండా సీఎం మార్పు ఉండబోదని తెలిపారు. తన తండ్రికి మద్దతుగా కేంద్ర నాయకులు కూడా ఉన్నారని, డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేల మద్దతు కూడా ఉందని తెలిపారు. తన తండ్రి ఎలాంటి తప్పు చేయలేదని అందుకే మైసూరులో అందరూ కలసి కట్టుగా బల ప్రదర్శన చేశారని చెప్పారు.

వాట్సాప్ ద్వారా సహాయం కోరిన దర్శన్?

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య తరువాత దర్శన్ ఏం చేయాలో దిక్కుతోచక అనేక తప్పులు చేశాడు. అవన్నీ విచారణలో వెలుగు చూస్తున్నాయి. కేసు తనపైకి ఉండేందుకు ముగ్గురు రౌడీలకు రూ.30 లక్షలు ఇవ్వడం మొదలుకుని అనేక తప్పులు చేస్తూ వచ్చారు. అవన్నీ ఇప్పుడు సాక్ష్యాధారాలుగా మారి ఆయన మెడకు చుట్టుకున్నాయి. రేణుకాస్వామి హత్య అనంతరం... కేసు నుంచి బయటపడేయాలని దర్శన్ పలువురు రాజకీయ నేతలను వాట్సాప్ ద్వారా కోరినట్టు పోలీసులు గుర్తించారు. దర్శన్‌ను అరెస్టు చేశాక అతని మొబైల్ స్వాధీనం చేసుకుని వాట్సాప్ కాల్స్ మెసేజెస్ రిట్రీవ్ చేయగా ఈ సంచలన విషయాలు వెలుగు చూశాయి.

లబ్ధిదారులకు గృహలక్ష్మి నగదు విడుదల


భద్రా డ్యాంకు వాయినం సమర్పిస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

శివమొగ్గ: గృహలక్ష్మి యోజన కింద లబ్ధిదారులకు నగదును విడుదల చేసినట్లు, మూడు నెలల డబ్బులు లబ్ధిదారులకు అందనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. శివమొగ్గ జిల్లా భద్రా జలాశయానికి ఆదివారం వాయినం అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గృహలక్ష్మి యోజన కింద ప్రతి నెల సుమారు రూ. 3 వేల కోట్లను విడుదల చేస్తున్నట్లు , ప్రతి నెల డబ్బు విడుదలకు 15 రోజులు అవసరం అవుతుందన్నారు. అయితే బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు డబ్బులు చేరే సరికి సమయం పడుతోందని ఆమె చెప్పారు. మరోవైపు భాగ్యలక్ష్మి బాండ్ యోజన నిలిపేయలేదని, అది నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. ఆడపిల్లలకు 18 ఏళ్ల అనంతరం వారి చదువుకు ఆ డబ్బులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

హోసూరు వార్తలు..

ఘనంగా నవచండీ యాగం


నవచండీయాగం నిర్వహిస్తున్న పండితులు

హోసూరు: హోసూరు తేరుపేటలోని కొండపై వెలసిన చారిత్రక ప్రసిద్ధ మరకతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నవచండీ యాగం ఆదివారం సాయంత్రంలో ముగిసింది. గత 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు గణపతి హోమంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పచ్చకొలను నుంచి పుణ్యజలాలను తీసుకెళ్లి స్వామివారిని అభిషేకించారు. ఆదివారం 1.30 గంటలకు నైవేద్యం, దీపారాధనతో ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ యాగంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ బావిలో పడి...

కెలమంగలం: ఆటలాడుకొంటూ బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని కామగిరిదొడ్డి గ్రామానికి చెందిన కూలి కార్మికుడు నాగరాజ్. ఇతని కొడుకు మాలింగం (8). అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో దగ్గర్లో పొలంలో సైకిల్ టైర్‌తో ఆటలాడుకొంటూ బావిలోకి పడిపోయాడు. బాలుడు కనిపించలేదని తల్లిదండ్రులు వెతకగాసాగారు. కొందరు బావిలో బాలుని శవాన్ని చూసి తెలియజేశారు. పోలీసులు చేరుకుని శవాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

రైతు ఇంట్లో చోరీ

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని సేవగానపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55), 9వ తేదీన బెంగళూరు దగ్గర సర్జాపురలో నివాసముంచున్న కొడుకు వద్దకెళ్లాడు. శనివారం ఇంటికి తిరిగి వచ్చిన ఇతనికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 6.50 పొన్ల బంగారు నగలు దోపిడీకి గురైనట్లు తెలిసింది. రైతు బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాలంటీర్లచే ట్రాఫిక్ నియంత్రణ: ఎస్పీ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యకు, జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ తంగదురై అన్నారు. హోసూరు డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ పనుల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని, తగినంత ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో వాలంటీర్ల ద్వారా క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు. హోసూరు – డెంకణీకోట రోడ్డు, తళి రోడ్డు విస్తరణ పనులు, శాటిలైట్ రింగ్‌రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు సాగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైతుందని, దీనికి తోడు పట్టణంలో ఇరుకైన రోడ్లతో వాహన దారులు సతమత పడుతున్నారు. ఈ నేపథ్యంలో హోసూరు క్రషర్ అసోషియేషన్ ద్వారా వాలంటీర్ల జీతాల కోసం ఆర్థిక సాయం అందజేశారని తెలిపారు. సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు వాలంటీర్లను నియమిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమలో డీఎస్పీ బాబుప్రశాంత్, క్రషర్ అసోషియేషన్ అధ్యక్షులు సంపంగి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేశారు


కెలమంగలం: మూత్రపిండాల్లో రాళ్లను తొలగించే ఆపరేషన్ చేసిన వైద్యులు నిర్లక్ష్యంగా ఉండడం వల్ల ఎంతో నష్టపోయామని, ఆ డాక్టర్లపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వివరాల్లోకెళితే డెంకణీకోటకు చెందిన జయలక్ష్మి (46) గత నెల కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికెళ్లింది. జూలై 23న రాత్రి కిడ్నీలో రాళ్లు ఉన్నాయని ఆపరేషన్ చేశారు. అయితే రాళ్లను తీసేందుకు ఉపయోగిస్తున్న బాస్కెట్ కిడ్నీలో ఇరువుక్కుపోవడంతో హడావుడిగా బెంగళూరులో కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాలని ఒత్తిడి చేశారు. అంతకుముందే లక్షలాది రూపాయలను ఫీజుగా వసూలు చేశారు. డబ్బు పోయి, ఆమె ఆరోగ్యం దెబ్బతిందని, తమకు న్యాయం చేయలని కోరారు. ఆస్పత్రి వైద్యులు స్పందిస్తూ కిడ్నీలో అదనంగా పెరుగుతున్న కణితిలో బాస్కెట్ ఇరుక్కుపోయిందని, ఆమెకు అవసరమైన రక్తం అందుబాటులో లేకపోవడంతో బెంగళూరుకు సిఫార్సు చేసినట్లు చెప్పారు.


సందర్శకులతో నిండిపోయిన చిత్రకళాపరిషత్

ఛాయాచిత్ర ప్రదర్శనకు విశేష స్పందన

బనశంకరి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో బెంగళూరు నగరం కుమారకృప రోడ్డులోని చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించిన అరుదైన దృశ్యాలను ఇక్కడ ప్రదర్శించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఆహార ఫొటోగ్రాఫ్ ఆన్‌దిస్పాట్ ఫొటోషూట్‌కు యువతీయువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నోరూరించే వంటకాలను కెమెరాల్లో బంధించి ప్రతిభ కనబరిచారు. విజేతలకు వైపీఎస్ అధ్యక్షుడు వి.మంజువికాస్‌శాస్త్రి, కార్యదర్శి ప్రేమకాకడే బహుమతులు ప్రదానం చేశారు. గిరీశ్‌అనంతమూర్తి పాల్గొన్నారు.


ఫొటోలను వీక్షిస్తున్న నగరవాసులు



రవితేజ కోహినూర్?

‘ధమాకా’ వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల మరో సినిమాలో జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. రవితేజ కెరీర్‌లో 75వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాతో ‘సామజవరగమన’ వంటి హిట్ సినిమాకు ఓ రచయితగా చేసిన భాను బోగవరపు దర్శకుడిగా పరిచయం కానున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో లక్ష్మణ్ భేరి అనే పాత్రలో రవితేజ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ సినిమాకు ‘కోహినూర్’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ‘కోహినూర్’ను వర్కింగ్ టైటిల్‌గా పెట్టుకుని యూనిట్ వర్క్ చేస్తోందని, త్వరలోనే ఈ సినిమా టైటిల్ గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారు.

వింటేజ్ యాక్షన్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం ‘మట్కా’. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లు. కరుణకుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డా. విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్ళూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇరవైనాలుగేళ్ల టైమ్‌లైన్‌తో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారు. ఆదివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సిగార్ తాగుతూ కనిపిస్తున్న వరుణ్ తేజ్ డ్రెస్సింగ్, హెయిర్ స్టైల్‌లో వింటేజ్ వైబ్ కనిపిస్తోంది. నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, పి. రవిశంకర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● వరుణ్ తేజ్

విభిన్న వీక్షణం

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన చిత్రం ‘వీక్షణం’. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ‘‘విభిన్నమైన కథాంశంతో ‘వీక్షణం’ ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫస్ట్ కాపీ కూడా రెడీ అయింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, కెమెరా: సాయిరామ్ ఉదయ్.



● రామ్ కార్తీక్



● ఛార్మీ, పూరి జగన్నాథ్, రామ్, కావ్యా థాపర్

నేను ఒళ్లు దగ్గర పెట్టుకుని చేసిన సినిమా ఇది

- పూరి జగన్నాథ్

‘‘ఈ మధ్య సోషల్ మీడియాలో, బయట ఓ ట్రెండ్ చూస్తున్నాను. అరే... నీకిది నచ్చిందా? అని అడిగితే... వాళ్లకు నచ్చుతుందేమో... వీళ్లకు నచ్చుతుందేమో అని తోటివారిపైకి తోస్తున్నారు. ముందు మనకు నచ్చిందా? అని చూసుకోవాలి. మీకు నచ్చింది మీరు చేయండి. పకోడి గురించి, పకోడీల గురించి పట్టించుకుంటే పనులు జరగవు. సాధారణంగా నేను సలహాలివ్వను. నా అనుకున్నవాళ్లు అడిగితే ఇస్తా. మీ అందర్నీ (ఫ్యాన్స్) నా వాళ్లుగా ఫీలై ఇస్తున్నాను’’ అని రామ్ అన్నారు. హీరో రామ్, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘డబుల్ ఇస్మార్ట్’. వీరి కాంబినేషన్‌లోనే 2019లో వచ్చిన హిట్ చిత్రం ‘ఇస్మార్ట్ శంకర్’ సినిమాకు సీక్వెల్‌గా ‘డబుల్ ఇస్మార్ట్’ రూపొందింది. ఈ చిత్రంలో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించగా, సంజయ్ దత్, అలీ కీలక పాత్రల్లో నటించారు. పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా వరంగల్‌లో జరిగిన ‘డబుల్ ఇస్మార్ట్’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ మాట్లాడుతూ– ‘‘హీరోలు బుల్లెట్స్ లాంటివారు. పేల్చే గన్ బాగుంటే బుల్లెట్ చాలా స్పీడ్‌గా వెళ్తుంది. పూరీగారిలాంటి గన్ ప్రతి ఒక్క యాక్టర్‌కి కావాలి. ఛార్మీ కౌర్‌గారు లేకపోతే ‘డబుల్ ఇస్మార్ట్’ లేదు. ఆమె ఓ ఫైటర్. బాస్ లేడీ అని పిలుస్తాను. ‘డబుల్ ఇస్మార్ట్’ రేంజ్‌కి తగ్గట్లు, ప్రేక్షకుల అంచనాలను మించేలా మణిశర్మగారు మ్యూజిక్ ఇచ్చారు’’ అని అన్నారు.

పూరి జగన్నాథ్ మాట్లాడుతూ– ‘‘రామ్ లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేడు. సంజయ్ దత్‌గారు మా సినిమాలో యాక్ట్ చేసి, కొత్త కలర్ తీసుకొచ్చారు. నా నిర్మాణసంస్థకు ఛార్మీ కౌర్ ఓ బలం. నా దగ్గర రూపాయి లేకపోయినా నాకోసం ఎవరన్నా నిలబడ్డారంటే అది విషురెడ్డి. హిట్ సినిమా తీసినప్పుడు చాలామంది ప్రశంసిస్తారు. నా ఫ్లాప్ సినిమా విడుదలైన వారానికి విజయేంద్రప్రసాద్‌గారు ఫోన్ చేసి, ‘సార్... నాకో హెల్ప్ చేస్తారా?’ అన్నారు. ఆయన కొడుకే పెద్ద డైరెక్టర్.. రాజమౌళి. అలాంటిది ఆయన నన్ను హెల్ప్ అడుగుతున్నారేంటి? అనుకున్నా. ‘తర్వాతి సినిమా ఎప్పుడు చేస్తున్నారు? చేసే ముందు ఆ సినిమా కథ నాకోసారి చెప్తారా? మీలాంటి దర్శకులు ఫెయిల్ కావడం చూడలేను. చిన్న చిన్న తప్పులేవో ఉంటుంటాయి. తీసే ముందు నాకోసారి చెప్పండి’ అన్నారు. నేను భావోద్వేగానికి గురయ్యాను. అయితే ‘డబుల్ ఇస్మార్ట్’ కథను విజయేంద్రప్రసాద్‌గారికి చెప్పలేదు. తెలిసిన పనే కదా... ఒళ్లు దగ్గర పెట్టుకుని ఈ సినిమా తీశా’’ అని తెలిపారు పూరి జగన్నాథ్. ‘‘ఇస్మార్ట్ శంకర్’ను ఆదరించినట్లే ‘డబుల్ ఇస్మార్ట్’నూ ఆదరించండి’’ అన్నారు ఛార్మీ. పూరీ కనెక్ట్స్ సీఈవో విషు రెడ్డి, అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికీ మిస్టరీనే!

‘‘గణిత శాస్త్రం సృష్టి లోతును తెలిపితే... విజ్ఞాన శాస్త్రం సృష్టి మూలంవైపు తీసుకుని వెళ్తుంది’’ అంటూ మొదలైంది ‘రహస్యం ఇదం జగత్’ సినిమా రిలీజ్ డేట్ గ్లింప్స్ వీడియో. రాకేశ్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానసా వీణ, భార్గవ్ గోపీనాథం, కార్తీక్ కండాల, శివకుమార్ జుటూరి, ఆది నాయుడు, లాస్య రావినూతుల ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీలో లీడ్ రోల్స్‌లో నటించారు. కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్యా రావినూతుల ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాను నవంబరు 8న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘ఆ దేశంలోని ఓ ఎడారిలో ఎండిపోయిన సరస్సులో సుమారు 22 కిలోమీటర్ల వైశాల్యంలో అతి పెద్ద శ్రీచక్రం ప్రత్యక్షం కావడమే ఇందుకు కారణం, నిత్యం అమెరికా వైమానిక దళం నిఘా ఉండే ఈ ప్రాంతంలో శ్రీచక్రం ఎలా ఏర్పడింది? అనేది ఇప్పటికీ మిస్టరీనే’ వంటి డైలాగ్స్ గ్లింప్స్ వీడియోలో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: గ్యానీ, కెమెరా: టైలర్ బ్లుమెల్.



● రాకేశ్



● నయనతార

దర్శకుడు మారాడా?

‘ముకుత్తి అమ్మన్ (2020)’ (తెలుగులో ‘అమ్మోరు తల్లి’) సినిమా సీక్వెల్ ‘ముకుత్తి అమ్మన్ 2’కు తమిళ దర్శకుడు సుందర్. సి దర్శకత్వం వహించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. నయనతార, ఆర్‌జే బాలాజీ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ‘ముకుత్తి అమ్మన్’. ఆర్‌జే బాలాజీ, ఎన్‌జే శరవణన్ కలిసి దర్శకత్వం వహించిన ఈ ఫ్యాంటసీ కామెడీ సినిమా 2020లో డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజైంది. ఈ సినిమాకు వీక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ సినిమాకు సీక్వెల్ రానుందని, ఈ చిత్రంలో త్రిష లీడ్ రోల్‌లో నటిస్తారని, ఆర్‌జే బాలాజీ కూడా ఓ లీడ్ రోల్‌లో నటించి, పూర్తిస్థాయిలో దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారని కోలీవుడ్‌లో ప్రచారం సాగింది. కానీ తొలి భాగంలో నటించిన నయనతారయే మలి భాగంలోనూ లీడ్ రోల్ చేస్తారని, వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ గత నెలలో ప్రకటించింది. అయితే దర్శకుడిని మాత్రం ప్రకటించలేదు. దీంతో ‘ముకుత్తి అమ్మన్ 2’కు ఆర్‌జే బాలాజీయే దర్శకత్వం వహిస్తారా? లేదా అనే చర్చ కోలీవుడ్‌లో జరుగుతోంది. అయితే తాజాగా నటుడు–దర్శకుడు సుందర్. సి ఈ సినిమాను తెరకెక్కించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... ఈ ఏడాది చివర్లో చిత్రీకరణను ప్రారంభించి, వచ్చే ఏడాది ప్రథమార్ధంలోపు ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేయాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని భోగట్టా. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

ఓటీటీ
ఇది చూడొచ్చు

వానరాలు నటించిన అచ్చ తెలుగు కథ

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



భాష ఏదైనా భావం ముఖ్యమన్న నానుడి ‘కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్’ సినిమాకి సరిగ్గా సరిపోతుంది. ఒకటి రెండు పాత్రల మినహా పూర్తిగా చింపాంజీలు నటించిన సినిమా ఇది. ఈ సినిమాకి వెస్ బాల్ దర్శకుడు. ‘కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్’ సినిమా మునుపటి ఏప్స్ సిరీస్‌కు కొనసాగింపుగా తీసింది. సీజర్ అనే ప్రధాన పాత్రధారి తదనంతరం జరిగే కథ ఇది. సీజర్‌కు వారసుడిగా ప్రకటించుకుని తనకు తాను ప్రాక్సిమస్ సీజర్‌గా ప్రకటించుకుంటాడు ఓ నాయకుడు. మోవా, అతని సమూహం పై దాడి చేసి బందీలుగా తన రాజ్యానికి తెచ్చుకుంటాడు ప్రాక్సిమస్ సీజర్. తన రాజ్యంలో మనుషులకు సంబంధించిన ఓ బంకర్‌ను మందీ మార్బలంతో తెరవడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ ప్రయత్నంలో బంకర్‌కు సంబంధించిన ఓ మనిషితో కలిసి ప్రాక్సిమస్ రాజ్యంలోకి ప్రవేశిస్తాడు మోవా. తరువాత కొన్ని ట్విస్టులతో ప్రాక్సిమస్ సీజర్‌ను మోవా ఎలా అంతమొందించాడు అన్నది హాట్‌స్టార్ ఓటీటీ వేదిక మీద చూడాలి. కథ పరంగా చూస్తే మనకు పాత తెలుగు సినిమా కథ వాసనలు రావచ్చు. టెక్నాలజీని ఉపయోగించి టాలీవుడ్ నుండి హాలీవుడ్ దాకా ఈగ నుండి డైనాసర్ వరకు అన్ని జంతువులను మన కథకు తగ్గట్టుగా మలుచుకుంటున్నారు నేటి దర్శకులు. కాకపోతే ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. ఇంతటి సాంకేతికత అందుబాటులోకి రాని 80వ దశకంలోనే ‘మాకు స్వాతంత్ర్యం కావాలి’ అన్న పేరుతో తెలుగులో ఓ సినిమా వచ్చింది. అప్పట్లో పూర్తిగా జంతువుల మీద తీసిన సినిమా అది. నాటి ప్రేక్షకులకు అదో వింత, నేటి ప్రేక్షకులకు ‘కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్’ సినిమా అనేది ఓ పెద్ద వండర్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే జంతువులలో కూడా మనిషి భావాలు స్పష్టంగా చూపించడం, అలాగే అద్భుతమైన టేకింగ్ విత్ విజువల్ ఫీస్ట్ స్క్రీన్‌ప్లేతో ‘కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్’ సినిమా వర్త్ టూ వాచ్.

– ఇంటూరు హరికృష్ణ

నేడు కవిత బెయిలుపై సుప్రీంకోర్టు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బెయిలు కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ నిర్వహించనుంది. ఈడీ, సీబీఐ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితకు కూడా బెయిలు దక్కుతుందని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. సిసోడియాకు బెయిలు ఇచ్చిన సమయంలో.. సత్వర విచారణ హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ గురించి సుప్రీంకోర్టు ప్రస్తావించిన నేపథ్యంలో కవిత బెయిలు అంశం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

విప్లవ ద్రోహులను ప్రజలు క్షమించరు

మావోయిస్టు బీకే –ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: విప్లవ ద్రోహులు, కోవర్టులను పార్టీ, ప్రజలు ఎన్నటికీ క్షమించరని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–తూర్పుగోదావరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూరజ్‌కుండ్ బహుముఖ దాడిలో భాగంగా ఆపరేషన్ కగార్ చేపడుతున్న ప్రజా యుద్ధాన్ని నిర్మూలించలేరని ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ లేఖలో తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన కాకర్ల రవి 2016లో మావోయిస్టుల్లో చేరగా.. 2023లో ఆయన ప్రవర్తనలో మార్పులను గమనించి ఇంటికి పంపిస్తే, తన భార్య కల్పనతో కలసి పోలీసులకు లొంగిపోయాడని పేర్కొన్నారు. ఆపై పలువురిని పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. ఇదేక్రమాన బాపట్ల జిల్లా చీరాలకు చెందిన దుండి తేజ అమర్‌నాథ్ అలియాస్ అర్జున్ పార్టీలో పనిచేస్తూనే రవి మాటలు నమ్మి కోవర్టుగా మారాడని తెలిపారు. వీరిని పార్టీ, ప్రజలు క్షమించరని ఆజాద్ హెచ్చరించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అక్రమ బంగారం పట్టివేత

శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడు తనిఖీల తర్వాత అంతర్జాతీయ ప్రవేశద్వారం వద్ద నుంచి బయటికి వచ్చేశాడు. అప్పటికే ముందస్తు సమాచారంతో అక్కడికి చేరుకున్న డీఆర్ఐ అధికారులు అతడిని తనిఖీ చేయగా బ్యాగ్‌కు ఉన్న మెటల్ చైన్‌తోపాటు బూట్లలో ఉన్న చైన్‌లో కూడా బంగారాన్ని గుర్తించారు. అతడి వద్ద నుంచి రూ.1 కోటి విలువైన 1,390 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కొండలు పిండి.. సొమ్ములు దండి..

పర్చూరులో టీడీపీ ముఖ్యనేత గ్రావెల్ దందా

- ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగుయువత నేతను ముందుపెట్టి అక్రమ వ్యాపారం
- అనుమతులున్న గ్రావెల్ లీజులు రద్దుచేయించిన వైనం
- ఇసుకదర్శి అటవీ భూముల నుంచి గ్రావెల్ రవాణా
- రియల్ వెంచర్లు, రోడ్ల నిర్మాణానికి సరఫరా
- టిప్పర్ రూ.8 వేలు, ట్రాక్టర్ రూ.2 వేలు
- పర్యావరణం విధ్వంసం
- అక్రమరవాణాపై స్పందించని అధికారులు





ద్రోణాదుల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికారపార్టీ నేతలు బరితెగించారు. ఇసుక, మట్టి, గ్రావెల్, గ్రానైట్, రేషన్ అనే తేడా లేకుండా ఏది దొరికినా.. కొల్లగొట్టి జేబులు నింపుకొంటున్నారు. అక్రమార్జనకు కాదేదీ అనర్హం అనే రీతిలో తెగబడుతున్నారు. ఇందులో పర్చూరు ముఖ్యనేతది ప్రత్యేక స్థానం. నియోజకవర్గంలో ఉన్న ప్రకృతి వనరులను ఎలా దోచుకుతినాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదనుకోవాలి. పర్చూరులో ఉన్న ఇసుక, గ్రానైట్, గ్రావెల్‌లను అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండికొట్టి సొంత లాభం చూసుకుంటున్నారు. ఇప్పటికే ఇసుక, పాలిషింగ్ గ్రానైట్ అక్రమ రవాణాలో జోరుపెంచిన పర్చూరు **నేత అంతేస్థాయిలో గ్రావెల్ అక్రమ** తరలింపు చేపట్టారు. మార్టూరు మండలంలోని అటవీ భూముల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం పచ్చని కొండల్ని పిండిచేస్తున్నారు. జేసీబీలు, ఇటాచ్‌లు పెట్టి గ్రావెల్ అక్రమంగా తరలించి రియల్ వెంచర్లు, రోడ్ల నిర్మాణాలకు అమ్ముకుంటున్నారు.

వంద టిప్పర్లు, వందకుపైగా ట్రాక్టర్లతో..

మార్టూరు మండలంలోని మార్టూరు, ఇసుకదర్శి ప్రాంతాల్లోని అటవీ భూములనుంచి గ్రావెల్‌ను టీడీపీ ముఖ్యనేత రేయింబవళ్లు అక్రమంగా తరలిస్తున్నారు. కొండల్లో జేసీబీ, ఇటాచ్ మిషన్లు పెట్టి తవ్విపోస్తున్నారు. ఇక్కడినుంచి రోజూ వంద టిప్పర్లు, వందకుపైగా ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నారు. స్థానికంగా ఉన్న రియల్ వెంచర్లతోపాటు బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని రియల్ వెంచర్లకు గ్రావెల్ ఇక్కడినుంచే సరఫరా అవుతోంది. ఓడరేవు–నరసరావుపేట జాతీయ రహదారి పనులకూ ఈ గ్రావెల్ అమ్ముతున్నారు. సదరు కాంట్రాక్టర్ మరొకరి వద్ద గ్రావెల్ కొనకుండా పర్చూరు ముఖ్యనేత ఒత్తిడి తెచ్చి తానే సరఫరా చేస్తున్నారు. ఒక్క రోడ్డుపనికే రోజుకు వందలాది ట్రిప్పుల గ్రావెల్‌తోపాటు ట్రాక్టర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా అవసరమైనవారికి పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా టిప్పర్ గ్రావెల్ రూ.8 వేలకు, ట్రాక్టర్ గ్రావెల్ రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి రేటు పెరుగుతుంది. ఈ అక్రమ దందాను పర్చూరు అధికార పార్టీ ముఖ్యనేత అనుచరుడైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగుయువత నేత నడిపిస్తున్నాడు.

కూటమి రాకతో లీజుల రద్దు

గత ప్రభుత్వంలో పర్చూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వం గ్రావెల్ కోసం లీజులు మంజూరుచేసింది. మార్టూరు మండలం బొబ్బేపల్లి, కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల్లో పదులసంఖ్యలో లీజులుండేవి. ఆ లీజు భూముల నుంచి గ్రావెల్ తరలించి విక్రయించేవారు. దీంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది. తద్వారా జిల్లాకు, మైనింగ్ పరిధిలోని గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరేవి. వాటితో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్చూరు ముఖ్యనేత గతంలో ఉన్న బొబ్బేపల్లి పరిధిలోని లీజులను రద్దు చేయించారు. కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి ప్రాంతాల లీజులను రద్దుచేయకపోయినా అధికారం అడ్డుపెట్టి అక్కడ మైనింగ్ జరగకుండా నిలిపేయించారు. తాను మాత్రం లీజు, అనుమతులు వంటివి లేకుండానే ఇసుకదర్శి, ద్రోణాదుల తదితర అటవీప్రాంతాల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొడుతున్నారు. పర్చూరు నేత అక్రమ గ్రావెల్ దందాతో ప్రభుత్వ రాబడికి రూ.కోట్ల మేర గండిపడుతోంది. గ్రావెల్ దందా, ప్రభుత్వాదాయానికి గండి గురించి తెలిసినా సంబంధిత శాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

టీడీపీ నేత క్వారీలో జేసీబీ డ్రైవర్ మృతి!

- ఇది హత్యా లేక ప్రమాదమా?
- చిత్తూరు జిల్లాలో ఘటన
- జేసీబీ తొట్టి మీద పడి చనిపోయిన డ్రైవర్
- పోలీసులకు సమాచారమివ్వని నిర్వాహకుడు
- మృతదేహాన్ని బైక్‌పై ఆస్పత్రికి తరలింపు.. జేసీబీ మాయం



అక్రమ క్వారీ (ఇన్‌సెట్లో) చిన్నస్వామి మృతదేహం

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేత నడుపుతున్న క్వారీలో ఆదివారం జేసీబీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా బైక్‌పైనే మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకురావడంతో అది ప్రమాదమా! లేక హత్యా! అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం మాదిగబండలోని అక్రమ క్వారీ కథ ఇది..

స్థానికుల కథనం ప్రకారం.. మాదిగబండ సమీపంలోని సర్వే నంబర్లు 1367, 1345, 1376లో 4.43 హెక్టార్లలో రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ కోసం శరత్‌కుమార్ గనులశాఖ అనుమతులతో క్వారీ నడుపుతున్నారు. ఈక్రమంలో నిబంధనలు పాటించడంలేదని అధికారులు క్వారీకి అనుమతులు రద్దుచేస్తూ ఈ నెల 1న నోటీసులిచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ క్వారీని టీడీపీ నేత జనార్దన్‌నాయుడు స్వాధీనం చేసుకుని నడుపుతున్నారు. దీని కరెంటు బిల్లులు రూ.20.09 లక్షలు కట్టాలని నోటీసులు ఇచ్చిన విద్యుత్ అధికారులు.. బకాయిలు చెల్లించకపోయినా స్పందించలేదు. అనర్హత వేటుపడిన ఈ క్వారీని మైనింగ్ అధికారులు సీజ్ చేయకుండా వదిలేశారు. ఇన్ని ఉల్లంఘనల మధ్య యథేచ్ఛగా నడుస్తున్న ఈ క్వారీలో ఇప్పుడు జేసీబీ డ్రైవర్ మృతి చెందాడు.

ప్రమాదమా? చంపేశారా?

ఈ క్వారీలో ఎర్రగొండేపల్లికి చెందిన చిన్నస్వామి (38) జేసీబీ ఆపరేటర్‌గా చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం జేసీబీ ముందు భాగంలో తొట్టి వద్ద చిన్నస్వామి గ్రీజు వేస్తుండగా సెల్వ అనే వ్యక్తి జేసీబీ క్యాబిన్‌లో కూర్చొన్నాడు. సెల్వ సెల్‌ఫోన్ చూస్తూ గేర్ వేయడంతో జేసీబీ తొట్టి కిందికెళ్లిపోయి, గ్రీజు వేస్తున్న చిన్నస్వామిపై పడిందని, దాని కింద నలిగి అతను మృతి చెందినట్టు చెబుతున్నారు. పోలీసులను పిలవకుండానే మృతదేహాన్ని బైక్‌పై ఆస్పత్రికి తెచ్చారు. క్వారీలో ఉన్న జేసీబీని మాయం చేశారు. దీంతో ఇది ప్రమాదమా లేక ఉద్దేశపూర్వకంగా చిన్నస్వామిని జేసీబీతో కొట్టి చంపేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు కూడా ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్వారీ యజమాని ఆదేశాలతో ఆ ప్రాంతానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులు మృతుడి కుటుంబానికి ఎంతోకొంత పరిహారం చెల్లించి కేసు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేశారు. మృతుల బంధువులు మీడియాతో మాట్లాడకుండా అడ్డుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఏం జరిగిందనేది తెలుస్తుందని పలమనేరు టౌన్ సీఐ చంద్రశేఖర్ చెప్పారు.

అతివేగానికి ఐదు ప్రాణాలు బలి



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పళ్లిపట్టు: తమిళనాడులోని తిరుత్తణికి సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కనకమ్మసత్రం సీఐ రాజగోపాల్ తెలిపిన వివరాల మేరకు.. తిరువళ్లూరు జిల్లా రామంజేరి వద్ద రాత్రి 7 గంటల సమయంలో చెన్నై వైపు అతివేగంగా దూసుకెళ్లిన కారు ఎదురుగా వస్తున్న సరుకుల లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జై అందులోని ఏడుగురు యువకులు ఉండగా ఐదుగురు ఘటనాస్థలంలోనే మరణించారు. గాయపడ్డ ఇద్దరిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు చెన్నై శివారులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నట్లు తెలిసింది. మృతి చెందిన విద్యార్థుల్లో చేతన్ (21), యుగేష్ (21) తిరుపతికి చెందిన వారుగా భావిస్తున్నారు. మిగిలిన వారిలో నితీష్ (21), నితీష్‌వర్మ(21), రామ్ గోపాలన్ (21)గా గుర్తించారు. వీరిలో రామగోపాలన్ తిరువణ్ణామలైకు చెందిన యువకుడు అని తేలింది. గాయపడ్డ ఇద్దరిని తిరుపతి జిల్లా గూడూరు న్యూ బాలాజీ నగర్‌కు చెందిన విష్ణు (21), ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన చైతన్య (21)గా గుర్తించారు. వీరు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మాజీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఇంజినీరింగ్ విద్యార్థులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. వీరి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానన్నారు. ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

PARIS 2024
సాక్షి
సోమవారం
12-8-2024

స్పోర్ట్స్



వెయిట్‌లిఫ్టింగ్‌లో చైనా హవా

పారిస్ ఒలింపిక్స్ వెయిట్‌లిఫ్టింగ్‌లో చైనా ఐదు స్వర్ణాలతో అదరగొట్టింది. చివరిరోజు మహిళల ప్లస్ 81 కేజీల విభాగంలో చైనా లిఫ్టర్ లీ వెన్‌వెన్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. లీ వెన్‌వెన్ మొత్తం 309 కేజీల (స్నాచ్‌లో 136 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 173 కేజీలు) బరువెత్తింది. చైనా తరఫున ఈ క్రీడల్లో హూ జీహుయ్ (49 కేజీలు), షిఫాంగ్ లువో (59 కేజీలు), లీ ఫాబిన్ (61 కేజీలు), లీ హువాన్‌హువా (102 కేజీలు) కూడా పసిడి పతకాలు సాధించారు.

డయానా టురాసి 'సిక్సర్'

ఒలింపిక్స్ బాస్కెట్‌బాల్‌లో అమెరికా క్రీడాకారిణి డయానా టురాసి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. వరుసగా ఆరు స్వర్ణ పతకాలు సాధించిన ఏకైక బాస్కెట్‌బాల్ ప్లేయర్‌గా ఆమె గుర్తింపు పొందింది. ఆదివారం జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ ఫైనల్లో అమెరికా 67–66తో ఫ్రాన్స్‌ను ఓడించి విజేతగా నిలిచిన జట్టులో డయానా సభ్యురాలిగా ఉంది. 42 ఏళ్ల డయానా 2004 ఏథెన్స్, 2008 బీజింగ్, 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లోనూ పసిడి పతకాలు గెలిచిన అమెరికా బాస్కెట్‌బాల్ జట్టులోనూ సభ్యురాలిగా ఉంది.



పతకాల పట్టిక

ర్యాం	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	40	44	42	126
2	చైనా	40	27	24	91
3	జపాన్	20	12	13	45
4	ఆస్ట్రేలియా	18	19	16	53
5	ఫ్రాన్స్	16	26	22	64
6	నెదర్లాండ్స్	15	7	12	34
7	బ్రిటన్	14	22	29	65
8	దక్షిణ కొరియా	13	9	10	32
9	ఇటలీ	12	13	15	40
10	జర్మనీ	12	13	8	33
11	న్యూజిలాండ్	10	7	3	20
12	కెనడా	9	7	11	27
13	ఉజ్బెకిస్తాన్	8	2	3	13
14	హంగేరి	6	7	6	19
15	స్పెయిన్	5	4	9	18
16	స్వీడన్	4	4	3	11
17	కెన్యా	4	2	5	11
18	నార్వే	4	1	3	8
19	ఐర్లాండ్	4	0	3	7
20	బ్రెజిల్	3	7	10	20
21	ఇరాన్	3	6	3	12
22	ఉక్రెయిన్	3	5	4	12
23	రొమేనియా	3	4	2	9
24	జార్జియా	3	3	1	7
25	బెల్జియం	3	1	6	10
26	బల్గేరియా	3	1	3	7
27	సెర్బియా	3	1	1	5
28	చెక్ రిపబ్లిక్	3	0	2	5
29	డెన్మార్క్	2	2	5	9
30	అజర్‌బైజాన్	2	2	3	7
30	క్రొయేషియా	2	2	3	7
32	క్యూబా	2	1	6	9
33	బహ్రెయిన్	2	1	1	4
34	స్లొవేనియా	2	1	0	3
35	చైనీస్ తైపీ	2	9	5	7
36	ఆస్ట్రియా	2	0	3	5
37	హాంకాంగ్	2	0	2	4
37	ఫిలిప్పీన్స్	2	0	2	4
39	అల్జీరియా	2	0	1	3
39	ఇండోనేసియా	2	0	1	3
41	ఇజ్రాయిల్	1	5	1	7
42	పోలాండ్	1	4	5	10
43	కజకిస్తాన్	1	3	3	7
44	జమైకా	1	3	2	6
44	దక్షిణాఫ్రికా	1	3	2	6
44	థాయ్‌లాండ్	1	3	2	6
47	ఇథియోపియా	1	3	0	4
48	స్విట్జర్లాండ్	1	2	5	8
49	ఈక్వెడార్	1	2	2	5
50	పోర్చుగల్	1	2	1	4
51	గ్రీస్	1	1	6	8
52	అర్జెంటీనా	1	1	1	3
52	ఈజిప్ట్	1	1	1	3
52	ట్యునీషియా	1	1	1	3
55	బోట్స్‌వానా	1	1	0	2
55	చిలీ	1	1	0	2
55	సెయింట్ లూసియా	1	1	0	2
55	ఉగాండా	1	1	0	2
59	డొమినికన్ రిపబ్లిక్	1	0	2	3
60	గ్వాటెమాలా	1	0	1	2
60	మొరాకో	1	0	1	2
62	డొమినికా	1	0	0	1
62	పాకిస్తాన్	1	0	0	1
64	టర్కీ	0	3	5	8
65	మెక్సికో	0	3	2	5
66	అర్మేనియా	0	3	1	4
66	కొలంబియా	0	3	1	4
68	కిర్గిస్తాన్	0	2	4	6
68	ఉత్తర కొరియా	0	2	4	6
70	లిథువేనియా	0	2	2	4
71	భారత్	0	1	5	6
72	మాల్డోవా	0	1	3	4
73	కొసోవో	0	1	1	2
74	సైప్రస్	0	1	0	1
74	ఫిజీ	0	1	0	1
74	జోర్డాన్	0	1	0	1
74	మంగోలియా	0	1	0	1
74	పనామా	0	1	0	1
79	తజకిస్తాన్	0	0	3	3
80	అల్బేనియా	0	0	2	2
80	గ్రెనెడా	0	0	2	2
80	మలేసియా	0	0	2	2
80	ప్యూర్టోరికా	0	0	2	2
84	ఐవరీకోస్ట్	0	0	1	1
84	కాబో వెర్డె	0	0	1	1
84	రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్	0	0	1	1
84	పెరూ	0	0	1	1
84	ఖతార్	0	0	1	1
84	సింగపూర్	0	0	1	1
84	స్లొవేకియా	0	0	1	1
84	జాంబియా	0	0	1	1

నోట్: ర్యాం- ర్యాంక్, స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

ఏడు నుంచి ఆరుకు... 48 నుంచి 71కి..!

పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపర్చిన భారత బృందం

టోక్యో ఒలింపిక్స్ ముగిసిన వెంటనే భారత ఆటగాళ్ల సన్నాహాలు మొదలయ్యాయి. సాధారణంగా ఉండే నాలుగేళ్లతో పోలిస్తే ఒక ఏడాది తక్కువ సమయం ఉండటంతో అన్ని క్రీడల్లోనూ పారిస్ లక్ష్యంగానే హడావిడి కనిపించింది. అధికారులు, ప్రభుత్వం కూడా రెండంకెల పతకాలు ఖాయమంటూ నమ్మకం పెట్టుకున్నాయి. అందుకు తగినట్లుగా ఈసారి కేంద్ర ప్రభుత్వం కూడా అండగా నిలిచింది. అథ్లెట్ల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకుండా ఒలింపిక్స్ సన్నద్ధత కోసమే 16 క్రీడాంశాల్లో సౌకర్యాల కల్పన, విదేశాల్లో ప్రత్యేక శిక్షణ, పోటీల్లో పాల్గొనేందుకు రూ. 470 కోట్లు ఖర్చు కూడా చేసింది. 117 మందితో మన బృందం బరిలోకి దిగింది. అద్భుతాల గురించి కాకపోయినా ఎక్కువ మంది కచ్చితంగా బాగా ఆడతారనే అంచనాలు, ఆశలు మాత్రం అందరిలోనూ ఉన్నాయి. కానీ ఒక్కో రోజు కరుగుతున్న కొద్దీ పరిస్థితి మారిపోతూ వచ్చింది. పతకం కోసం ఎంతో ఎదురు చూడాల్సిన స్థితి. చివరకు ఒక రజతం, ఐదు కాంస్యాలతో మన టీమ్ ముగించింది. గత ఒలింపిక్స్‌తో పోలిస్తే పతకాల సంఖ్య తగ్గడమే కాదు... స్వర్ణం కూడా లేకపోవడంతో పతకాల పట్టికలో కూడా భారత్ చాలా దిగువకు పడిపోయింది.

–సాక్షి క్రీడా విభాగం

పారిస్: అథ్లెటిక్స్‌లో భారత మహిళల 4x400 రిలే జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో 3 నిమిషాల 32.51 సెకన్ల టైమింగ్ నమోదు చేసింది... ఇదే ఈవెంట్‌లో 1984 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో భారత బృందం టైమింగ్ 3 నిమిషాల 32.49 సెకన్లు మాత్రమే! అంటే 40 సంవత్సరాల తర్వాత కూడా మన జట్టు టైమింగ్ మెరుగుకాకపోగా, అంతకంటే పేలవంగా రిలే టీమ్ ముగించింది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు, విదేశాల్లో శిక్షణ, మంచి డైట్ వంటివి మాత్రమే ఫలితాన్ని ఇవ్వలేవనే దానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. నిజాయితీగా చెప్పాలంటే అథ్లెటిక్స్‌లో మన ఆటగాళ్ల విషయంలో పెద్దగా అంచనాలు లేవు కానీ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మేమూ ఉన్నామని గుర్తు చేసే కనీస స్థాయి ప్రదర్శన కూడా రాలేదు. మొత్తం 29 మంది అథ్లెట్లు పాల్గొంటే జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఒక్కడే తన స్థాయిని ప్రదర్శించాడు. భారత ప్రదర్శన విషయంలో ఈ ఒక్క క్రీడాంశాన్నే విమర్శించడానికి లేదు. ఓవరాల్‌గా కూడా టోక్యో ఒలింపిక్స్ ప్రదర్శనను దాటలేకపోగా, అది పునరావృతం కూడా కాలేదు. ప్రతీ ఒలింపిక్స్ తర్వాత జరిగే సమీక్ష తరహాలోనే ఈసారి కూడా దాదాపు అవే కారణాలు. మన ప్రమాణాలు బాగా పెరిగాయని చెప్పుకోవడమే తప్ప అసలైన సమయంలో పోటీకి దిగినప్పుడు ఇంకా మనం చాలా అంశాల్లో వెనుకబడి ఉన్నామని తేలిపోయింది. చాలా మంది భారత ఆటగాళ్లకు ఒలింపిక్స్‌లో పాల్గొనడమే ఒక ఘనతగా కనిపిస్తోంది తప్ప అంతకు మించి ముందుకు వెళ్లడం సాధ్యం కావడం లేదు. 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో 43 మంది పాల్గొంటే 41వ స్థానంలో నిలిచిన ప్రియాంక గోస్వామి గేమ్స్ విలేజ్ గదిలో సరదాగా 'రీల్స్' చేస్తున్న వీడియో చూస్తే ఆమె తన ఆట పట్ల ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతుంది. తాము అడిగిన కోచ్‌లు, ఫిజియోలు... తాము కోరిన చోట శిక్షణ... ఇలా ఒక్కటేమిటి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలిచింది. అయినా మెడల్స్ విషయంలో మన రాత మారలేదంటే లోపం ఆటగాళ్లలోనే ఉన్నట్లు అర్థం. తమకు సౌకర్యాలు లేవనే మాట ఇకపై ఆటగాళ్ల నుంచి రాకూడదని... ప్లేయర్లు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకోన్ చేసిన వ్యాఖ్య ఈ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్లందరికీ వర్తిస్తుంది.

పతకవీరులు...

టోక్యోలో 19 ఏళ్ల టీనేజర్‌గా బరిలోకి దిగి తీవ్రంగా నిరాశపర్చిన షూటర్ మనూ భాకర్ ఈసారి నాటి తప్పులను సరిదిద్దుకుంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు కాంస్యాలు గెలిచి తనను తాను నిరూపించుకుంది. మిక్స్‌డ్‌లో ఆమె భాగస్వామిగా సరబ్‌జోత్ సింగ్ కూడా కాంస్యాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అనూహ్యంగా స్వప్నిల్ కుసాలే మూడో స్థానంలో నిలవడంతో భారత్ ఖాతాలో మూడో కాంస్యం చేరింది. భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ కాంస్యం సాధించడం మన అభిమానులకు ఊరట కాగా... యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ కూడా కంచు మోత మోగించి తానేంటో చూపించాడు. అయితే పట్టికలో భారత్ స్థానాన్ని పైకి చేర్చగల స్వర్ణం మాత్రం మనకు రాలేదు. 'టోక్యో' పసిడితో సత్తా చాటిన నీరజ్ చోప్రా గత మూడేళ్ల ప్రదర్శనను చూస్తే ఈసారి గోల్డ్ ఖాయమనిపించింది. అయితే దురదృష్టవశాత్తూ అది చేజారినా... రజతంతో కాస్త మెరుగైన పతకం మన ఖాతాలో చేరింది. వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో మెడల్స్ గెలిచిన అరుదైన జాబితాలో నీరజ్ చేరగా... ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో మనూ భాకర్ తన కీర్తిని పెంచుకుంది.

అంచనా తప్పారు...

టోక్యో ఒలింపిక్స్ ముగిసిన తర్వాతి నుంచి ప్రదర్శన, తాజా ఫామ్, ఆటగాళ్ల స్థాయిని బట్టి చూసుకుంటే కొందరు ఆటగాళ్లు తీవ్రంగా నిరాశ పర్చారు. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు విఫలం కాగా... కచ్చితంగా పతకం సాధిస్తారనుకున్న డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్లోనే పరాజయంపాలయ్యారు. బాక్సింగ్ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, వరల్డ్ రికార్డు ఉన్న షూటర్ సిఫ్ట్ కౌర్ సామ్రా కనీసం పతకానికి చేరువగా కూడా రాలేకపోవడం గమనార్హం. బాక్సింగ్‌లో నిశాంత్ దేవ్, అమిత్ పంఘాల్ కూడా అంచనా తప్పగా... గత ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ కూడా క్వార్టర్ ఫైనల్లోనే ఓడింది. ఇక ఆర్చరీ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. నాలుగో ఒలింపిక్స్‌లో కూడా దీపిక కుమారి ఉత్త చేతులతోనే తిరిగొచ్చింది. ఇక టేబుల్ టెన్నిస్, జూడో, స్విమ్మింగ్, రోయింగ్, సెయిలింగ్, గోల్ఫ్, ఈక్వెస్ట్రియన్‌లు మనం పతకాలు ఆశించే క్రీడలు కావు. టెన్నిస్‌లో రోహన్ బోపన్న తన ఏటీపీ టోర్నీల స్థాయి ఆట ఇక్కడ ప్రదర్శించలేకపోయాడు.

నాలుగో స్థానాలతో సరి...

విజయం సాధించిన వాడినే ప్రపంచం గుర్తుంచుకుంటుంది. రెండో స్థానానికి కూడా విలువుండదు... స్పోర్ట్స్‌లో మోటివేషనల్ స్పీచ్‌లు ఇచ్చేటప్పుడు చాలా మంది తరచుగా వాడే మాట ఇది. కానీ మన భారతీయులు ఇప్పుడు నాలుగో స్థానాన్ని చూసి కూడా అయ్యో... కొద్దిలో చేజారిందే అనుకుంటున్నాం. ఇది ఏదో ఆత్మ సంతృప్తి కోసమే తప్ప ఒలింపిక్స్‌లో నాలుగో స్థానానికి ఎలాంటి విలువ లేదు. అదృష్టం కలిసొస్తే మరో ఆరు పతకాలు మన ఖాతాలో చేరేవేమో కానీ అలాంటి వాటికి ఆటల్లో చోటు లేదు. మనూ భాకర్, అర్జున్ బబూతా, మహేశ్వరి–అనంత్‌జీత్ జోడీ (షూటింగ్), మీరాబాయి చాను (వెయిట్‌లిఫ్టింగ్), లక్ష్య సేన్ (బ్యాడ్మింటన్), బొమ్మదేవర ధీరజ్–అంకిత జోడీ (ఆర్చరీ) అసలు సమయంలో తమ ఆట స్థాయిని పెంచలేకపోయారు. చివరగా... గెలుపు కూడా ఓటమిగా మారిన వైనం వినేశ్ ఫొగాట్ విషయంలో జరిగింది. ఫైనల్ చేరిన తర్వాత వచ్చిన పతకం బరువు ఎక్కువై చేజారడం వినేశ్‌కే కాదు భారతీయులందరికీ వేదన కలిగించింది.







అర్జున్ బబూతా | మనూ భాకర్ | మహేశ్వరి-అనంత్‌జీత్ | లక్ష్య సేన్ | మీరాబాయి చాను | ధీరజ్-అంకిత | వినేశ్ ఫొగాట్



'రికార్డ్స్'తో ముగిసిన క్రీడా సంబరం

- 2024 పారిస్ ఒలింపిక్స్‌కు తెర
- ఘనంగా ముగింపు ఉత్సవం
- లాస్ ఏంజెలిస్‌లో 2028 ఒలింపిక్స్

పారిస్: అద్భుత ప్రదర్శనలతో అసామాన్య ఘనతలతో అత్యుత్తమ వేదికగా నిలిచిన పారిస్ ఒలింపిక్స్‌కు తెర పడింది. 16 రోజుల పాటు 329 క్రీడాంశాల్లో ఆటగాళ్లు పతకాల కోసం హోరాహోరీగా పోటీ పడిన తర్వాత 2024 ఒలింపిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి భిన్నంగా పారిస్ నేషనల్ స్టేడియంలో సుమారు 70 వేల మంది ప్రేక్షకుల మధ్య ఈ ముగింపు వేడుకలు జరిగాయి. థామస్ జాలీ నేతృత్వంలో ముగింపు ఉత్సవాలను 'రికార్డ్స్' పేరుతో నిర్వహించారు. ఫ్రాన్స్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ క్రీడా జ్యోతిని తీసుకొని వేదిక వద్దకు రాగా... ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్, ఐఓసీ చైర్మన్ థామస్ బాక్ వేదికపై కూర్చున్నాడు. ఫ్రాన్స్ జాతీయ గీతాన్ని వినిపించిన తర్వాత అన్ని దేశాల ఫ్లాగ్‌బేరర్లు తమ జాతీయ పతాకాలతో స్టేడియంలోకి అడుగుపెట్టారు. భారత్ తరఫున మనూ భాకర్, పీఆర్ శ్రీజేశ్ పతాకధారులుగా వ్యవహరించారు. వచ్చే ఒలింపిక్స్ 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్ నగరంలో జరగనున్న నేపథ్యంలో పారిస్ క్రీడల నిర్వాహకులు ఒలింపిక్ ఫ్లాగ్‌ను లాస్ ఏంజెలిస్ క్రీడల చైర్‌పర్సన్ కేసీ వాసర్‌మన్‌కు అందజేశారు. ఫ్రెంచ్ భాషలో 'మెర్సీ పారిస్' (థ్యాంక్యూ పారిస్) నినాదాలు హోరెత్తుతుండగా ఆఖరి ఘట్టం ముగిసింది.



సూపర్ సిఫాన్...

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు గెలిచిన నెదర్లాండ్స్ మహిళా అథ్లెట్ సిఫాన్ హసన్ 'పారిస్'లోనూ మూడు పతకాలతో మెరిసింది. 'పారిస్'లో ఇప్పటికే 5000 మీటర్లు, 10000 మీటర్ల విభాగాల్లో కాంస్య పతకాలు సాధించిన 31 ఏళ్ల సిఫాన్... ఆదివారం జరిగిన మారథాన్ రేసులో ఏకంగా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 42.195 కిలోమీటర్ల దూరాన్ని సిఫాన్ 2 గంటల 22 నిమిషాల 55 సెకన్లలో అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా పూర్తి చేసి కొత్త ఒలింపిక్ రికార్డును నమోదు చేసింది. 2012 లండన్ గేమ్స్‌లో 2 గంటల 23 నిమిషాల 7 సెకన్లతో జెలెనా టికి (ఇథియోపియా) నెలకొల్పిన ఒలింపిక్ రికార్డును సిఫాన్ సవరించింది. తాజా విజయంతో సిఫాన్ కొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో డిస్టెన్స్ రన్నింగ్ (5000, 10000 మీటర్లు, మారథాన్)లోని మూడు ఈవెంట్లలో పతకాలు గెలిచిన తొలి మహిళా అథ్లెట్‌గా సిఫాన్ గుర్తింపు పొందింది. పురుషుల్లో ఎమిల్ జటోపెక్ (చెక్ రిపబ్లిక్; 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో... 5000, 10000 మీటర్లు, మారథాన్) మూడు స్వర్ణ పతకాలు గెలిచాడు.

డిస్టెన్స్ రన్నింగ్ మూడు విభాగాల్లోనూ పతకాలు నెగ్గిన తొలి మహిళా అథ్లెట్‌గా ఘనత



పతకాల సంఖ్య ప్రామాణికం కాదు

నీరజ్ చోప్రా

పారిస్ ఒలింపిక్స్ ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. గతంతో పోలిస్తే జావెలిన్‌ను ఎక్కువ దూరం విసిరి రజతం గెలవడం ఆనందంగా ఉంది. అయితే విశ్వ క్రీడా వేదికపై మన జాతీయ గీతం వినడాన్ని ఎక్కువ సంతోషిస్తా. మరింత మెరుగవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. దాని కోసం కృషి చేస్తా. ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం గెలిచిన సమయంలో అభిమానుల నుంచి లభించిన మద్దతును ఎప్పటికీ మరవలేను. నాతో పాటు.. మన అథ్లెట్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రేరణ నింపారు. 'పారిస్' క్రీడల్లో భారత ప్రదర్శనను అంచనా వేయడానికి కేవలం పతకాల సంఖ్య ప్రామాణికం కాదు. చాలా మంది త్రుటిలో పతకాలను కోల్పోయారు. ఆ స్థాయికి రావడానికి వారు పడ్డ శ్రమను తక్కువ చేయలేము. హాకీ జట్టులోని 16 మంది సభ్యులతో పాటు మొత్తం 21 మంది అథ్లెట్లు పారిస్ నుంచి పతకాలతో తిరిగి వస్తున్నారు. మొత్తంగా ఈ క్రీడల్లో మన అథ్లెట్లు ఆరు విభాగాల్లో నాలుగో స్థానాల్లో నిలిచారు. మరొకదాంట్లో అనర్హత వేటుకు గురయ్యారు. 1960 ఒలింపిక్స్‌లో దిగ్గజ అథ్లెట్ మిల్కా సింగ్, 1984 క్రీడల్లో పీటీ ఉష ఇలాగే నాలుగో స్థానంలో నిలిచి... యువతకు మార్గదర్శకులు అయ్యారు. ఇప్పుడు తాజా ఒలింపిక్స్‌లో పతకం సాధించగల ఏడుగురు అథ్లెట్లు... వివిధ క్రీడాంశాల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న మరో 15 మంది అథ్లెట్లు మన బృందంలో ఉన్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో ఏడు పతకాలు సాధించినప్పుడు... మరో ఇద్దరు మాత్రమే నాలుగో స్థానంలో నిలిచారు. అప్పటితో పోల్చితే ఇప్పుడా సంఖ్య భారీగా పెరిగింది. క్రీడా సంస్కృతి పెరుగుదలకు ఇది నిదర్శనం. దేశంలో క్రీడారంగంపై భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభమైంది. అథ్లెట్లకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు లభిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాలుగో స్థానాలను పతకాలుగా మలచగలమనే నమ్మకం ఉంది. అర్జున్ బబూతా, అంకిత, బొమ్మదేవర ధీరజ్, మహేశ్వరీ చౌహాన్, అనంత్‌జీత్ సింగ్, మనూ భాకర్, వినేశ్ ఫొగాట్ ఇలా వీళ్లంతా త్రుటిలో పతకాలు కోల్పోయారు. అథ్లెట్లు నిరంతరం మెరుగవడంపై దృష్టి పెట్టడం ముఖ్యం. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న మన అథ్లెట్లందరూ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో భాగంగా ఉన్నారు. దీని వల్ల నిపుణుల పర్యవేక్షణలో విదేశీ శిక్షణకు అవకాశం ఉంటుంది. గత మూడేళ్లలో నేను 310 రోజుల పాటు వివిధ దేశాల్లో శిక్షణ పొందాను. దాన్ని సరైన రీతిలో వినియోగించుకుంటే.. మెరుగైన ఫలితాలు సాధించడం పెద్ద కష్టం కాదు.



అమెరికాను బోల్తా కొట్టించి స్వర్ణం గెలిచిన ఇటలీ మహిళల వాలీబాల్ జట్టు

పారిస్ ఒలింపిక్స్‌లో చివరి రోజు సంచలన ఫలితం వచ్చింది. మహిళల వాలీబాల్ ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ అమెరికా జట్టుకు ఊహించని పరాజయం ఎదురైంది. తొలిసారి ఫైనల్ చేరిన ఇటలీ జట్టు 25-18, 25-20, 25-17తో అమెరికా జట్టును ఓడించి మొదటిసారి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ అనంతరం ఇటలీ సీనియర్ క్రీడాకారిణి, నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ మోనికా డి జెనారోను సభ్యులంతా గాల్లో ఎగరేసి సంబరం చేసుకున్నారు. మాజీ చాంపియన్ బ్రెజిల్ 25-21, 27-25, 22-25, 25-15తో టర్కీ జట్టును ఓడించి కాంస్య పతకం సాధించింది. ఫైనల్లో అమెరికా జట్టు ఓడిపోయినా ఒలింపిక్స్ మహిళల వాలీబాల్‌లో అత్యధికంగా ఏడు పతకాలు సాధించిన జట్టుగా అవతరించింది. అమెరికా జట్టు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలు దక్కించుకుంది. సోవియట్ యూనియన్, చైనా, జపాన్, బ్రెజిల్ ఆరు పతకాల చొప్పున నెగ్గాయి.

అమెరికాకే అందలం

మరోసారి పతకాల పట్టికలో అగ్రస్థానం

- వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో ఈ ఘనత
- వరుసగా ఎనిమిదో స్వర్ణం నెగ్గి రికార్డు నెలకొల్పిన అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు

పారిస్: విశ్వ క్రీడల్లో చివరిరోజు ఆఖరి మెడల్ ఈవెంట్‌లో అమెరికా అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. చివరి మెడల్ ఈవెంట్‌గా జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అమెరికా 67-66 పాయింట్ల తేడాతో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టును ఓడించింది. మహిళల బాస్కెట్‌బాల్ జట్టు స్వర్ణ పతకంతో పతకాల పట్టికలో అమెరికా జట్టు టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకోవడం విశేషం. అమెరికా, చైనా జట్లు 40 స్వర్ణ పతకాలతో సమంగా నిలిచాయి. అయితే చైనాకంటే అమెరికా ఎక్కువ రజత పతకాలు, ఎక్కువ కాంస్య పతకాలు సాధించింది. దాంతో అమెరికాకు అగ్రస్థానం దక్కింది. ఫ్రాన్స్ జట్టుతో జరిగిన ఫైనల్లో అమెరికా మహిళల జట్టుకు గట్టిపోటీ ఎదురైంది. ఒకదశలో అమెరికాకు ఓటమి తప్పదా అనిపించింది. ఆఖరి క్వార్టర్‌లో నాలుగు నిమిషాలు మిగిలి ఉన్నంతవరకు ఫ్రాన్స్ 53-52తో ఒక్క పాయింట్ ఆధిక్యంలో ఉంది. ఈ దశలో తమకు లభించిన ఫ్రీ త్రోను అమెరికా పాయింట్‌గా మలిచి స్కోరును 53-53తో సమం చేసింది. ఆ తర్వాత అమెరికా కీలక పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలోకి వెళ్లింది. 17 సెకన్లు మిగిలి ఉన్నాయనగా అమెరికా 63-59తో ముందంజలో నిలిచింది. ఈ దశలో తమకు లభించిన రెండు ఫ్రీ త్రోలను ఫ్రాన్స్ ప్లేయర్ మరీన్ జోన్స్ పాయింట్లుగా మలిచింది. దాంతో అమెరికా ఆధిక్యం 63-61గా మారింది. 11 సెకన్లు ఉన్నాయనగా అమెరికా ప్లేయర్ కెల్సీ ప్లమ్ రెండు పాయింట్లు సాధించి 65-61తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఐదు సెకన్లు ఉన్నాయనగా ఫ్రాన్స్ ప్లేయర్ గ్యాబీ విలియమ్స్ మూడు పాయింట్ల షాట్ సంధించడంతో అమెరికా ఆధిక్యం 65-64కు తగ్గింది. మూడు సెకన్లు ఉన్నాయనగా ఫ్రాన్స్ ప్లేయర్ ఫౌల్ చేయడంతో అమెరికాకు రెండు ఫ్రీ త్రోలు రావడం, వాటిని పాయింట్లుగా మలచడం జరిగింది. దాంతో అమెరికా 67-64తో ముందంజలోకి వెళ్లింది. చివరి క్షణంలో ఫ్రాన్స్ ప్లేయర్ మరీన్ జోన్స్ రెండు పాయింట్లు సాధించినా ఆతిథ్య జట్టు పాయింట్ తేడాతో ఓటమి చవిచూసింది. అమెరికా జట్టులో విల్సన్ అజా 21 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలువగా... కెల్సీ ప్లమ్, కాపర్ కాలీ 12 పాయింట్ల చొప్పున సాధించారు. ఈ గెలుపుతో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు ఒలింపిక్స్‌లో వరుసగా ఎనిమిదో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఓవరాల్‌గా అమెరికా మహిళల జట్టుకిది పదో స్వర్ణం. 1984 లాస్ ఏంజెలిస్, 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్వర్ణాలు నెగ్గిన అమెరికా జట్టు 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించింది. ఆ తర్వాత 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో అమెరికా మహిళల జట్టు పసిడి పతకాల వేట మళ్లీ మొదలై 2024 పారిస్ ఒలింపిక్స్ వరకు కొనసాగుతూనే ఉంది.

మరోవైపు శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన పురుషుల బాస్కెట్‌బాల్ ఫైనల్లో అమెరికా జట్టు 98-87 పాయింట్ల తేడాతో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టుపై గెలిచి ఓవరాల్‌గా 17వసారి పసిడి పతకాన్ని దక్కించుకుంది. అమెరికా జట్టులో స్టీఫెన్ కర్రీ త్రీ పాయింటర్ షాట్‌లను ఎనిమిదిసార్లు వేయడం విశేషం. దిగ్గజ ప్లేయర్లు కెవిన్ డురాంట్ 15 పాయింట్లు, లెబ్రాన్ జేమ్స్ 14 పాయింట్లు, డేవిడ్ బుకెర్ 15 పాయింట్లు సాధించారు.

14 అమెరికా సాధించిన స్వర్ణాల సంఖ్యలో అత్యధికంగా అథ్లెటిక్స్ నుంచి 14 పసిడి పతకాలు లభించాయి. ఆ తర్వాత స్విమ్మింగ్‌లో 8, జిమ్నాస్టిక్స్‌లో 3, బాస్కెట్‌బాల్, సైక్లింగ్ ట్రాక్, ఫెన్సింగ్, రెజ్లింగ్‌లో 2 చొప్పున స్వర్ణాలు దక్కాయి. సైక్లింగ్ రోడ్, ఫుట్‌బాల్, గోల్ఫ్, రోయింగ్, షూటింగ్, సర్ఫింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక్కో స్వర్ణం చొప్పున లభించాయి.

19 ఇప్పటి వరకు 30 సార్లు ఒలింపిక్స్ క్రీడలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 19 సార్లు అమెరికా జట్టు పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. సోవియట్ యూనియన్ ఆరుసార్లు టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. యూనిఫైడ్ టీమ్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా, జర్మనీ ఒక్కోసారి మొదటి స్థానంలో నిలిచాయి.



స్వర్ణాలతో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు



స్వర్ణాలతో అమెరికా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు

లిన్ యూ టింగ్ పంచ్ అదిరె...

స్వర్ణం నెగ్గిన చైనీస్ తైపీ వివాదాస్పద మహిళా బాక్సర్

పారిస్ ఒలింపిక్స్‌లో లింగ వివాదాన్ని ఎదుర్కొన్న మరో బాక్సర్ స్వర్ణంతో సత్తా చాటింది. మహిళల 57 కేజీల విభాగంలో చైనీస్ తైపీ బాక్సర్ లిన్ యూ టింగ్ పసిడి పతకం కైవసం చేసుకుంది. ఫైనల్లో లిన్ యూ టింగ్ 5-0తో జూలియా (పోలాండ్)పై గెలిచింది. అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమాన్ ఖలీఫ్ పతకం సాధించిన మరుసటి రోజే లిన్ యూ టింగ్ కూడా మెడల్‌తో మెరిసింది. బాక్సింగ్‌లో చైనీస్ తైపీకిదే తొలి ఒలింపిక్ స్వర్ణం కావడం విశేషం. 'పారిస్' క్రీడల ఆరంభం నుంచే సూటిపోటి మాటలు ఎదుర్కొన్న లిన్ యూ టింగ్ బహుమతి ప్రదానోత్సవం సమయంలో కన్నీటి పర్యంతమైంది. ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగుతూ.. తాను పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కిందని పేర్కొంది. 'ప్రత్యర్థితోనే కాదు.. పరిస్థితులపై కూడా గెలిచా. ఓ ప్రొఫెషనల్ బాక్సర్‌గా ఒలింపిక్స్ సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ లక్ష్యంపైనే దృష్టి పెట్టా. అయినా కోచ్ ద్వారా కొన్ని వార్తలు వినాల్సి వచ్చేది. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఆహ్వానంతోనే పారిస్‌లో అడుగుపెట్టా. అలాంటప్పుడు వచ్చిన పని వదిలేసి అనవసర విషయాలను దరి చేరనివ్వలేదు. పూర్తి ఏకాగ్రత బౌట్‌పైనే పెట్టా. ఈ పతకంతో ఇన్నాళ్ల పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లు అయింది. నాకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు' అని లిన్ యూ టింగ్ వెల్లడించింది.



గతేడాది జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లిన్‌తో పాటు ఖలీఫ్‌పై అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం వేటు వేసింది. ఈ ఇద్దరిలో పురుషులకు చెందిన జన్యువులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటూ... లిన్ సాధించిన కాంస్యాన్ని సైతం రద్దు చేసింది. దీంతో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గడమే లక్ష్యంగా బరిలోకి దిగిన లిన్... విశ్వక్రీడల ఆరంభం నుంచే ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ చివరకు చాంపియన్‌గా నిలిచింది.

'భారత్‌కు స్వదేశీ కోచ్ ఉంటేనే మేలు'



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టుకు భవిష్యత్తులో స్వదేశీ కోచ్ ఉంటేనే బాగుంటుందని భారత జట్టు కొత్త హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ అభిప్రాయపడ్డారు. ఇగోర్ స్టిమాక్ స్థానంలో స్పెయిన్‌కు చెందిన 55 ఏళ్ల మార్క్వెజ్‌ను ఇటీవల హెడ్ కోచ్‌గా నియమించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'స్పెయిన్ తర్వాత ఎక్కువగా గడిపింది భారత్‌లోనే. అందుకేనేమో కొన్నేళ్ల క్రితం భారత్‌కు హెడ్ కోచ్ కావాలని గట్టిగా అనుకున్నాను. అది అప్పుడు కల. కానీ ఇప్పుడు ఆ కల నిజమైనందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు. అయితే భారత్ భిన్న రాష్ట్రాల సమ్మిళితం కాబట్టి స్వదేశీ కోచ్ ఉంటేనే బాగుంటుందని, స్థానిక భాషలు, అంశాలపై ఆయనకు పట్టు ఉంటుందని మార్క్వెజ్ వివరించారు. 'భారత్ కోచ్‌గా జట్టు స్థాయి పెంచడమే మా లక్ష్యం. వ్యక్తిగతంగా ఆటగాళ్లు, సమష్టిగా జట్టు మెరుగయ్యేందుకు ప్రణాళికలు రచిస్తాం. ఇప్పటికిప్పుడు దీని ఫలితాలు రాకపోవచ్చు. దీనికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుత లక్ష్యమైతే ఆసియా కప్-2027కు అర్హత సాధించడం. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌కు ముందు భారత్ ఆరేడు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతుంది' అని అన్నారు.

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-వెస్ట్ సెంట్రల్ రైల్వేలో 3,317 యాక్ట్ అప్రెంటిస్‌లు

జబల్‌పూర్(మధ్యప్రదేశ్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-వెస్ట్ సెంట్రల్ రైల్వే డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు:** జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,317.
» **ట్రేడ్‌లు:** ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్‌మ్యాన్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 05.08.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.09.2024
» **వెబ్‌సైట్:** https://wcr.indianrailways.gov.in

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్-2024-25

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను నిర్వహిస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా స్కాలర్ షిప్‌ను అందిస్తోంది. ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ విభాగం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **స్కాలర్‌షిప్ వివరాలు:** ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12,000 అందజేస్తారు. ఇది తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది.

అర్హత

» ఏడో తరగతిలో 55 శాతం మార్కులు పొందిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి.
» ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి.
» విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా విద్యార్థులను స్కాలర్‌షిప్‌కు ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష:** ఈ స్కాలర్‌షిప్స్‌కు అర్హులైన అభ్యర్థులను ఎంపికచేసేందుకు రాష్ట్ర స్థాయిలో రెండు పేపర్ల రాతపరీక్షలు నిర్వహిస్తారు.
» **పరీక్ష విధానం:** మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్): మొత్తం 90 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 90 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు.
» **స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్):** మొత్తం 90 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 90 ప్రశ్నలు ఉంటాయి. 7, 8 తరగతుల స్థాయిలో సోషల్, సైన్స్, మ్యాథ్స్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ లేదు.
» **దరఖాస్తు విధానం:** రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా స్కూళ్లు సమర్పించాలి. తర్వాత ఆ దరఖాస్తుల ప్రింటవుట్లను, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.09.2024
» **ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరితేది:** 06.09.2024.
» **పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరితేది:** 10.09.2024.
» **దరఖాస్తు ఫారాలు, ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేసేందుకు చివరితేది:** 10.09.2024.
» **డీఈవో లాగిన్‌లో దరఖాస్తు ఆమోదం పొందేందుకు చివరితేది:** 15.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.bse.ap.gov.in

సర్కారీ బ్యాంకులో పీఓ కొలువు!

» ఐబీపీఎస్ పీఓ/ఎంటీ నోటిఫికేషన్ విడుదల
» ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4,455 పోస్టులు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

బ్యాంకింగ్ రంగంలో ఆఫీసర్ కెరీర్ కోరుకునే అభ్యర్థులకు శుభవార్త! ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్స్‌గా కొలువుదీరే అవకాశం స్వాగతం పలుకుతోంది! అందుకు మార్గం.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) ప్రొబేషనరీ ఆఫీసర్స్/మేనేజ్‌మెంట్ ట్రైనీస్ నోటిఫికేషన్!! మొత్తం 4,455 పీఓ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో..ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ ప్రొబేషనరీ ఆఫీసర్స్/మేనేజ్‌మెంట్ ట్రైనీస్-14 పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఆరు బ్యాంకుల్లో 4,455 పోస్టులు

ఐబీపీఎస్ సీఆర్‌పీ ఫర్ పీఓ/ఎంటీ (14)-2025-26 ప్రక్రియ ద్వారా ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 4,455 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో బ్యాంక్ ఆఫ్ ఇండియా-885 పోస్టులు, కెనరా బ్యాంక్-750 పోస్టులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-2,000 పోస్టులు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్-260 పోస్టులు, పంజాబ్ నేషనల్ బ్యాంక్-200 పోస్టులు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్-360 పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే నాటికి బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ల నుంచి కూడా ఖాళీల వివరాలు ఐబీపీఎస్‌కు చేరే అవకాశం ఉంది.దీంతో..ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే నాటికి పోస్టులసంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది.

అర్హతలు

ఆగస్ట్21, 2024 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

ఆగస్ట్ 1, 2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీల అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పీఓ/ఎంటీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ఐబీపీఎస్ మూడు దశల్లో జరుపుతుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ. వీటిలో ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్‌లను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షల్లో ప్రతిభ చూపి నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అందులోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఖరారవుతుంది.

వంద మార్కులకు ప్రిలిమ్స్

పీఓ/ఎంటీ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్షను మూడు విభాగాల్లో వంద మార్కులకు నిర్వహిస్తారు. అవి..ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట.

ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దిష్ట కటాఫ్ మార్కులను నిర్ణయిస్తుంది. ఆ కటాఫ్ మార్కుల జాబితాలో నిలిచిన వారికి మెయిన్ ఎగ్జామినేషన్‌కు అర్హత లభిస్తుంది. ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున(1:10 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు.

200 మార్కులకు మెయిన్ పరీక్ష

రెండో దశలో మెయిన్ పరీక్షను నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 45 ప్రశ్నలు-60 మార్కులు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు-40 మార్కులు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 35 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగాను ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే) విభాగం పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో ఒక ఎస్సే, ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 25. పరీక్ష సమయం 30 నిమిషాలు. ఇది అభ్యర్థుల ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరిశీలించే పరీక్ష.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామినేషన్‌లో పొందిన మార్కులు ఆధారంగా.. సెక్షన్‌ల వారీ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను నిర్దేశించి ఆ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు వంద. ఇందులో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

వెయిటేజీ విధానం

తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తున్నారు. మెయిన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలకు నిర్దేశిత వెయిటేజీలు పేర్కొన్నారు. మెయిన్ పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీని నిర్దేశించారు. మొత్తంగా వంద మార్కులకు వెయిటేజీలను క్రోడీకరించి.. తుది విజేతల జాబితాను సిద్ధం చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్ట్ 21.
- **ప్రిలిమినరీ పరీక్ష:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **మెయిన్ పరీక్ష:** నవంబర్‌లో జరిపే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in

రాత పరీక్షల్లో రాణించేలా

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేస్తే ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.
- అభ్యర్థుల్లోని విశ్లేషణ సామర్థ్యం, తులనాత్మకను పరిశీలించే డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి జాతీయ ఆర్థిక రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్స్‌ను చదవడం మేలు చేస్తుంది.
- డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ కోసం కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
12-8-2024

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	పెరుగుదల	ముగింపు
సెన్సెక్స్ ▲	820	79,706
నిఫ్టీ ▲	251	24,368


విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	16,745	▲	85
డోజోన్స్	39,498	▲	51
ఎఫ్‌టీఎస్ఈ 100	8,168	▲	23
డాక్స్	17,723	▲	42
షాంఘై	2,862	▼	8
నికాయ్	35,025	▲	194

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.58	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.96	108.52
€	యూరో	ఎస్‌బీఐ	90.63	93.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.43	57.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	56.45
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.12	65.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67



ఇలా చేయకుంటే... హెల్త్ క్లెయిమ్ తిరస్కరణ!

- దరఖాస్తులో పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే
- గత ఆరోగ్య సమాచారం వెల్లడించాలి
- మినహాయింపులపై తగిన అవగాహన
- నియమ, నిబంధనలు తెలిసి ఉండాలి
- ఆస్పత్రిలో చేరికపై సకాలంలో సమాచారం
- లేదంటే చెల్లింపులకు నిరాకరణలు

అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే.. ఆదుకుంటుందన్న భరోసాతోనే ఎవరైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటారు. తీరా అవసరం వచ్చినప్పుడు బీమా సంస్థ చెల్లింపులకు నిరాకరిస్తే..? పాలసీదారులు కంగుతినాల్సిందే. కరోనా ఆరోగ్య విషయంలో ఎంతో మందికి కళ్లు తెరిపించింది. ఆ ఫలితమే తర్వాత నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా పాలసీ నిబంధనలను కచ్చితంగా తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. పాలసీ నిబంధనలను అర్థం చేసుకోవడంలో లోపం చోటుచేసుకుంటే, భవిష్యత్తులో క్లెయిమ్‌లు తిరస్కరణకు గురయ్యే రిస్క్ కచ్చితంగా ఉంటుంది. దీనివల్ల ఒక్కసారిగా కుటుంబంపై ఆర్థిక భారం పడిపోతుంది. బీమా సంస్థ చెల్లింపులు చేయకపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. వీటి పట్ల అవగాహన కలిగి ఉంటే, అలాంటి పరిస్థితులను నివారించొచ్చు. ఈ వివరాలు అందించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పాలసీ దరఖాస్తు పత్రంలో అప్పటికే తమకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెల్లడించడం తప్పనిసరి. లేదంటే భవిష్యత్తులో క్లెయిమ్ పరంగా సమస్యలు ఎదురవుతాయి. పాలసీదారు ఆరోగ్య చరిత్ర ఆధారంగానే క్లెయిమ్ రిస్క్‌ను బీమా సంస్థలు అంచనా వేస్తాయి. దానికి అనుగుణంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. చెప్పకపోతే బీమా సంస్థకు తెలియదుగా అని చెప్పి కొందరు అనారోగ్య సమస్యలను వెల్లడించరు. ఇది బీమా ఒప్పందాన్ని ఉల్లంఘించినట్టు అవుతుంది. క్లెయిమ్ సమయంలో బీమా సంస్థలు వీటిని గుర్తించినట్టయితే.. చెల్లింపులకు నిరాకరించడంతోపాటు, కవరేజీని సైతం రద్దు చేయొచ్చు. ముందస్తు వ్యాధులనే కాదు, ఏదైనా అనారోగ్యానికి సంబంధించి లోగడ చికిత్స తీసుకున్నా వెల్లడించడమే మంచిది. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ అయితే, కుటుంబ సభ్యులందరి వైద్య చరిత్రను నమోదు చేయాలి.

సరైన సమాచారం ఇవ్వాలి

బీమా సంస్థకు సమర్పించే ఇన్సూరెన్స్ క్లెయిమ్ పత్రంలో పూర్తి వివరాలు ఉండాలి. తేదీలు, చికిత్సల ప్రక్రియలకు సంబంధించి చిన్న దోషాలు కూడా ఉండకూడదు. రోగి వయసు, పేరులోనూ వ్యత్యాసాలు ఉండకూడదు. బీమా సంస్థలు ప్రతి క్లెయిమ్ దరఖాస్తును లోతుగా పరిశీలిస్తాయి. ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే మరింత సమాచారం కోరడం లేదా తిరస్కరించడం చేయొచ్చు. క్లెయిమ్ వచ్చినప్పుడు, అందులోని వ్యాధి నిర్ధారణ వివరాలను, అప్పటికే పాలసీదారు వైద్య చరిత్రతో పోల్చి చూస్తాయి. హాస్పిటల్ రికార్డులు, డాక్టర్ నోట్‌లను పరిశీలిస్తాయి. ఈ సమయంలో వ్యత్యాసాలు కనిపిస్తే చెల్లింపులను నిరాకరిస్తాయి. పాలసీ పత్రంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి నట్టు గుర్తిస్తే దాన్ని మోసం కింద పరిగణిస్తాయి. దీంతో క్లెయిమ్ రాకపోవడం కాదు, పాలసీ కూడా రద్దు కావచ్చు. అదనపు సమాచారం, వివరణ, డాక్యుమెంట్లను బీమా కంపెనీ కోరొచ్చు. దీంతో నగదు రహిత క్లెయిమ్ కాకుండా రీయింబర్స్‌మెంట్ మార్గంలో రావాలని కోరే అధికారం సైతం బీమా సంస్థకు ఉంటుంది. ముఖ్యంగా రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లను సమర్పించడం తప్పనిసరి.

మినహాయింపులు

హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారు తమ పాలసీ పరంగా ఉన్న మినహాయింపుల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. దీనివల్ల క్లెయిమ్ పరంగా సమస్యలు రాకుండా ముందే జాగ్రత్త పడొచ్చు. కొన్ని రకాల అనారోగ్యాలు, చికిత్సలు లేదా సేవలకు కొన్ని ప్లాన్లలో కవరేజీ ఉండదు.

నిబంధనల్లో మార్పులు

కొన్ని సందర్భాల్లో పాలసీ నిబంధనలు, ప్రయోజనాల్లో మార్పులు చోటు చేసుకోవచ్చు. అలాంటప్పుడు కూడా క్లెయిమ్‌లకు తిరస్కారం ఎదురవుతుంది. వాస్తవానికి ఇలాంటి వాటి గురించి పాలసీదారులకు బీమా సంస్థలు విధిగా తెలియజేస్తాయి.

సకాలంలో తెలపాలి..

ముందస్తుగా నిర్ణయించుకుని తీసుకునే నగదు రహిత చికిత్సలకు కనీసం 48 గంటల ముందు బీమా సంస్థకు తెలియజేయాలి. అత్యవసర వైద్యం అవసరమై ఆస్పత్రిలో చేరినప్పుడు నగదు రహిత క్లెయిమ్‌కు సంబంధించి 24 గంటల్లోపు బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ పెట్టుకునే వారు సైతం.. ముందస్తు ప్రణాళిక మేరకు తీసుకునే చికిత్సలు అయితే 48 గంటల ముందుగా, అత్యవసరంగా ఆస్పత్రిలో చేరితే 24–48 గంటల్లోపు సమాచారం ఇవ్వాల్సిందే. ఇక రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దరఖాస్తు, డాక్యుమెంట్లను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 30 రోజుల్లోపు సమర్పించాలి. బీమా సంస్థల మధ్య ఈ గడువులో వ్యత్యాసం ఉండొచ్చు.

పాలసీ ల్యాప్స్

పాలసీ ప్రీమియం గడువు మించకుండా చెల్లించాలి. లేదంటే పాలసీ ల్యాప్స్ అవుతుంది. ఇలా ల్యాప్స్ అయిన పాలసీలకు సంబంధించి క్లెయిమ్‌లను బీమా సంస్థలు అనుమతించవు. పాలసీ గడువు ముగిసిన తర్వాత 15–30 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. కనీసం ఈ కాలంలో అయినా ప్రీమియం చెల్లించాలి. లేదంటే పాలసీ రద్దయిపోతుంది. దీంతో బీమా కవరేజీ కోల్పోయినట్టు అవుతుంది. ల్యాప్స్ అయిన పాలసీని పునరుద్ధరించుకునే వరకు కవరేజీ ఉండదు.

అధిక చార్జీలు

ప్రతి బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితా నిర్వహిస్తుంటుంది. తమ పాలసీదారులకు రాయితీ ధరలపై చికిత్సలు అందించేందుకు వీలుగా ఆస్పత్రులతో బీమా సంస్థలకు ఒప్పందం ఉంటుంది. దీనివల్ల బీమా సంస్థలకు నెట్‌వర్క్ ఆస్పత్రుల వైపు నుంచి క్లెయిమ్‌ల వ్యయాలు తక్కువగా ఉంటాయి. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చేరినప్పుడు అవి గణనీయమైన చార్జీలు విధించొచ్చు. అలాంటి సందర్భాల్లో నగదు రహిత క్లెయిమ్‌కు బీమా సంస్థలు నిరాకరించి, రీయింబర్స్‌మెంట్ మార్గంలో రావాలని కోరొచ్చు. లేదంటే పూర్తి క్లెయిమ్ కాకుండా పాక్షికంగా చెల్లింపులు చేయొచ్చు. అందుకని నగదు రహిత చికిత్సలు కోరుకునే వారు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్‌ను ఎంపిక చేసుకోవడం మంచిది.



వెయిటింగ్ పీరియడ్

హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకున్న తర్వాత కొన్ని రకాల క్లెయిమ్‌లకు వెయిటింగ్ పీరియడ్ (వేచి ఉండాల్సిన కాలం) ఉంటుంది. ఆ కాలంలో వచ్చే క్లెయిమ్‌లను బీమా సంస్థలు తోసిపుచ్చుతాయి. హెర్నియా, క్యాటరాక్ట్, చెవి, ముక్కు, గొంతు సమస్యలు (ఈఎన్‌టీ), మోకాలి చిప్ప మార్పిడి తదితర చికిత్సలకు రెండేళ్ల పాటు వెయిటింగ్ ఉంటుంది. అలాగే, పాలసీ తీసుకునే నాటికే ఉన్న వ్యాధులకు సైతం క్లెయిమ్ కోసం నిర్దేశిత కాలం పాటు వేచి ఉండాల్సిందే. ఆ కాలంలో క్లెయిమ్‌లను అనుమతించరు.

కవరేజీ ఖర్చయిపోతే..

ఒక పాలసీ సంవత్సరంలో నిర్దేశిత కవరేజీ మొత్తం వినియోగించుకున్న తర్వాత వచ్చే క్లెయిమ్‌లకు బీమా సంస్థలు చెల్లింపులు చేయవు. అందుకే అన్ లిమిటెడ్ రీస్టోరేషన్ సదుపాయం ఉన్న పాలసీని తీసుకోవాలి. అప్పుడు బీమా ఖర్చయిపోయినా, తిరిగి అంతే మొత్తాన్ని పునరుద్ధరిస్తాయి.

ముందస్తు అనుమతి..

కొన్ని రకాల చికిత్సలకు ముందస్తు ఆమోదం తప్పనిసరి అంటూ బీమా సంస్థ నిబంధనలు విధించొచ్చు. అలాంటి వాటిపై ముందే అవగాహన ఉంటే క్లెయిమ్ నిరాకరణకు నోచుకోదు.

తిరస్కరిస్తే ఏంటీ మార్గం?

బీమా సంస్థ సహేతుక కారణం లేకుండా చెల్లింపులకు నిరాకరిస్తే చూస్తూ ఉండిపోనక్కర్లేదు. పాలసీ నియమ, నిబంధనలను ఒక్కసారి పూర్తిగా అధ్యయనం చేయాలి. 'పాలసీ వర్డింగ్స్'లో పూర్తి వివరాలు ఉంటాయి. క్లెయిమ్ తిరస్కరించడానికి కారణాలు తెలుసుకోవాలి. రిజెక్షన్ లెటర్‌లో ఈ వివరాలు ఉంటాయి. బీమా సంస్థ నిర్ణయం వాస్తవికంగా లేదని భావిస్తే అప్పుడు అప్పీల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బీమా సంస్థలోనూ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ (ఫిర్యాదుల పరిష్కార) విభాగం ఉంటుంది. క్లెయిమ్ నిరాకరించడానికి తగిన కారణాలు లేవంటూ వారికి ఫిర్యాదు సమర్పించాలి. పరిష్కారం లభించకపోతే అప్పుడు బీమా అంబుడ్స్‌మెన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడా న్యాయం జరగకపోతే అప్పుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించొచ్చు. క్లెయిమ్ పూర్తిగా కాకుండా, పాక్షికంగా చెల్లింపులు చేసిన సందర్భాల్లోనూ పాలసీదారులు న్యాయం కోరొచ్చు.

ఐఆర్‌డీఏఐ...

ఐఆర్‌డీఏఐ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సెల్‌ను సంప్రదించొచ్చు. టోల్‌ఫ్రీ నంబర్లు 155255 లేదా 1800 4254 732కు కాల్ చేసి చెప్పొచ్చు. లేదా complaints@irdai.gov.inకు మెయిల్ పంపొచ్చు. లేదా ఐఆర్‌డీఏకు చెందిన https://irdai.gov.in/ igms1 పోర్టల్ సాయంతో ఫిర్యాదు దాఖలు చేయవచ్చు.

పరిష్కార వేదికలు

అంబుడ్స్‌మెన్ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చు. వినియోగదారుల కోర్టుకు వెళ్లినా సరే పెద్దగా ఖర్చు కాదు.

భారీ పెట్టుబడులకు ఎల్ఐసీ రెడీ

- స్టాక్స్‌లో ఈ ఏడాది రూ. 1.3 లక్షల కోట్లు
- జూన్‌కల్లా రూ. 15 లక్షల కోట్లకు పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) దేశీ స్టాక్ మార్కెట్‌లో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. రూ. 1.3 లక్షల కోట్లను స్టాక్స్‌లో సరికొత్తగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ వెల్లడించారు. ఇప్పటికే ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో రూ. 38,000 కోట్ల పెట్టుబడులు కుమ్మరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 23,300 కోట్ల విలువైన పెట్టుబడులు చేపట్టింది. కాగా.. ఈ క్యూ1లో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులపై రూ. 15,500 కోట్ల లాభం ఆర్జించింది. ఇవి గతేడాది క్యూ4(జనవరి–మార్చి)తో పోలిస్తే 13.5 శాతం అధికంకావడం గమనార్హం. స్టాక్ మార్కెట్ కదలికలు, ధరల్లో మార్పులను నిశితంగా పరిశీలిస్తూ పెట్టుబడి అవకాశాలను వినియోగించుకుంటామని మొహంతీ తెలియజేశారు. కనీసం గతేడాది(రూ. 1.32 లక్షల కోట్లు) స్థాయిలో ఈ ఏడాది పెట్టుబడులను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జూన్ చివరికల్లా స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 15 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించారు. బీమా దిగ్గజం మొత్తం 282 కంపెనీలలో ఇన్వెస్ట్ చేసింది.

ఏఎంసీ జూమ్: జూన్‌కల్లా ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 16 శాతంపైగా ఎగసి రూ. 53,58,781 కోట్లను తాకాయి. గత క్యూ1కు ఇవి రూ. 46,11,067 కోట్లు.

క్యూ1 తీరిలా: క్యూ1లో ఎల్ఐసీ లాభం 10% వృద్ధితో రూ. 10,461 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 1,88,749 కోట్ల నుంచి రూ. 2,10,910 కోట్లకు పెరిగింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్‌కు అంతర్జాతీయ పరిణామాలు కీలకం
చైనా నుంచి ఎఫ్‌డీఐల ఆమోదం వేగవంతం కావాలి

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

12-8-2024	
విశాఖ	475–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	466–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	445–00
వరంగల్	447–00
రిటైల్ ధర	5.05

హిండెన్‌బర్గ్ ఆరోపణలు... నిరాధారం

కొట్టిపారేసిన సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ • వ్యక్తిత్వ హననమంటూ వ్యాఖ్య • సెబీ చీఫ్‌తో ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవన్న అదానీ

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ కొట్టిపారేశారు. అదానీ గ్రూప్ సైతం బచ్‌తో తమకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని స్పష్టంచేసింది. కాగా, అదానీ మార్కెట్ అక్రమాల్లో సెబీ చీఫ్ బచ్‌తో పాటు ఆమె భర్త ధవళ్ బచ్‌కు ప్రమేయం ఉందంటూ హిండెన్‌బర్గ్ పెద్ద బాంబ్ పేల్చిన సంగతి తెలిసిందే. బెర్ముడా, మారిషస్‌లలోని అదానీ డొల్ల కంపెనీల్లో వారిద్దరూ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారని పేర్కొంది. ఆ డొల్ల కంపెనీల నిధులనే అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ దొడ్డిదారిన భారత్‌కు తరలించి అదానీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించారనేది హిండెన్‌బర్గ్ ఆరోపణ. స్వయంగా మార్కెట్ నియంత్రణ సంస్థ చీఫ్‌నే ఈ వివాదంలోకి లాగడంతో దేశవ్యాప్తంగా పెను దుమారం చెలరేగింది. దీంతో బచ్ దంపతులు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో చేసిన ఆరోపణలన్నీ ''నిరాధారమైనవి, ఊహాగానాలు'' అంటూ తీవ్రంగా ఖండించారు. వాటిలో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు.



మా జీవితం, పెట్టుబడులు తెరిచిన పుస్తకం...


హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తీవ్ర ఆరోపణలను కొట్టిపారేస్తూ... ''మా జీవితం, పెట్టుబడులు తెరిచిన పుస్తకం. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ గతంలో చేసిన ఏ ఆరోపణలపైన అయితే సెబీ చట్టపరమైన చర్యలు చేపట్టి, షోకాజ్ నోటీసులు జారీ చేసిందో, అదే సంస్థ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరం' అని బచ్ దంపతులు పేర్కొన్నారు. తమ ఆర్థికపరమైన డాక్యుమెంట్లన్నింటినీ నిస్సంకోచంగా బయటపెట్టేందుకు సిద్ధమని, అలాగే ప్రైవేటు పౌరులుగా ఉన్నప్పటి కాలానికి సంబంధించిన ఆర్థిక వివరాలన్నింటినీ ఏ ప్రభుత్వ సంస్థ కోరినా ఇస్తామని వారు తేల్చిచెప్పారు. కాగా, అదానీల అక్రమాల్లో స్వయంగా సెబీ చీఫ్‌కు సంబంధాలుండటం వల్లే తాము బయటపెట్టిన అవకతవకలపై లోతుగా విచారణ చేపట్టేందుకు సెబీ నిరాకరించిందని హిండెన్‌బర్గ్ పేర్కొనడం గమనార్హం. మరోపక్క, అదానీ గ్రూప్‌పై ఆరోపణలన్నింటినీ తాము సక్రమంగా దర్యాప్తు చేశామని సెబీ స్పందించింది. విచారణ దాదాపు కొలిక్కి వచ్చిందని తెలిపింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన అన్ని అంశాలను చైర్‌పర్సన్ మాధవీ పురి బచ్ ఎప్పటికప్పుడు బహిర్గతం చేశారని కూడా పేర్కొంది.

హిండెన్‌బర్గ్ ఏం చేస్తుంది?

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అనేది అమెరికాకు చెందిన ఇన్వెస్టర్ల తరఫున గొంతెత్తే చిన్న రీసెర్చ్ సంస్థ. కొంతమంది రీసెర్చర్ల సహకారంతో 2017లో దీన్ని నాథన్ ఆండర్సన్ నెలకొల్పారు. బాగా పేరొందిన కంపెనీల్లో అకౌంటింగ్ అవకతవకలు, ఇతరత్రా కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలను గుర్తించేందుకు ఫైనాన్షియల్ ఫోరెన్సిక్ సాధనాలను ఉపయోగించి అధ్యయనం చేస్తుంది. గతంలో కూడా నికోలా, క్లోవర్ హెల్త్, బ్లాక్ ఇంక్, కాండీ, లార్డ్స్‌టౌన్ మోటార్స్ వంటి కంపెనీలను ఇది టార్గెట్ చేసింది.

బిజినెస్ మోడల్ ఇదీ.. అవకతవకలపై రీసెర్చ్ నివేదికలను క్లయింట్లకు ఇస్తుంది. నివేదికను పబ్లిక్‌గా బహిర్గతం చేయడానికి ముందే క్లయింట్లు, హిండెన్‌బర్గ్ కూడా ఆయా కంపెనీల షేర్లలో షార్ట్ పొజిషన్లు (ముందుగా షేర్లను అమ్మేసి, బాగా పడిన తర్వాత తిరిగి కొనుగోలు చేయడం ద్వారా సొమ్ము చేసుకోవడం) తీసుకుంటారు. రిపోర్ట్ వెలువడిన తర్వాత సదరు కంపెనీ షేర్లు భారీగా పడిపోవడంతో ఇరువురికీ భారీగా లాభాలొస్తాయి. అదానీ షేర్ల విషయంలో కూడా ఇదే జరిగింది. కాగా, అదానీ ఉదంతంలో తమకు కేవలం 4.1 మిలియన్ డాలర్లు మాత్రమే లభించాయని, రెండేళ్ల పాటు ప్రపంచవ్యాప్తంగా తమ రీసెర్చ్, విచారణ కోసం వెచ్చించిన భారీ మొత్తంతో పోలిస్తే తమకు పెద్దగా ఒరిగిందేమీ లేదని హిండెన్‌బర్గ్ చెప్పడం విశేషం!

బ్లాక్‌స్టోన్‌లో ధవళ్ పదవిపై...



బ్లాక్‌స్టోన్ రియల్టీ కార్యకలాపాలతో ధవళ్ బచ్‌కు ఎలాంటి సంబంధం లేదని బచ్ దంపతుల ప్రకటన పేర్కొంది. సెబీ చైర్‌పర్సన్‌గా బచ్ నియామకానికి ముందే 2019లో ధవళ్ బచ్‌ను బ్లాక్‌స్టోన్ తమ సీనియర్ అడ్వయిజర్‌గా నియమించుకుందని ప్రకటన స్పష్టం చేసింది. సప్లయి చైన్ మేనేజ్‌మెంట్‌లో ధవళ్ నైపుణ్యం ఆధారంగానే ఆయనకు ఆ పదవి దక్కిందని పేర్కొంది. రియల్టీ, రీట్‌లపై సెబీ తీసుకున్న నిర్ణయాలు, సంప్రదింపుల ప్రక్రియ అనంతరం బోర్డు ఆమోదం మేరకే జరిగాయని, చైర్‌పర్సన్ ఒక్కరే ఆ నిర్ణయాలు తీసుకోలేదని కూడా వారు వివరణ ఇచ్చారు.

బచ్‌పై ఆరోపణలు ఇవీ...




'2017లో సెబీలో హోల్‌టైమ్ మెంబర్‌గా బచ్ నియామకానికి ముందే 2015లో బచ్ దంపతులు ఈ అదానీ డొల్ల కంపెనీల్లో (బెర్ముడాకు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్) ఇన్వెస్ట్ చేశారు. సింగపూర్‌లోని ఐపీఈ ప్లస్ ఫండ్ 1లో (ఇది మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్) వారు తొలుత ఖాతా తెరిచారు. దీనికి సంబంధించిన సంస్థలు అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో ట్రేడింగ్ చేస్తుండేవి. ఇండియా ఇన్ఫోలైన్ (ఐఐఎఫ్ఎల్) మేనేజ్ చేసిన ఈ వెల్త్ మేనేజ్‌మెంట్ ఫండ్స్‌లో వినోద్ అదానీకి కూడా పెట్టుబడులు ఉన్నాయి. అందులో ఆయన డైరెక్టర్ కూడా. 2022లో బచ్ సెబీ చైర్‌పర్సన్ అయ్యారు. దీంతో అదానీకి చెందిన మారిషస్, ఇతరత్రా డొల్ల కంపెనీలపై దర్యాప్తును సెబీ పెద్దగా పట్టించుకోలేదు. అదానీ గ్రూప్‌నకు పవర్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో ఇన్వాయిస్‌లను పెంచి చూపడం ద్వారా విదేశీ డొల్ల కంపెనీలకు పక్కదారి పట్టించిన నిధులను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ భారత్ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఉపయోగించుకున్నారు' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. కాగా, తమ ఐపీఈ ప్లస్ ఫండ్ 1 అదానీ గ్రూప్ షేర్లలో ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని 360 వన్ (గతంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్) స్పష్టం చేసింది. 2013 అక్టోబర్–2019 అక్టోబర్ మధ్య నిర్వహించిన తమ ఫండ్‌లో బచ్ దంపతులు చేసిన పెట్టుబడులు మొత్తం నిధుల్లో 1.5 శాతం కంటే తక్కువేనని, పెట్టుబడి నిర్ణయాల్లో ఇన్వెస్టర్ల ప్రమేయం ఏదీ లేదని కూడా పేర్కొంది.

దురుద్దేశపూరితం: అదానీ



హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలను అదానీ గ్రూప్ కూడా తీవ్రంగా తోసిపుచ్చింది. 'చట్టాలు, వాస్తవాలను బేఖాతరు చేస్తూ, స్వలాభం కోసం ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని దురుద్దేశపూరితంగా, ఊహాజనితంగా, తారుమారు చేసే విధంగా మార్చిన నివేదిక' అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించిన సమాచారంలో అదానీ గ్రూప్ పేర్కొంది. మా ప్రతిష్ఠను దిగజార్చే ఈ ఉద్దేశపూర్వక ప్రయత్నంలో పేర్కొన్న వ్యక్తులతో గానీ, అంశాలతో గానీ అదానీ గ్రూప్‌నకు ఎలాంటి వ్యాపారపరమైన సంబంధాలు లేవని స్పష్టం చేసింది. పారదర్శకతకు తాము కట్టుబడి ఉన్నామని, చట్టపరమైన, నియంత్రణ సంస్థల నిబంధలనకు అనుగుణంగానే నడుచుకుంటున్నామని తేల్చిచెప్పింది. 'పూర్తిగా దర్యాప్తు చేసిన, నిరాధారమని నిరూపితమైన, 2023లో సుప్రీం కొట్టేసిన అవే ఆరోపణలను హిండెన్‌బర్గ్ పదేపదే తిరగదోడుతోంది. భారతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, తప్పుదోవ పట్టించేలా ఆ సంస్థ కావాలనే ఈ ఆరోపణలు గుప్పిస్తోంది' అని పేర్కొంది.

జరిగింది ఇదీ...



అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో విదేశీ కంపెనీలకు భారీ వాటాలపై పెద్దయెత్తున ఆరోపణలు రావడంతో సెబీ 2020 అక్టోబర్‌లో దర్యాప్తు మొదలుపెట్టింది. అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు నిజమైన పబ్లిక్ షేర్‌హోల్డర్లా.. లేదంటే ప్రమోటర్లకు సంబంధించి బినామీలుగా వ్యవహరిస్తున్నారా అనేది తేల్చడమే ఈ దర్యాప్తు ప్రధానోద్దేశం. కాగా, గతేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ తొలిసారిగా అదానీ అక్రమాలపై విడుదల చేసిన నివేదిక సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకోవడమే కాకుండా, అకౌంటింగ్ మోసాలకు కూడా పాల్పడిందని ఆరోపణలు గుప్పించింది. దీంతో అదానీ షేర్లు కుప్పకూలడం, 150 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరయ్యేందుకు దారితీసింది. కాగా, షేర్ల ధరల భారీ పతనం, అవకతవకలపై సుప్రీం కోర్టు సెబీతో మరో దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు నియంత్రణపరమైన ఉల్లంఘనల నిగ్గు తేల్చాల్సిందిగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, అన్నీ సక్రమంగానే ఉన్నాయంటూ కమిటీ నివేదిక ఇవ్వడం గమనార్హం. దీంతో సెబీ చేస్తున్న దర్యాప్తు సరిపోతుందని, సీబీఐ, సిట్ వంటి సంస్థలకు అప్పగించాల్సిన అవసరం లేదని సుప్రీం స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత కోల్పోయిన మార్కెట్ విలువను అదానీ గ్రూప్ షేర్లు పూర్తిగా తిరిగి చేజిక్కించుకుని దూసుకుపోతుండం విశేషం. గత నెలలో కోటక్ మహీంద్రా బ్యాంక్‌ను సైతం హిండెన్‌బర్గ్ ఈ వివాదంలోకి లాగింది. అదానీ డొల్ల కంపెనీలతో ఆ బ్యాంకుకు సంబంధాలున్నాయని ఆరోపించింది. అయితే, కోటక్ బ్యాంక్ కూడా దీన్ని ఖండించింది. కాగా, వాస్తవాలను దాచిపెడుతూ, సంచలనం కోసమే హిండెన్‌బర్గ్ అదానీపై ఆరోపణలు చేసిందని, అదానీ షేర్ల పతనం ద్వారా లాభపడేందుకు అది న్యూయార్క్ హెడ్జ్ ఫండ్‌తో కుమ్మక్కయిందని పేర్కొంటూ గత నెల 26న సెబీ హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఏకంగా సెబీ చీఫ్‌నే ఈ వివాదంలోకి లాగడం కొత్త ట్విస్ట్.



పంట పొలాల్లోకి గజరాజులు

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కెల్ల సమీపంలోని ఏనుగుల గుంపు నాగావళి నది దాటుకొని విజయనగరం జిల్లా వంగర మండలం వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోకి ప్రవేశించింది. ఆదివారం ఉదయం పట్టా చిన సింహాచలం, కోట్ల ఉమా, పెద్దింటి సింహాద్రినాయుడులకు చెందిన మొక్కజొన్న, పామాయిల్ పంటలను నాశనం చేసింది. ఆరు ఏనుగుల గుంపులో ఒక ఏనుగు పిల్లకు జన్మనిచ్చింది. పంటలు దెబ్బతిన్న రైతులు లబోదిబోమంటున్నారు. - వంగర



వర్ణశోభిత దివ్య ఔషధం అగ్నిశిఖ

ప్రకృతి ప్రసాదితమైన నల్లమల్ల అడవులు వర్షాలు కురిసే ఆగస్టు మాసంలో విరబూసిన వివిధ రకాల పుష్పాలతో అందాల హరివిల్లుగా మారతాయి. వన మూలికల వృద్ధికి దోహదపడతాయి. ఆయుర్వేదంలో విశేష ప్రాముఖ్యత ఉన్న అగ్నిశిఖ మొక్క ఇక్కడే విశేషంగా పెరుగుతోంది. వర్ణశోభితంగా కనులవిందు చేస్తోంది. అడవి నాభి అని కూడా పిలిచే ఈ మొక్క ఇంగ్లిషులో గ్లోరీ లిల్లీగా ప్రసిద్ధి. ఈ మొక్క నిలువెల్లా విషమే. అయితే వైద్యుల సూచనలతో వినియోగించుకుంటే దివ్య ఔషధమే అవుతుంది. గ్లోరియోసా సూపర్బా అని కూడా పిలిచే ఈ మొక్కలో కోల్చీసిన్, గ్లోరియోజిన్ అనే రెండు ఆల్కలాయిడ్స్ ఉంటాయి. వీటి వల్ల ఈ మొక్క అత్యున్నత ఔషధంగా ప్రసిద్ధి చెందింది. పాము విషాన్ని సైతం విరుగుడు చేయవచ్చు అని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. ఈ పుష్పం జింబాబ్వే జాతీయ పుష్పంగా ఉంది. తమిళనాడు రాష్ట్రానికి కూడా అధికార పుష్పం కావడం విశేషం. - ఆత్మకూరు రూరల్

క్లుప్తంగా...

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

- చోరీకి దుండగుల యత్నం
- ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల అప్రమత్తతతో పరార్



రాళ్ల దాడి జరిగిన ప్రదేశం

దాచేపల్లి :పల్నాడు జిల్లా నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌పై గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి రాళ్ల దాడికి తెగబడ్డారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల అప్రమత్తం కావడంతో దుండగులు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే... నర్సాపూర్ నుంచి సికింద్రాబాద్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ బయలు దేరింది. శనివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో నడికుడి రైల్వేస్టేషన్ దాటింది. నడికుడి జంక్షన్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ వద్ద నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ బోగీలో చైను లాగి దుండగులు రైలును ఆపారు. అప్పటికే రైలులో మకాం వేసిన దుండగులు చోరీకి ప్రయత్నం చేస్తుండగా బోగీలో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు అప్రమత్తమై విజిల్స్ వేశారు. ఒక దశలో ఫైరింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. బోగీలో దాగి ఉన్న ముగ్గురు దుండగులు ఇది గమనించి రైలు దూకి పరారయ్యారు. రైలు ఆగిన సమయంలో ఈ దుండగులతోపాటు మరో నలుగురు అక్కడే కాపు కాసి ఉన్నారు. వారి చోరీ ప్రయత్నం విఫలం కావడంతో రైలు బోగీపై రాళ్లు రువ్వారు. ఘటనా స్థలాన్ని జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు పరిశీలించారు.

'నెమలి కర్రీ' వీడియోతో బుక్కయ్యాడు

- యూట్యూబర్‌ను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు
- వండిన కూర సీజ్, పోలీసులకు ఫిర్యాదు



తంగళ్లపల్లి (సిరిసిల్ల): 'ట్రెడిషనల్ పికాక్ కర్రీ రెసిపీ' అంటూ ఓ యూట్యూబర్ తన చానల్‌లో వీడియో పోస్టు చేసి అడ్డంగా బుక్కయ్యాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్ శ్రీటీవి అనే యూట్యూబ్ చానల్‌లో నెమలి వంట చేయడం గురించి వీడియో పోస్టు చేశాడు. ఈ విషయంపై 'యూట్యూబ్‌లో నెమలికూర వంటకం' అనే శీర్షికతో 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. తంగళ్లపల్లిలో వంట చేసిన స్థలాన్ని పరిశీలించి, ప్రణయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి కల్పనాదేవి మాట్లాడుతూ, వంటకాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నెమలి పేరుతో వీడియో పెట్టినందుకు అటవీచట్టం ప్రకారం కేసు నమోదు చేశామని, పలు అటవీ జంతువులు, పక్షుల వంటకాల వీడియోలు కూడా పోస్టు చేసినట్లు గుర్తించామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలలో ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రవణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ఎంఏ ఖలీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతో తెలంగాణ స్పీకర్ ప్రసాద్ భేటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈమేరకు ఆయన జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. తిరుమలలో వెంకన్న దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ చంద్రబాబును కోరినట్టు తెలిసింది. కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా ఆదివారం చంద్రబాబు నాయుడిని కలిశారు.

పుట్టిన పల్లెను విడిచిపెట్టేందుకు గ్రామీణ యువత ఏమాత్రం ఇష్టపడేవారు కాదు. చదువుతో సంబంధం లేకుండా సాగులో తల్లిదండ్రులకు సాయపడే వారు. వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్నే ప్రధాన వృత్తిగా ఎంచుకొనేవారు. పది మందికి అన్నం పెట్టేవారు. పదుగురికి ఉపాధి చూపేవారు. ఇదంతా నిన్నటి మాట. ఇప్పుడు వ్యవసాయం పట్ల గ్రామీణ యువతలో ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు మళ్లుతున్నారే తప్ప సాగు చేసేందుకు మాత్రం ముందుకు రావడంలేదని డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ యూనిట్ (డీఐయూ) విడుదల చేసిన స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయిమెంట్ రిపోర్టు-2024 వెల్లడించింది.



మాయమైపోతున్నాడు రైతన్నవాడు

సాగుకు యువత దూరం..
స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయిమెంట్ రిపోర్టులో వెల్లడి

సాక్షి, అమరావతి: వ్యవసాయం ఆశించతగ్గ వృత్తి కాదని తెగేసి చెబుతున్నారని ఈ నివేదిక తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేటు కొలువులు రాకపోయినా, ఆదాయ మార్గాలు బాగున్న ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకొంటున్నట్లు పేర్కొంది. సాగులో సరైన ఆదాయం లేక రైతులే వారి పిల్లలను వ్యవసాయం చేయొద్దని సలహాలు ఇస్తున్నారు. ఆందోళన కల్గించే మరో విషయం ఏమిటంటే ప్రస్తుతం సాగు చేస్తున్న వారిలో 60 శాతం మంది లోటు ఉత్పాదకత కారణంగా సాగును వదిలేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో 63 శాతం మంది వ్యవసాయం లాభసాటి కాదని స్పష్టం చేశారు.

21 రాష్ట్రాల్లో సర్వే

కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా, గ్లోబల్ ఆపర్చ్యూనిటీ యూత్ నెట్‌వర్క్, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇంక్యుబేటర్ సంస్థలతో కలిసి డీఐయూ ఈ పరిశోధన చేసింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 'గ్రామీణ ప్రాంతాల్లో యువత - ఉపాధి అవకాశాల'పై నిర్వహించిన సర్వేతో పాటు వివిధ అంశాలపై శాస్త్రీయ పద్ధతుల్లో లోతైన పరిశీలన జరిపి విడుదల చేసిన ఈ నివేదికలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా 5,169 మంది గ్రామీణ యువతను డీఐయూ బృందాలు సంప్రదించాయి. పురుషులు–మహిళలను 50 : 50 నిష్పత్తిలో సర్వే చేశారు. వీరిలో 18–25 ఏళ్ల మధ్య ఉన్న వారు 26.6%, 26–35 ఏళ్ల మధ్య ఉన్న వారు 73.4% మంది ఉన్నారు. వ్యవసాయం పట్ల యువత ఆలోచన సరళిపై ఆ సంస్థ వివిధ కోణాల్లో అధ్యయనం చేసింది.

మహిళల్లో 40 శాతం మందికే ఉపాధి



ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మంది 40 ఏళ్ల పైబడిన వారే ఉన్నారు. పైగా 18–25 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువకుల్లో సగానికిపైగా ఏదో ఒక వృత్తి చేస్తుండగా, మహిళల్లో నాలుగో వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. 26–35 ఏళ్ల మధ్య ఉన్న యువకుల్లో దాదాపు 85 శాతం మంది జీతంతో కూడిన పని చేస్తుండగా, 10 శాతం నిరుద్యోగులుగా ఉన్నారు. ఇదే వయస్సు కలిగిన మహిళల్లో 40 శాతం మంది మాత్రమే పని చేస్తున్నట్టుగా గుర్తించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల వైపు



సాగుకు అనువైన భూమి, తగిన సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడం, ఇన్‌పుట్స్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం.. మరీ ముఖ్యంగా రైతుకు నిర్దిష్టమైన ఆదాయం లేకపోవడం వంటి కారణాలే వ్యవసాయం పట్ల గ్రామీణ యువతలో ఆసక్తి సన్నగిల్లిపోతుండడానికి ప్రధాన కారణంగా ఈ సర్వేలో గుర్తించారు. అయితే ఐటీ, ఇంజనీరింగ్ ఇతర వృత్తుల వైపు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ, మెజార్టీ గ్రామీణ యువత మాత్రం ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలుగా వ్యవసాయ అనుబంధ రంగాలనే ఎంచుకునేందుకు ముందుకొస్తుండడం ఇక్కడ చెప్పుకోతగ్గ సానుకూల అంశంగా పేర్కొనవచ్చు.

జీవించడానికి తగిన ఆదాయం వ్యవసాయంలో రావడంలేదని గ్రామీణ యువత తేల్చేసింది. కూలి పనికి పోయినా రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు వస్తుందని, ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడినా వ్యవసాయంలో వచ్చే ఆదాయం రోజువారీ కుటుంబ పోషణకు కూడా సరిపోవడంలేదని స్పష్టం చేశారు. కుటుంబం సంతోషంగా జీవించేందుకు వ్యవసాయం ఉపయోగకరం కాదని 63.8 శాతం పురుషులు, 62.7 శాతం మహిళలు చెప్పారు. దూరాభారమైనా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కోసం పల్లె విడిచి

పల్లె విడిచి వెళ్లేందుకు సిద్ధం

వెళ్లేందుకే మెజార్టీ గ్రామీణ యువత సిద్ధపడుతున్నారు. వ్యవసాయంకంటే మెరుగైన ఆదాయం వచ్చే ఉపాధి మార్గాలు ఉన్నాయని పురుషుల్లో 38 శాతం, మహిళల్లో 51.4 శాతం మంది చెప్పారు. లాభసాటి కాని వ్యవసాయం చేసేకంటే గ్రామం విడిచి ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు పురుషుల్లో 32.3 శాతం, మహిళల్లో 23.6 శాతం మంది స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత చాలా తక్కువ ఉందంటూ పురుషుల్లో 67.6 శాతం, మహిళల్లో 68.9 శాతం మంది చెప్పుకొచ్చారు. సాగుకు అనుకూలమైన భూమి కొరత ఉందని పురుషుల్లో 42.9 శాతం, మహిళల్లో 57.2 శాతం మంది అభిప్రాయపడ్డారు. పైగా మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఏటా ప్రతి సీజన్‌లోనూ వాతావరణం సాగుకు అనుకూలించడంలేదని పేర్కొన్నారు. తరచూ వచ్చే విపత్తుల వల్ల అన్ని విధాలుగా నష్టపోయేది రైతులేనని పురుషుల్లో 44.2 శాతం, మహిళల్లో 39.7 శాతం అభిప్రాయపడ్డారు.

ఒకే పోగుతో జాతీయ జెండా

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ముర్ము అభినందనలు



జాతీయ జెండాతో రూపకర్త సత్యనారాయణ

సీటీఆర్‌ఐ: ఒకే పోగుతో 8 అడుగుల వెడల్పు, 10 అడుగుల పొడవుతో జాతీయ జెండాను చేనేత కళాకారుడు రుద్రాక్షల సత్యనారాయణ రూపొందించారు. రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఆచంట వేమవరానికి చెందిన సత్యనారాయణ రూపొందించిన జెండాను ఆదివారం రాష్ట మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించి అభినందించారు. త్రివర్ణ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య స్ఫూర్తితో దీన్ని తయారు చేసినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ జెండాను ఐదేళ్ల క్రితమే తయారు చేశానని, అప్పట్లో ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అప్పటి తెలుగు రాష్ట్రాల సీఎంలు వైఎస్ జగన్, కేసీఆర్ జెండాను చూసి అభినందించారన్నారు. పార్లమెంటరీ కమిటీ ఈ జెండాని పరిశీలించిందని, ఎర్రకోటపై దీనిని ఎగురవేసే సందర్భం కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఒకే దారంలో ఇంత గొప్ప సాహసోపేతమైన జాతీయ జెండాను తయారు చేయటం ఉభయ గోదావరి జిల్లా వాసులకు గర్వకారణమన్నారు. రాకా సంస్థ ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సురపురెడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈ నియామకాల్లో ప్రమోషన్ కోటా కుదింపు

- 30 ఏళ్లుగా 70 శాతం ఉన్న ప్రమోషన్ కోటాను 50 శాతానికి తగ్గించిన ప్రభుత్వం
- ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగంలోని అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నియామకాల్లో 30 ఏళ్ల నుంచి అమల్లో ఉన్న 70 శాతం పదోన్నతుల కోటాను 50 శాతానికి ప్రభుత్వం కుదించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఆ ఉత్తర్వులను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట కర్యవర్గం ఆదివారం విజయవాడలో సమావేశమై ఏఈ నియామకాల్లో పదోన్నతుల కోటాను తగ్గించడాన్ని తీవ్రంగా ఖండించింది. జోన్–4 పరిధిలోని జిల్లాల ఏఈలకు సంబంధించిన 30 ఏళ్ల సీనియారిటీ లిస్టులను పదోన్నతుల కోటా తగ్గింపునకు అనుగుణంగా అక్రమంగా మార్పులు చేస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు కూడా జారీ చేశారని, వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వీస్ రూల్స్ సవరించి 70 శాతం కోటా కొనసాగించాలని, ప్రస్తుతం ఆమోదం పొందిన సీనియార్టీ లిస్టు ప్రకారం ఏఈలకు డీఈలుగా పదోన్నతులు కల్పించాలని కోరింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు కె.రవీంద్ర, కార్యదర్శి బి.రత్నప్రసాద్, గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, సలహాదారుడు జి.హనుమంతరావు, ఉపాధ్యక్షులు జి.కేశవులు, ఎ.చందు నాయుడు, టి.గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.రాంబాబు, 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శిశువులను విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

- విశాఖలో ఎనిమిది మంది అరెస్ట్

టీచర్లోడ్డు: విశాఖపట్నంలో శిశువులను విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి... ఐదు నెలల శిశువును విక్రయిస్తుండగా ఎనిమిది మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నంలో ఓ ముఠా శిశువులను విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. పథకం ప్రకారం ముఠా సభ్యులతో మాట్లాడి శిశువు కావాలని కోరారు. వారితో రూ.7 లక్షలకు శిశువు కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 3 గంటల సమయంలో సిరిపురం జంక్షన్‌కు 8 మంది సభ్యులు ఐదు నెలల శిశువును తీసుకొచ్చారు. స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శిశువును విక్రయిస్తూ దొరికిన ముఠాలో కేజీహెచ్ సిబ్బంది కూడా ఉన్నట్లు సమాచారం. అయితే, ప్రాథమిక విచారణలో బిడ్డను పోషించలేక అమ్మకానికి పెట్టినట్లు ఆ చిన్నారి తల్లి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'అసైన్డ్' ఆగడం!

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి హక్కులతోపాటు అవసరాలకు విక్రయించుకునే అవకాశమిచ్చింది. ఒకవేళ ఇప్పటికే చేతులు మారినా ఒరిజినల్ అసైనీలకే హక్కులు ఉండేలా చర్యలు తీసుకుంది. మరి అలాంటప్పుడు అది బడుగు, బలహీన వర్గాల రైతులకు మేలు చేసినట్లా? కీడు చేసినట్లా? అని కూటమి ప్రభుత్వాన్ని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

చిరకాల వాంఛ నెరవేర్చిన వైఎస్ జగన్

ప్రభుత్వాల నుంచి భూములు పొందిన లక్షలాది మంది నిరుపేద రైతుల చిరకాల కోరికను నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం నెరవేర్చింది. పేదలకు అసైన్ చేసిన (కేటాయింపు) భూములపై వారికి కేటాయించిన తేదీ నుంచి 20 సంవత్సరాల తర్వాత హక్కులు లభించేలా 1977–అసైన్డ్ భూముల చట్టానికి 2023లో కీలక సవరణ చేసింది. దీంతో 27 లక్షల మంది అసైన్డ్ భూముల రైతన్నలు తమ భూములపై హక్కులు (ఫ్రీ హోల్డ్) పొందే అవకాశం కలిగింది. అయితే అసైన్డ్ భూములు చాలా వరకు అన్యాక్రాంతమయ్యాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఒరిజినల్ అసైనీ (ఒరిజినల్ కేటాయింపుదారు)కే యాజమాన్య హక్కులు కల్పించింది. ఎవరు పడితే వారు అసైన్డ్ భూములను సొంతం చేసుకునే ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి భూములు పొందిన వారు లేక వారి వారసులకు మాత్రమే అసైన్డ్ భూములపై హక్కులు కల్పించింది. ఈ క్రమంలో పూర్తి వెరిఫికేషన్ తర్వాత 9 లక్షల ఎకరాలపై సంబంధిత రైతులకు హక్కులు కల్పించి ఆ భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించింది. మిగిలిన భూములపైనా వెరిఫికేషన్ పూర్తి చేసి 22 ఏ జాబితా నుంచి తొలగించాల్సి ఉండగా కూటమి సర్కారు ఆ పని నిలిపివేసింది. అంతటితో ఆగకుండా గత ప్రభుత్వం 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములకు చెందిన రైతులపైనా విచారణ పేరుతో కక్ష సాధింపులకు దిగింది. విచారణలో సక్రమమని తేలిన భూములపైనా ఆంక్షలు కొనసాగించాలని, ప్రభుత్వానికి తెలియకుండా వాటిని 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించకూడదని స్పష్టం చేయడాన్ని బట్టి చంద్రబాబు సర్కారు పేద అసైన్డ్ రైతులపై ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

రైతుల చేతుల్లోనే 97.22% భూములు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పేదల అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ కావడం, వాటిపై వారికి సంపూర్ణ హక్కులు లభించడంతో ఏదో గోల్‌మాల్ జరిగిందని, అన్యాక్రాంతమయ్యాయని కూటమి సర్కారు దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి 22 ఏ జాబితా నుంచి తొలగించిన 9 లక్షల ఎకరాల్లో విక్రయాలు జరిగింది కేవలం 25 వేల ఎకరాలు (2.78 శాతం) మాత్రమే. అంటే ఒరిజినల్ అసైనీలు మాత్రమే ప్రయోజనం పొందారు. మిగిలిన 97.22 శాతం భూములపై కూడా హక్కులు ఒరిజినల్ రైతుల చేతుల్లోనే ఉన్నాయి. దీన్ని చంద్రబాబు ప్రభుత్వం తప్పుగా చిత్రీకరిస్తూ అసైన్డ్ భూముల చట్ట సవరణను తప్పు పడుతోంది. అదే సమయంలో చట్ట సవరణను కొనసాగిస్తామని ప్రకటించింది. దీన్నిబట్టి అసైన్డ్ భూములపై దళితులకు, బడుగులకు హక్కులు దక్కకూడదన్నదే చంద్రబాబు సర్కారు లక్ష్యంగా కనపడుతోంది.

విస్తృత అధ్యయనం తర్వాతే చట్ట సవరణ

అసైన్డ్ భూములపై పేద రైతులకు యాజమాన్య హక్కులు కల్పించటానికి ముందు వైఎస్ జగన్ ప్రభుత్వం విస్తృతంగా అధ్యయనం చేసింది. అప్పటి రెవెన్యూ మంత్రి నేతృత్వంలో ఎమ్మెల్యేలతో కమిటీని నియమించింది. వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన కమిటీ అసైన్‌మెంట్ భూముల చట్టాలు, నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి గత ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత ఒరిజినల్ లబ్ధిదారులకు లేదా వారి వారసులకు అవసరమైనప్పుడు అమ్ముకునేందుకు వీలు కల్పించాలని, అందుకు అనుగుణంగా ఏపీ అసైన్‌మెంట్ చట్టం (పీఓటీ)– 1977కి సవరణలు చేయాలని కమిటీ సిఫారసు చేసింది.

పీఓటీ 1977 చట్టం స్ఫూర్తిని గౌరవిస్తూ..

అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని గత ప్రభుత్వానికి కమిటీ సిఫారసు చేయగా దీనికి నాటి మంత్రివర్గం ఆమోదం తెలిపి చట్టానికి సవరణలు చేసింది. 20 ఏళ్లకు ముందే ఎవరైనా పేద రైతుల నుంచి భూములు కొనుక్కుంటే వారికి ఎలాంటి ప్రయోజనం దక్కని విధంగా కూడా అదే సందర్భంలో చట్ట సవరణ చేసింది. తద్వారా అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకూడదన్న ఒరిజినల్ పీఓటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్)–1977 చట్టం స్ఫూర్తిని గౌరవించింది. తద్వారా అసైన్‌మెంట్ అయిన దగ్గర నుంచి 2023లో చట్ట సవరణ జరిగే వరకూ అసైన్డ్ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన రైతులకు మాత్రమే మేలు జరుగుతుంది. ఇలా ఒరిజినల్ అసైనీలకు మాత్రమే ప్రయోజనం దక్కేలా చర్యలు తీసుకున్నారు.

పేద రైతులను రోడ్డుకీడ్చేసి..

గత ప్రభుత్వం ఇంత పకడ్బందీగా చట్ట సవరణ చేసి అసైన్డ్ భూములపై విప్లవాత్మక నిర్ణయం తీసుకుంటే దాన్ని వక్రీకరించి భూములన్నీ అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కుట్ర మినహా మరేమీ లేదని స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలు అసైన్డ్ భూములను సొంతం చేసుకున్నట్లు కూటమి సర్కారు అభాండాలు మోపుతోంది. ఫ్రీ హోల్డ్ అయిన 9 లక్షల ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగింది కేవలం 25 వేల ఎకరాలే. అందులో ఎక్కడైనా తేడాలున్నాయని భావిస్తే విచారణ నిర్వహించుకోవచ్చు. అంతేగానీ ఒరిజినల్ అసైనీల చేతుల్లో ఉన్న మొత్తం ఫ్రీహోల్డ్ భూములన్నింటిలోనూ తప్పులు జరిగాయని వితండవాదం చేస్తూ ఆ రైతులను రోడ్డు కీడ్చడం కచ్చితంగా పేదలపై కక్ష సాధించడమే. పేదలంతా వైఎస్ జగన్‌కు అండగా ఉండడాన్ని జీర్ణించుకోలేని కూటమి సర్కారు వారిని ఇక్కట్లకు గురి చేస్తూ బురద జల్లడానికి సిద్ధపడినట్లు స్పష్టమవుతోంది.

బ్యాంకు రుణాలు రాకుండా చేసింది..



ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు 20 ఏళ్లకు పైబడి లబ్ధిదారుల ఆధీనంలో ఉంటే సంపూర్ణ యాజమాన్య హక్కులు దక్కేలా గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ ప్రక్రియ కొనసాగుతుండగా టీడీపీ కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయడం దారుణం. భూములు చేతిలో ఉన్నా అవసరానికి బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం లేకుండా చేసింది. గత ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును రద్దు చేయడం సరికాదు.
– ఆంద్రా వెంకట సుబ్బారెడ్డి, రైతు, ఆత్మకూరు

నిలిపివేయడం అన్యాయం..



గత ప్రభుత్వం అసైన్డ్ భూములపై పేదలకు కల్పించిన యాజమాన్య హక్కులను కూటమి సర్కారు హరించడం దారుణం. ఇది పేద రైతుల కడుపు కొట్టడమే. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లతో ఎంతో మంది పేద రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.
– బోన నర్సింగరావు, జేవి అగ్రహారం, భీమిలి నియోజకవర్గం

రైతులకు తీవ్ర ఇబ్బందులు..



ఫ్రీ హోల్డ్ అయిన చుక్కల భూములు, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం దారుణం. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. గత ప్రభుత్వం అన్ని రకాల విచారణలు నిర్వహించాకే అనుమతించింది.
– జీ రామయ్య, రైతు, పొదలకూరు మండలం, నెల్లూరు జిల్లా

పేదల కడుపుకొడుతున్నారు..



మాకు తిరుపతి సమీపంలో నాలుగు ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గత ప్రభుత్వం సర్వ హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఎంతో సంతోషపడ్డాం. గతంలో ఎంతో మంది పాలకులు హామీలిచ్చినా నెరవేర్చలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చింది. కొత్త ప్రభుత్వం రాగానే ఫ్రీ హోల్డ్ పేరుతో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయడం దారుణం. పేదల పట్ల ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదు. చంద్రబాబు నిరుపేదల కడుపు కొడుతున్నారు.
–ప్రభాకర్, భైరాగిపట్టెడ, తిరుపతి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

దేశాన్ని గౌరవించాలి


త్రివర్ణ పతాకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దేశంలో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలు దేశాన్ని, దేశ రాజ్యాంగాన్ని గౌరవించాలని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం విద్యాలయం సంచాలకురాలు స్మిత పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని విశ్వ విద్యాలయంలో జరిగిన జాతీయ హర్ ఘర్ తిరంగా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆగస్టు 15 త్రివర్ణ జెండాను ప్రతి ఒక్కరు ఎగురవేయాలన్నారు. త్యాగం, బలిదానంతో పొందిన స్వాత్యంత్రాన్ని రక్షించడం మనందరి కర్తవ్యమన్నారు.

బస్సు-ఆటో ఢీ, ముగ్గురు మృతి

సాక్షి,బళ్లారి: బస్సు – ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన ఘటన బీదర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం బీదర్ జిల్లా బాల్కీ ప్రధాన రహదారి -50లో మహారాష్ట్ర బస్సు –ఆటో ఢీకొన్న ఘటనలో అనితా భాయి (45) ఆమె ఇద్దరు సంతానం ఘటనలో స్థలంలోనే మృతి చెందగా, మరో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ప్రతిభకు తార్కాణం కావాలి


జ్యోతి వెలిగిస్తున్న కుమార్ తదితరులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ప్రతిభకు తార్కాణం కావాలని విధాన పరిషత్ సభ్యుడు వసంత కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగ మందిరంలో భగీరథీ జయంతి ప్రతిభా పురస్కారాలను అందించి మాట్లాడారు. సమాజంలో సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వార్థం వీడి పని చేయాలన్నారు. మహర్షి భగీరథుడు చేసిన సేవలను ఈ సందర్భంగా వివరించారు. ప్రతి ఒక్కరు ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో బుగ్గారెడ్డి, ఆదిరాజ్, అమరేష్, బసవరాజ్, విరుపాక్షి, రవీంద్ర జాలదార్, దేవన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా వాసులకు భారత్ పౌరసత్వం

రాయచూరు రూరల్: కర్ణాటకలో నివాసం ఉంటున్న బంగాదేశీయులకు భారత్ పౌరసత్వం లభించింది. రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా ఆర్‌హెచ్ క్యాంప్‌లో ఉంటున్న ఐదుగురు బంగ్లాదేశీయులకు భారతీయ పౌరసత్వం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశ పత్రాలను పంపించింది. 1971లో బంగ్లాదేశ్ విభజన సమయంలో బంగ్లా, బర్మాల నుంచి భారత్‌కు వలసలు వచ్చారు. సింధనూరు తాలూకాలో 932 కుటుంబాలు నివసించడానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించారు. 932 కుటుంబాలకు గాను కేవలం ఐదుగురికి మాత్రమే పౌరసత్వం ఇచ్చారు.

సాహితీవేత్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో మార్పులకు అనుగుణంగా పూరాతన కాలం నాటి సంస్కృతిని, ఆచారాలను అలవర్చుకునే విధంగా రాసిన పుస్తకాలకు, సాహితీవేత్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని కిల్లే బ్రహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం కన్నడ భవనంలో తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్ష్మీదేవి శాస్త్రి రాసిన చాగి హిరేమఠ చెన్న బసవ శాస్త్రి దర్శన పుస్తకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు వెంకటేష్, అయ్యప్ప హుడా, గురుప్పనాగప్ప, లక్ష్మీదేవి శాస్త్రి, విశ్వనాథ్ శాస్త్రి, ప్రతిభా తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షలు టోకరా

హుబ్లీ: షేర్ మార్కెట్ పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునంటూ నమ్మించి ధార్వాడకు చెందిన విజయకుమార్ అనే వ్యక్తి నుంచి దశల వారీగా రూ.62.03 లక్షలను బదలాయించుకొని వంచించిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వ్యాట్సాప్‌లో లింక్ పంపించిన వంచకులు ఓ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసి ఓ ప్రైవేట్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలో పేరు చేర్పించారు. ఆ తర్వాత వేరువేరు కంపెనీల నుంచి షేర్లను కొనుగోలు చేయించి తిరిగి వాటికి విక్రయిస్తామంటు నమ్మించి ఎక్కువ డబ్బు లు పెట్టుబడి పెట్టాలని నమ్మించి, వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ. 62 లక్షలకు పైగా బదలాయించుకుని మోసగించినట్లు బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిర్వహణ లోపంతోనే

క్రస్ట్ గేట్ తెగిందా ?

- 70 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటి సారిగా ఊడిన డ్యాం క్రస్ట్ గేటు



హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పలు జిల్లాల ప్రజలు, రైతులకు తాగు, సాగుకు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర క్రస్ట్‌గేట్లలో 19వ గేట్ తెగిపోవడంతో రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో మిగతా గేట్లపై నీటి ఒత్తిడి పెరగకుండా 33 గేట్లను పైకెత్తి లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. డ్యామ్ పూర్తిగా నిండి రెండు పంటలకు సరిపడ నీరు ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. తాజా పరిస్థితులతో ఒక్క పంటకు కూడా నీరు అందక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

గేట్ తీసే సమయంలో జాగ్రత్తలు పాటించలేదా ? :

డ్యామ్ ఇన్‌ఫ్లో తగ్గడంతో రాత్రి డ్యామ్ గేట్లు మూసివేసేందుకు ప్రయత్నించారు. దీంతో 19వ గేటు చైన్ తెగింది. దీంతో అధికారులు ఆందోళన చెందారు. గేటు తీసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. 70 ఏళ్ల క్రితం నిర్మించిన డ్యామ్ చైన్‌లింక్ నిర్వహణ సరిగా లేక తెగిపోయింది. ఈసారి వర్షాలు బాగా కురవడంతో జలాశయం పొంగిపొర్లుతోంది. మరమ్మతులు చేయాలంటే రిజర్వాయర్‌లో 60 టీఎంసీల నీటిని బయటకు వదలాల్సి ఉంటుందని డ్యామ్ కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, సూపరిన్‌టెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి 60 టీఎంసీల నీరు బయటకు పంపిన తర్వాత గేటుకు సంబంధించిన పూర్తి పునరుద్ధరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. మరో వైపు ఆదివారం ఉదయం డ్యామ్‌ను కర్ణాటక మంత్రి శివరాజ్, తంగడిగ, ఎంపీ తుకారాం , ఎమ్మెల్యే గవియప్ప సందర్శించారు. తెలంగాణ, చెన్నై నుంచి ఇంజనీర్ల నిపుణులు కూడా పిలిపిస్తున్నారు. ఇక డ్యామ్ నుంచి నీటిని పెద్ద ఎత్తున విడుదల చేస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

బీజేపీలో పతాకస్థాయికి చేరిన అసమ్మతి

- మైసూరు ఛలోకు దీటుగా బళ్లారి పాదయాత్రకు ఫిక్స్?
- సెప్టెంబర్17న పాదయాత్ర చేపట్టాలని నిర్ణయం
- బీవై విజయేంద్రకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు భేటీ

సాక్షి,బళ్లారి: వాల్మీకి నిగమ మండలిలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు, ముడాలో జరిగిన అవినీతి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను సీఎం కుర్చీ నుంచి దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ఎలాగైన ఇరుకున పెట్టాలని, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై విజయేంద్ర నేతృత్వంలో బెంగళూరు మైసూరుకు ఛలో పాదయాత్ర చేపట్టి పూర్తి చేసిన నేపథ్యంలో బీజేపీలో అసమ్మతి నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం బెళగావికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు రమేష్ జారికిహోళి నేతృత్వంలో పలువురు అసమ్మతి బీజేపీ ఎమ్మెల్యేలు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించడం కలకలం రేపింది. ఈ సమావేశంలో ఛలో మైసూరుకు దీటుగా బెళగావి నుంచి ఛలో బళ్లారి పాదయాత్ర చేపట్టేందుకు నేతలు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారు. బెళగావి నుంచి బళ్లారికి పాదయాత్ర చేపట్టేందుకు అసమ్మతి నేతలు బెళగావి జాంబోటి రోడ్డులో ఉండే రిసార్ట్‌లో రమేష్ జారికిహోళి, అరవింద లింబావళి, ప్రతాప్ సింహ, అణ్ణాసాహెబ్ జొళ్లే, కుమార బంగారప్ప, జీఎం సిద్దేశ్‌తో పాటు పలువురు ప్రముఖ బీజేపీ నాయకులు పాల్గొని యడియూరప్ప, ఆయన తనయుడు బీ.వై. విజయేంద్రకు వ్యతిరేకంగా చర్చలు జరిపి, పాదయాత్ర చేపట్టి తమ సత్తా చాటాలని చూస్తున్నారు.సెప్టంబర్ 17న పాదయాత్ర ప్రారంభించాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని తమను పక్కన పెట్టినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి, ప్రతిపక్ష నాయకుడు అశోక్‌కు తగిన గుణపాఠం చెప్పాలనే ఆలోచనలో అసమ్మతి నేతలు గ్రూపుగా మారడంతో రాష్ట్ర బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. బీజేపీలో అసమ్మతి భగ్గుమనడంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు అవకాశాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉంది.


బెళగావిలో భేటీ అయిన బీజేపీ అసమ్మతి నాయకులు

బోగీల సంఖ్య పెంచాలి

హుబ్లీ: రైల్వే ప్రైవేటీకరణ నిలిపి వేయడంతో పాటు సాధారణ, స్లీపర్ బోగీల సంఖ్య పెంచాలని, అదే విధంగా రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఐఓ అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో ధార్వాడ రైల్వే స్టేషన్‌లో సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ అభియాన్‌కు శ్రీకారం చుట్టింది. స్టేషన్‌లోని ప్రయాణికుల నుంచి సంతకాలు తీసుకోవడమే కాకుండా భారతీయ రైల్వే ప్రైవేటీకరణను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేసింది. అన్ని ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి రైల్వే సేవల విస్తరణకు అనుగుణంగా ఎక్కువ ఉద్యోగాలను కల్పించాలి. సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లను పెంచాలని పదాధికారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భవాని శంకర్‌గౌడ, రణదీప్ దుపద, ప్రీతి సింగాడి, సిమోన్ సూర్యవంశీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇక్కడి గోకుల్ రోడ్డు నెహ్రూ నగర్ హోటల్ వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై గోకుల్ రోడ్డు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మరో ఘటన సోషల్ మీడియాలో హిందూ ధర్మాన్ని అవమాన పరుస్తూ వ్యాఖ్యలను ప్రసారం చేసిన మల్లికార్జున్‌పై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక భజరంగదళ్ నేత హెగ్గేరి నివాసి చేతన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల బాధ్యతారాహిత్యం


డ్యాంను పరిశీలిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

హొసపేటె: తుంగభద్ర డ్యామ్ సంబంధించిన 33 గేట్లలో 19వ గేట్‌కు సంబంధించిన చైన్ లింక్ శనివారం రాత్రి తెగి పోవడంతో ఆదివారం డ్యామ్ పరిశీలనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరుపాక్షి అధికారులపై మండిపడ్డారు. గేట్ తెగి పోవడానికి కారణం ఏమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ అధికార ప్రభుత్వం డ్యామ్ నిర్వహణపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదని తెలిపారు. ఇచ్చట ఉన్న బోర్డు అధికారులు కూడా గేట్ల నిర్వహణ విషయంపై సరిగా పట్టించుకోకపోవడంతో ఈ రోజు గేట్ తెగిపోవడానికి ముఖ్య కారణం అయిందని తెలిపారు. ముందుగా గేట్ విషయానికి సంబంధించి ఎందుకు నిర్వహణ చర్యలు చెప్పట్టడం లేదని ప్రశ్నించారు. నీటి వృథాతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రైతులకు, ప్రజలకు తీవ్రనష్టం ఏర్పడిందని తెలిపారు. బోర్డు అధికారులు రెండు రోజుల్లో గేట్ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్యామ్ అభివృద్ధికి అన్ని విధాలా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంజుమన్ సంస్థ అధ్యక్షుడిపై దాడికి యత్నం


మీడియాతో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు

హుబ్లీ: స్థానిక అంజుమన్ సంస్థ అధ్యక్షుడు ఇస్మాయిల్‌పై దాడికి యత్నించినట్లు ఆయన కుటుంబ సభ్యులు ధార్వాడ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంట్లోకి చొరబడి దాడికి యత్నించారు. అంజుమన్ సంస్థ కార్యాలయంలో 10 మందికి పైగా యువకులు ఇస్మాయిల్ కోసం వచ్చారు. ఆయన అక్కడ లేకపోవడంతో ఏకంగా ఇంటికి వచ్చారు. అయితే ఆయన ఇంట్లో కూడా లేకపోవడంతో ఇంట్లో వారిని దుర్భషలాడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. కుటుంబ సభ్యుడు ఇక్బాల్ మాట్లాడుతూ.. తన అన్నపై కుట్ర జరుగుతోందని, ఈ విషయంపై తమతో కూడా చెప్పారని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారులపై మండిపడ్డ ఎంపీ


అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప, ఎంపీ తుకారాం

హొసపేటె: తుంగభద్ర డ్యామ్‌కు సంబంధించిన 33 గేట్లలో 19వ గేట్‌కు సంబంధించిన చైన్ లింక్ శనివారం రాత్రి తెగి పోవడం ఆదివారం డ్యామ్ పరిశీలనకు వచ్చిన ఎంపీ తుకారాం అధికారులను లెఫ్ట్‌రైట్ తీసుకున్నారు. గేట్ తెగి పోవడానికి కారణం ఏమని ప్రశ్నించారు. అధికారులు గేట్ల నిర్వాహణ విషయంపై నిర్లక్ష్యం వహించడంతో ఈ రోజు గేట్ తెగి పోవడానికి ముఖ్యకారణం అయిందని ముందుగా గేట్ విషయానికి సంబంధించి ఎందుకు నిర్వహణ చర్యలు చెప్పట్ట లేదని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వలనే ఈ రోజు ఘటన చోటు చేసుకొందని మండిపడ్డారు. ప్రస్తుతం డ్యామ్ పూర్తిగా నిండటంతో నీటి ప్రవాహం జోరుగా ఉంది. మొత్తం గేట్లను పైకెత్తి దిగువకు సుమారు 90 వేల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేశారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీ స్వాధీనం

క్రిష్ణగిరి: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీని ఖనిజ సంపద శాఖాధికార్లు స్వాధీనపరుచుకొని మహారాజగడ పోలీసులకు అప్పగించారు. వివరాల మేరకు క్రిష్ణగిరి ఖనిజ సంపద శాఖాధికారి శరవణన్ నేతృత్వంలో అధికార్లు కల్లుగురికి బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ లారీని పరిశీలించగా అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు తెలిసింది. లారీని స్వాధీనపరుచుకొని మహారాజగడ పోలీసులకు అప్పగించారు.

వసతి నిలయాలలో సౌకర్యాలు కల్పించండి

కోలారు: జిల్లా వ్యాప్తంగా అసౌకర్యాల మధ్య ఉన్న హాస్టళ్లకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం ప్రాంగణం వద్ద సమావేశమైన రైతు సంఘం పదాధికారులు జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. హాస్టళ్లకు నాసిరకం ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, పేద విద్యార్థుల జీవితాలలో అధికారులు చెలగాటం ఆడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్ మాట్లాడుతూ... జిల్లాలో ఎన్నో సమస్యలు పట్టి పీడిస్తున్నా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాత్రం ఇటు వైపు తిరిగి చూడడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం పదాధికారులు మంగసంద్ర తిమ్మణ్ణ, యల్లప్ప, హరీష్, విజయపాల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన రైతు సంఘం పదాధికారులు

కాలువల ఆధునికీకరణ, డ్యాం పటిష్టతపై వైఎస్సార్ ముందుచూపు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి మూడు రాష్ట్రాలకు సక్రమంగా నీరు చేరాలంటే ముందుగా కాలువలు పటిష్టంగా ఉండాలని, అప్పుడే రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేస్తారని భావించి అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించారు. ఇందు కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతో హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాలువలు రూపురేఖలు మారి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందింది. 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి అయ్యాక కూడా కాలువలు ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. ఏటా కాలువలకు నీరు వదిలేముందు, సంబంధిత అధికారులతో చర్చించేవారు. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునేవారు. అయితే ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, ఏపీలో కూటమి పాలకులు డ్యాం నుంచి కాలువలకు నీరు వదిలే ముందు, కాలువలు, గేట్ల పరిస్థితిపై ఎలాంటి సమీక్ష నిర్వహించలేదు. దీంతోనే టీబీ డ్యాంలో గేటు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్యాం క్రస్ట్ గేటు 19వ చైన్ లింక్ తెగిపోవడంతో డ్యాం నుంచి నదిలోకి కొట్టుకుపోవడంతో మూడు రాష్ట్రాలకు చెందిన రైతులు పంటలపై ప్రశ్నార్థకంగా మారింది. హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఎల్ఎల్‌సీ ఆధునీకరణ పనులు కూడా దాదాపు 75 శాతం పూర్తి చేశారు. ప్రతి ఏటా కాలువలకు నీరు నిలుపుదల చేసినప్పుడు కాలువలు దుస్థితి, గేట్లు ఎలా ఉన్నదానిపై ప్రత్యేక సమీక్ష జరిపి, ముందుచూపుతో ఆలోచించడం బోర్డు అధికారులు దృష్టి పెట్టలేదని రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు. ఈ సందర్భంగా తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నిర్మాణాలు పూర్తి చేసి 75 సంవత్సరాలు పూర్తి అయిందని, కాలువలు ఆధునికీకరణతో పాటు గేట్ల దుస్థితిపై కూడా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధ్యక్షుడిగా నియామకం

కోలారు: కోలారు జిల్లా కాంగ్రెస్ సమితి పదాధికారుల విభాగం నూతన అధ్యక్షుడిగా టీఎస్ సుధీర్‌ను నియమిస్తూ కర్ణాటక ప్రదేశ కాంగ్రెస్ సమితి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నటరాజ గౌడ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నటరాజగౌడ మాట్లాడుతూ... జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు గౌతం, రంజిత్, అహిందా రాష్ట్ర అధ్యక్షుడు సి సోమశేఖర్, నవీన్‌గౌడ తదితరులు అభినందించారు.

హాస్టల్ కుక్ సస్పెండ్

కోలారు: హాస్టల్‌లో దోసెలు తిని 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనకు సంబంధించి హాస్టల్ వంట ఉద్యోగి నరసింహప్పను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ రాకేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శాఖపరమైన విచారణకు ఆదేశించారు. హాస్టల్ వార్డెన్ గరుశాంతప్ప సెలవుపై వెళ్లారు. వంట ఉద్యోగి నరసింహప్పనే హాస్టల్ నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో స్వచ్ఛత లేదు. విద్యార్థులను తిట్టడం, కొట్టడం చేసేవాడని సమాచారం. రెండు రోజుల క్రితం నాటి అన్నాన్ని దోసె పిండిలో కలిపారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సైతం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి ఆ శాఖ ఏడీ చెన్నబసప్పకు కూడా నోటీసులు ఇచ్చారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


ప్రేమజంట

హుబ్లీ: పరస్పరం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న ప్రేమజంటకు తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించారు. ధార్వాడ యువకుడు శంబు, హావేరి యువతి షాలిని మధ్య ఆరేళ్ల క్రితం ప్రేమ చిగురించింది. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు వారి ప్రేమను వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో యువతికి మరో యువకుడితో పెళ్లి నిశ్చయం చేశారు. దీంతో ప్రేమజంట పారిపోయి పెళ్లి చేసుకున్నారు. యువతి తల్లిదండ్రుల నుంచి బెదిరింపులు రావడంతో ప్రాణ భయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ తెరవడానికి అనుమతి

కోలారు: మాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలకు సంబంధించి హైకోర్టు అడిగిన దాఖలాలు సమర్పించడానికి ఈ నెల 13న జిల్లా యంత్రాంగం ఈవీఎంలు భద్ర పరచిన కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూంను తెరవనున్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూం తెరవడానికి రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి అనుమతి ఇచ్చారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రముఖుల సమక్షంలో మంగళవారం మాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్‌రూంను తెరవనున్నారు. కౌంటింగ్ సమయంలో సంగ్రహించిన దాఖలాలను కోర్టుకు సమర్పించడం జరుగుతుంది. స్ట్రాంగ్ రూం తెరిచే రోజున హాజరు కావాలని కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఎం, ఆప్ పార్టీల జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులకు ఇప్పటికే కలెక్టరేట్ అధికారులు సమాచారం ఇచ్చారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలో మాలూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కెవై నంజేగౌడ 50,955 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కెఎస్ మంజునాథ్‌గౌడ 50,707 ఓట్లు సాధించారు. కెవై నంజేగౌడ 248 ఓట్ల తేడాతో మంజునాథ్‌గౌడపై విజయం సాధించారు. దీంతో రీకౌంటింగ్ నిర్వహించాలని పరాజిత బీజేపీ అభ్యర్థి మంజునాథ్‌గౌడ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతోంది.

నగరంలో నవోదయ క్రీడల అకాడమీ


పూజలో పాల్గొన్న రెడ్డి దంపతులు

రాయచూరు రూరల్: నగరంలోని నవోదయ వైద్య కళాశాల ప్రాంగణంలో రూ.12 కోట్లతో నవోదయ క్రీడల అకాడమీ ఏర్పాటుకు నారాయణ పేట శాసనసభ సభ్యుడు రాజేంద్ర రెడ్డి భూమిపూజ చేశారు. నవోదయ విద్యాసంస్థల్లో విద్యనభ్యశించే విద్యార్థులకు నాణ్యతతో కూడిన క్రీడా పోటీలను అందించడానికి క్రికెట్ పోటీలు, శిక్షణ, 400 మీటర్ల పరుగు పందెం ట్రాక్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ వంటి పోటీల నిర్వహణకు శ్రీకారం చుడుతామన్నారు.

నారద గడ్డ క్షేత్రం ఆస్తుల నిర్వహణపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న నితీశ్

రాయచూరు రూరల్: పవిత్ర పుణ్యస్థలం నారద గడ్డ క్షేత్రం ఆస్తుల నిర్వహణకు సంబంధించి భక్తుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. రాయచూరు తాలూకా నారద గడ్డ పుణ్యస్థలం చెన్న బసవ స్వామి మఠం పరిధిలో 1200 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఈ విషయంలో మఠం ఆస్తులు కోడేకల్‌కు చెందిన శివానంద స్వామిజీ మాన్యం భూములు తనవంటు 18 ఏళ్ల క్రితం కోర్టు మెట్లెక్కారు. హైకోర్టులో వంశపారం పర్యంగా మఠం ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ఉరవకొండ కరిబసవ మఠం అజమాయిషీలో చెన్నబసవ స్వామి పేరు మీద ఉన్నాయని భక్తులు జిల్లా అధికారి నితీశ్ కుమార్‌కు విన్నవించారు. హైకోర్టు వాదోపవాదనలు విన్న అనంతరం జనాభిప్రాయ సేకరణకు ఆదేశాలు జారీ చేసింది. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మెహబూబీ, తహసీల్దార్ సురేశ్ వర్మ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు జాగృతి


జాతాను ప్రారంభిస్తున్న నమోషి

రాయచూరు రూరల్: కలబుర్గి జిల్లాలో డెంగీ వ్యాధి నియంత్రణకు జన జాగృతి అవసరమని విధాన పరిషత్ సభ్యుడు సుశీల్ నమోషీ పేర్కొన్నారు. ఆదివారం కందకూరులో కలబుర్గి హైదరాబాద్ కర్ణాటక విద్యా సంస్థ వి.జీ జూనియర్ కళాశాలలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతా ఉద్దేశించి మాట్లాడారు. ఇళ్ల ముందు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని, నీటి నిల్వలు, కాలువల వద్ద శుభ్రత పాటించాలన్నారు. జాతాలో ప్రిన్సిపాల్ రాజేంద్ర,లక్ష్మి బాయి, కుపేంద్ర, భారతీ, నాగేంద్ర, ప్రేమ్‌చంద్, పాటిల్, మహేష్, రేణుక, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఫలం ఆశించకుండా దేశ సేవ చేయాలి


మొక్కకు నీరు పోస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిఫలం ఆశించకుండా దేశ సేవ చేయాలని హైదరాబాద్ కర్ణాటక విద్యా సంస్థల సంచాలకుడు నాగన్న ఘంటి పేర్కొన్నారు. ఆదివారం కలబుర్గి హైదరాబాద్ కర్ణాటక విద్యా సంస్థ వీరమ్మ గంగ సిరి మహిళ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వార్షిక సేవా కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల క్రమశిక్షణకు ఎన్ఎస్ఎస్ అనుబంధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అక్క మహాదేవి విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ అధికారి మహేష్, రేణుక, సుష్మా, పాటిల్, కవిత, రాజేష్, ప్రేమ్‌చంద్, సుభాష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఆందోళనకు బయలు దేరిన ఉపాధ్యాయులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది.ఆదివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన జిల్లాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. 2016లో విధుల్లో చేరిన వారికి పదోన్నతి కల్పించాలన్నారు. రాష్ట్రంలో 1,88,532 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, నూతన జాతీయ విద్యా విధానం వల్ల ఉపాధ్యాయులకు ఏర్పడ్డ ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. సోమవారం బెంగళూరులో జరిగే రాష్ట్ర ఆందోళనకు మద్దతుగా రాయచూరు నుండి 500 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు.